www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 201 | గురువారం | 10 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

కొత్త చరిత్ర

అగ్రవర్ణ పేదల 10%కోటాకు పార్లమెంట్ ఆమోదం

రాజ్యసభలో కూడా నెగ్గిన బిల్లు



ప్రధాని మోడీ ప్రభుత్వం అత్యంత సాహసోపేతంగా ప్రతిపాదించిన అగ్రవర్ణ పేదల కోటా బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర పడిన చరిత్రాత్మక మలుపు... ఇంతవరకూ దేశంలో రిజర్వేషన్లకు ఉన్న 50% హద్దు చెరిగిపోతున్న దృశ్యం సాకారం కానున్న సందర్భం... ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల్లోని పేదలకు 10% రిజర్వేషన్లను కల్పించే బిల్లుకు రాజ్యసభ 165-7 ఓట్ల తేడాతో బుధవారం రాత్రి ఆమోదం తెలిపింది. చట్టబద్ధత సాధించడం కోసం 15,16 అధికరణలకు ప్రత్యేక క్లాజ్‌ను చేరుస్తూ ప్రతిపాదించిన 124వ రాజ్యాంగ సవరణ బిల్లును లోక్‌సభలో ఆమోదం పొందిన రీతిలోనే యధాతథంగా రాజ్యసభ ఓకె చేసింది. అనంతరం నిరవధికంగా వాయిదా పడింది



న్యూఢిల్లీ: అగ్రవర్ణాలలోని పేదలకు పదిశాతం రిజర్వేషన్ల కోటాను కల్పించే రాజ్యాంగ సవరణ బిల్లుకు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. బిల్లుకు అనుకూలంగా 165 మంది వ్యతిరేకంగా ఏడుగురు ఓటేశారు. ఇబిసి బిల్లుపై సభలో సుదీర్ఘ చర్చ తరువాత డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్ డివిజన్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. అంతకు ముందు బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలనే డిఎంకె సభ్యురాలు కనిమొళి సవరణ ప్రతిపాదన కూడా సభలో ఓటింగ్ దశలో వీగిపోయింది. దీనికి అనుకూలంగా 18 మంది సభ్యులు ఓటేశారు. కాగా వ్యతిరేకంగా 155 మంది ఓటేశారు. ఇక ప్రైవేటు రంగంలోనూ తరువాయి 6లో

కోటాపై రాష్ట్రాలకు స్వేచ్ఛ ఉండాలి

- బండ ప్రకాశ్



3

నమో విజయ నాట్యం



60% రిజర్వేషన్లకు ఆమోదముద్ర గెలిచిన 124 రాజ్యాంగ సవరణ

కూలనున్న 50శాతం హద్దు గోడ

ఇబిసిలకు 10-శాతం కోటా బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలపడం సామాజిక న్యాయానికి దక్కిన విజయం. యువశక్తి తన సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి ఇదొక సదవకాశం. 124వ రాజ్యాంగ సవరణ బిల్లుకు మద్దతు పలికిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు. దీనిపై సభల్లో అద్భుతమైన చర్చ జరిగింది ప్రతి ఒక్కరూ ముందు చూపుతో విలువైన అభిప్రాయాలను చెప్పారు.

- రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన తర్వాత మోడీ ట్వీట్



బిల్లు ఆమోదం పొందిన తర్వాత పార్లమెంట్ వెలుపల విజయ సంకేతం చూపుతున్న కేంద్రమంత్రులు థావర్‌చంద్ గెహ్లాట్, విజయ్ గోయెల్ తదితరులు

చెన్నైకి నీళ్లు ఇవ్వలేం : ఏపి

- తమిళనాడు రాజధాని నగర మంచి నీటి అవసరాలకు తన వాటా మేరకు ఇస్తానన్న తెలంగాణ
- ఆ ఏర్పాటే మంచిది కాదన్న మహారాష్ట్ర



మన తెలంగాణ /హైదరాబాద్

చెన్నయ్ త్రాగునీటి అవసరాల కోసం కృష్ణా నీటిని సరఫరా చేయడంపై మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాయి. నీటిని సరఫరా చేయలేమంటూ ఆంధ్రప్రదేశ్ వ్యాఖ్యానించగా, మంచి నీటి అవసరాల కోసం కాబట్టి తమ వాటాగా ఎంత ఇవ్వాలో ఆ మేరకు సరఫరా చేస్తామని తెలంగాణ స్పష్టం చేసింది. చెన్నయ్‌కు నీరు ఇవ్వాలన్న నిర్ణయంలోనే లోపం ఉందని మహారాష్ట్ర వాదించింది. నగరంలోని జలసౌధలో బుధవారం సాయంత్రం జరిగిన కృష్ణా నది యాజమాన్య బోర్డు సమావేశంలో మూడు రాష్ట్రాలూ పై విధంగా వ్యాఖ్యానించాయి. కర్నాటక తరఫున ఎవ్వరూ హాజరుకాకపోవడంతో ఆ రాష్ట్ర అభిప్రాయం వెల్లడి కాలేదు. చివరకు రెండు టిఎంసిల నీటిని ఇవ్వడానికి ఆంధ్రప్రదేశ్ అంగీకరించగా తెలంగాణ మాత్రం ఒప్పందం ప్రకారం చెన్నయ్ నగరానికి ఎంత ఇవ్వాలో ఆ మేరకు ఇస్తామని స్పష్టం చేసింది. మార్చి చివరికల్లా ఆయా రాష్ట్రాలు వాటి వాటా ప్రకారం ఎంత గరిష్ట స్థాయిలో నీరు ఇవ్వగలవో ఆ మేరకు ఇవ్వాలని బోర్డు తరువాయి 6లో

ఆంధ్రలో రైతుబంధు అమలు చేస్తా

పాదయాత్ర ముగింపు సందర్భంగా వైఎస్‌ఆర్‌సిపి నేత వైఎస్‌జగన్



మన తెలంగాణ/హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు, రైతు బీమా పథకాలు దేశవ్యాప్తంగా జనామోదం పొందాయని, రైతు సంక్షేమం దృష్ట్యా ఆయా పథకాలను ఆంధ్రప్రదేశ్ లోనూ అమలు చేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరువాయి 6లో

గూగుల్‌పే పట్టిచ్చిన గొలుసు దొంగలు

- హైదరాబాద్ నగర శివారులో హడలెత్తించిన చైన్ శ్నాచర్లను పట్టుకున్న పోలీసులు
- బంగారు ఆభరణాలు, కెటిఎమ్ బైక్ స్వాధీనం
- హైదరాబాద్‌లో వివిధ లాడ్జీల్లో బస చేసిన ఉత్తరాది ముఠా

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో

వరుస చైన్‌స్నాచింగ్‌లు చేసి రాచకొండ పోలీసులను పరుగులు పెట్టించిన ముగ్గురు సభ్యుల



అంతరాష్ట్ర దొంగల ముఠాను టాస్క్‌ఫోర్స్, భవానీ నగర్ పోలీసులు, రాచకొండ ఎస్‌ఓటి సిబ్బంది అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు, కెటిఎం, బజాజ్ పల్సర్ బైక్, కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల తరువాయి 6లో

కుంచెపోటు



ఓటు హక్కుపై కోటి లేఖలు

కోటి కుటుంబాలకు రాస్తున్నాం : రజత్‌కుమార్



మన తెలంగాణ/హైదరాబాద్

రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు కోటి లేఖలు రాయనున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రజత్ కుమార్ తెలిపారు. 'ఓటు మీ హక్కు. ఓటు వేయడం మీ బాధ్యత' అనే నినాదంతో ఆ లేఖలో ఓటు హక్కు నమోదు చేసుకోవడం ఎలా, ఓటు ను ఒక చోటు నుంచి మరొక చోటుకి మార్చుకోవడం, తరువాయి 6లో

13.81కోట్లు జిఎస్‌టి ఎగవేత

రిసార్ట్ సిఎండి అరెస్టు

మన తెలంగాణ/హైదరాబాద్

హైదరాబాద్ నగర శివారులో ఓ ప్రముఖ రిసార్ట్ సిఎండిని జిఎస్‌టి ఎగవేతకు పాల్పడినందుకు పోలీసు అధికారులు బుధవారం అరెస్టు చేశారు. కొంతకాలంగా జిఎస్‌టి ఎగవేతకు పాల్పడినందుకు ఆయనపై చర్యలు తీసుకున్నట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి తెలిపింది. రిసార్ట్స్‌కు వచ్చే కస్టమర్ల నుంచి జిఎస్‌టి వసూలు చేస్తున్న సదరు



రిసార్ట్ నిర్వాహకులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ. 13.81 కోట్ల రూపాయలు జిఎస్‌టి మొత్తాలను పక్కదారి పట్టించినట్లు డిజిజిఐ అధికారులు పేర్కొంటున్నారు. చట్టం ప్రకారం వినియోగ దారుని నుంచి వసూలు చేసిన జిఎస్‌టిని నిర్ణీత గడువులోపు నేరుగా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు. కాగా రిసార్ట్ నిర్వాహకుడు నిబంధనలను పట్టించుకోకుండా పన్ను ఎగవేతకు పాల్పడ్డారని వివరించారు. జిఎస్‌టి వసూలు చేసేందుకు ఆదాయపు పన్ను శాఖ సదరు రిసార్ట్స్‌కు గతంలో పలుమార్లు నోటీసులు అందజేసినట్లు తెలిపారు. జిఎస్‌టి నిబంధనల తరువాయి 6లో

సాయికృష్ణ కుటుంబానికి 10లక్షల సాయం



మన తెలంగాణ/మహబూబాబాద్ ప్రతినిధి

అమెరికాలోని మిచిగాన్ కాల్పుల్లో గాయపడ్డ మహబూబాబాద్ వాసి సాయికృష్ణ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. బుధవారం సాయికృష్ణ తల్లిదండ్రులు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి సియం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.10లక్షలు చెక్కులు తీసుకున్నారు. తల్లిదండ్రులు అమెరికా వెళ్ళేందుకు, వైద్యఖర్చుల నిమిత్తం ఈ తరువాయి 6లో

వినియోగదారుల ఫిర్యాదుల విచారణ

హైదరాబాద్‌లో సర్క్యూట్ బెంచ్

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి జాతీయ వినియోగదారుల కమీషన్‌లో ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న వినియోగదారుల ఫిర్యాదుల అప్పీలు, రివిజన్ పిటిషన్‌లపై విచారణ జరిపేందుకు జాతీయ వినియోగదారుల వివాదాల, రిడ్రెసల్ కమిషన్ (ఎన్‌సిడిఆర్‌సి) రెండు వారాల పాటు హైదరాబాద్‌లో సర్క్యూట్ బెంచ్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు ఆదర్శనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర పుడ్ కమిషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో వినియోగదారుల భద్రతా చట్టం ప్రకారం పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ జరగనుంది. కోటి రూపాయలు, అంతకు పైబడిన ఫిర్యాదులను కూడా వినియోగదారులు ఈ సర్క్యూట్ బెంచ్‌లో నేరుగా ఫిర్యాదు చేయవచ్చని, రెండు రాష్ట్రాలకు సంబంధించి కొత్తగా అప్పీళ్ళుగాని, రివిజన్ పిటిషన్లుగాని నేరుగా ఈ సమయంలో దాఖలు చేసుకోవచ్చని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. వినియోగదారులు తమ ఫిర్యాదుల పరిష్కారం కోసం ఢిల్లీ వరకు వెళ్ళాల్సిన అవసరం లేదని, ఆయా రాష్ట్రాల్లోనే పరిష్కారమయ్యే విధంగా జాతీయ కమిషన్ ఈ సర్క్యూట్ బెంచ్‌లను ఏర్పాటు చేస్తోందని పేర్కొనింది. గతంలో జాతీయ కమిషన్ కేసుల విచారం కోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, పూణె, కొచ్చిన్, అహ్మదాబాద్, భోపాల్, నాగ్‌పూర్, చండీఘడ్, జైపూర్, లఖ్‌నవ్, కోలకత్తాలలో సర్క్యూట్ బెంచ్‌లను ఏర్పాటు చేసిందని, ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పెండింగ్‌లో ఉన్న వినియోగదారుల కేసుల పరిష్కారానికి జాతీయ కమిషన్ అధ్యక్షుడు ఆర్‌కె అగర్వాల్ నేతృత్వంలో కేసుల విచారణ జరగనుందని తెలిపింది. వినియోగదారుల కేసులకు సంబంధించి నెల రోజుల ముందు నోటీసులు అందుకున్నవారు ఈ సర్క్యూట్ బెంచ్ ముందు హాజరు కావల్సి ఉంటుందని వివరించింది.

ఐదుగురు సభ్యులతో ఫార్మసీ కౌన్సిల్ ఏర్పాటు

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ సభ్యులుగా ఐదుగురిని నియమిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులను విడుదల చేసింది. ఈ నెల 11 వ తేదీన దీనిపై గెజిట్ ప్రచురితం కానుంది. ఎన్నికైన ఐదుగురు సభ్యుల్లో హైదరాబాద్ నుంచి ఆకుల సంజయ్ రెడ్డి, సిరిసిల్ల నుంచి కె. శ్రీనివాస్ వరంగల్ కు చెందిన శ్రీనివాస్, నల్లగొండకు చెందిన చంద్రశేఖర్ అజాద్, పెద్దపల్లికి చెందిన ఎం. వినోద్ కుమార్‌లు ఉన్నారు. వీరి పదవీకాలం ఐదేళ్ల పాటు కొనసాగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఫార్మసీ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన సంజీవరెడ్డి ప్రస్తుతం రాష్ట్ర ఫార్మసిస్ట్ సంఘం అధ్యక్షుడిగా ఉన్నారు.

పరిశ్రమలతో ఎంఒయులు తప్పనిసరి

కళాశాలల అనుమతులకు ఎఐసిటిఇ నిబంధన



మనతెలంగాణ/హైదరాబాద్ : ఇంజనీరింగ్ విద్యార్థులు కోర్సు పూర్తి కాగానే ఉపాధి పొందేలా అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఎఐసిటిఇ) నిబంధనలు రూపొందించింది. ఇక నుంచి పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకునే ఇంజనీరింగ్ కళాశాలలకే అనుమతులు ఇచ్చేలా నిబంధన విధించింది. ఎఐసిటిఇ అనుమతి కావాలంటే ఇంజనీరింగ్ కళాశాలలు, పరిశ్రమలతో కనీసం అయిదు ఎంఒయులు కుదుర్చుకోవాల్సి ఉంటుంది. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ఇటీవల ఎఐసిటిఇ విడుదల చేసినఅనుమతుల నిబంధనల పుస్తకంలో ఈ నిబంధనను విధించింది. అమెరికాతో సహా పలు దేశాల్లో మాదిరిగా పరిశ్రమలు, విద్యాసంస్థలు కలిసి పనిచేయాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడం ద్వారా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని ఎఐసిటిఇ భావిస్తోంది. దాంతో ఈ నిబంధనను అనుమతుల నియమావళిలో చేర్చింది. ఈ నిబంధన ద్వారా ఇప్పటివరకు నామమాత్రంగా ఉన్న ప్రాజెక్టు విధానం స్థానంలో కచ్చితంగా ఇంటర్న్‌షిప్ విధానం అమలు చేయాల్సి ఉంటుంది.

ఇంటర్న్‌షిప్ తప్పనిసరి

ఇంజనీరింగ్‌తో పాటు డిప్లొమా విద్యార్థులు కూడా కోర్సులో భాగంగా ఇక నుంచి తప్పనిసరిగా ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. బి.టెక్ విద్యార్థులు ఐదు వారాలు, డిప్లొమా విద్యార్థులు నాలుగు వారాలు ఇంటర్న్‌షిప్ చేయాలి. కళాశాలలు ఒప్పందం కుదుర్చుకున్న ఐదు కళాశాలల్లో విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. వీటితోపాటు విద్యార్థి స్వతహాగా స్టార్టప్ చేసుకునే వెలుసుబాటు కల్పించాలి. అలాగే సొంత వ్యాపారాలు కలిగిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు తమ పరిశ్రమలు, వ్యాపార సంస్థల వివరాలు సమర్పిస్తే అందులో కూడా ఇంటర్న్‌షిప్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 2019–20 విద్యాసంవత్సరంలో పరిశ్రమలతో కళాశాలల ఎంఒయులు, ఇంటర్న్‌షిప్ విధానం అమలు తీరును పరిశీలించిన తర్వాతనే 202021 విద్యాసంవత్సరానికి ఎఐసిటిఇ అనుమతులు మంజూరు చేయనుంది. ఎఐసిటిఇ పొందుపరిచిన కొత్త నిబంధనల ద్వారా కళాశాలలు పరిశ్రమలతో ఇంటర్న్‌షిప్‌తోపాటు పరిశోధనలపై ఎంఒయులు తప్పనిసరిగా ఉండే అవకాశం కనిపిస్తుంది.

గెలుపు..ఓటములు నిర్ణయించే 'నోటా'

- పంచాయతీ ఎన్నికల్లో అత్యంత కీలకం
- అసెంబ్లీ ఎన్నికల్లో 7 నియోజకవర్గాల్లో ఫలితాలపై ప్రభావం
- పంచాయతీ ఎన్నికల్లో నోటా ఇదే తొలిసారి





మన తెలంగాణ/హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల్లో గెలుపు, ఓటములను నోటా శాసించనుందా అంటే అవుననే సమాధానం వస్తోంది. ఈసారి పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా బ్యాలెట్ పేపర్‌లో తొలిసారి నోటాను ఆప్షన్‌ను కూడా ఉంచుతున్నారు. దీంతో పోటీలో నిలిచే ప్రతి సర్పంచ్ అభ్యర్థికి, వార్డు మెంబర్‌కు ప్రతి ఓటు కీలకం కానుంది. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో 7 నియోజకవర్గాల్లో నోటానే గెలుపోటములు నిర్ణయించడం గమనార్హం. లక్ష పైన ఓటర్లు ఉండే అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికలోనే నోటా గెలుపు, ఓటములను నిర్ణయిస్తే, సాధారణంగా సరాసరి 800 నుంచి 1200 ఓట్లు ఉండే గ్రామ పంచాయతీల్లో ఇది మరి ఎక్కువగా ఉంటుందని అధికారులతో పాటు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఎవరు కూడా నచ్చకుంటే సదరు ఓటరు నోటాకు ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. ఉదాహరణకు కోదాడ నియోజకవర్గంలో టిఆర్‌ఎస్ నుంచి బొల్లం మల్లయ్య యాదవ్ తన సమీప అభ్యర్థి పద్మావతిపై 756 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో నోటా, పోస్టల్ బ్యాలెట్ ద్వారా వచ్చిన ఓట్లు 1240గా ఉండటం గమనార్హం. ఇందులో 800 ఓట్ల వరకు నోటాకే వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఆ నోటా ఓట్లు వీరిద్దరిలో చెరికొన్ని, ఇంకా వేరే అభ్యర్థి ఎవరికైనా పడినా గెలుపును తారుమారు చేసేవి. అలాగే ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 171 ఓట్లతో అభ్యర్థి గెలుపొందడంలో కూడా నోటా ఓట్లు కీలకమయ్యాయి. ఇక్కడ నోటాకు 1500లకు పైగా వచ్చినట్లు ఎన్నికల అధికారి ఒకరు చెప్పారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నోటా బటన్‌కు మొత్తంగా 2,24,709 ఓట్లు పడ్డాయి. అంటే పోలైన ఓట్లలో దాదాపుగా 1.1శాతం నోటాకు పోలయ్యాయి. దీంతో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నోటా ఆప్షన్‌పై కలవరపడుతున్నారు.

ప్రతి ఓటు కీలకమే

పంచాయతీ ఎన్నికల్లో ప్రతీ ఓటు ఎంతో కీలకం. అందుకే అభ్యర్థులుకూడా ప్రాధాన్యతనిచ్చి ఓట్ల కోసం పరితపిస్తారు. ఓటర్లు గ్రామాల్లో ఉండకుంటే వారిని రప్పించుకుని మరీ ఓట్లు తమకు అనుకూలంగా వేయించుకుంటారు. ఇలా ప్రతీ ఓటు పంచాయతీ ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశాలున్నాయి. ఇలాంటి సమయంలో బ్యాలెట్‌లో చోటు చేసుకున్న నోటా ఎవరి కొంప ముంచుతుందో తెలియని ఆయోమయాన్ని పోటీ చేసే అభ్యర్థులు ఎదుర్కొనున్నారు. ఒకటి రెండు ఓట్ల తేడాతో చాలా మంది ఓటమి పాలవుతారు. దీంతో నోటాకు పడిన ఓట్లు గుర్తుకు వస్తాయి.. నోటాకు పడకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవడం కోసం పోటీ చేసే అభ్యర్థులు నిరాక్ష్యరాసులైన ఓటర్లకు ఒకటికి పదిసార్లు చెప్పి పోలింగ్ బూత్‌కు పంపిస్తారు.. కానీ.. బాగా చదువున్న వారి ఓటును నోటాకు పడకుండా నియంత్రించే అవకాశాలు లేవు. యువత ఎక్కువ సంఖ్యలో నోటాను వినియోగించుకునే అవకాశం ఉందని ఒక అధికారి తెలిపారు. ఇవిఎంలలో ఉన్న మాదిరిగా పంచాయతీ ఎన్నికల్లోని బ్యాటెల్ పేపర్‌లో కూడా చివరగా ఉంటుంది. ఇందులో అభ్యర్థుల జాబితా తర్వాత నోటాకు అవకాశం ఉంటుంది. అభ్యర్థులను గెలిపించకపోయినా ఓడించే శక్తి మాత్రం నోటాకు ఉంది. అయితే గ్రామాల్లో నోటాపై అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేయాల్సి ఉండగా దీనిపై ఎన్నికల కమిషన్ అంతగా పట్టించుకోవడం లేదు.

'శుద్ధి' చేసిన మామిడి ఎగుమతి



- హాట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లపై ప్రభుత్వ యోచన
- విదేశాలకు ఎగుమతులు పెంచడమే లక్ష్యం

మన తెలంగాణ/హైదరాబాద్: శుద్ధి చేసిన మామిడిని విదేశాలకు ఎగుమతి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇలా ఎగుమతులు పెంచడమే కాకుండా రైతులకు లాభదాయకంగా మార్చేందుకు వ్యవసాయ, ఉద్యానశాఖలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. ఇందుకోసం రాష్ట్రంలో హాట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నెలకొల్పాలని ప్రభుత్వం యోచిస్తుంది. హాట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నెలకొల్పాలంటే యూనిట్ ధర రూ. 30 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా. అయితే ఎస్‌సి, ఎస్‌టిలకు 90 శాతం వరకు సబ్సిడీ, మిగిలినవారికి 50 నుంచి 75 శాతం వరకు సబ్సిడీ ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో హాట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నెలకొల్పనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఇటీవల వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల భేటీలో సిఎం కె.చంద్రశేఖర్‌రావు ఆదేశించినట్లు తెలిసింది. దీంతో అందుకు సంబంధించి వ్యవసాయ వర్గాలు అధ్యయనం చేస్తున్నారు. ఔత్సాహికులను ప్రోత్సహించాలని భావిస్తున్నారు. దీనికి సంబంధించి త్వరలో మార్గదర్శకాలు ఖరారు చేయొచ్చు. వాస్తవానికి రాష్ట్రంలో 4.17 లక్షల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఏడాదికి 4.80 లక్షల టన్నుల మామిడి దిగుబడి వస్తోంది. నాగర్‌కర్నూలు, మంచిర్యాల, మహబూబాబాద్, ఖమ్మం, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి తదితర జిల్లాల్లో మామిడి ఉత్పత్తి జరుగుతుంది. అయితే ఈ మామిడి కాయలు వివిధ రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి కానీ, విదేశాలకు ఎగుమతి కావడం లేదు. 4.80 లక్షల టన్నుల మామిడి దిగుబడిలో కనీసం వెయ్యి టన్నులు కూడా విదేశాలకు ఎగుమతి కావడం లేదు. మామిడిపై టెంక పురుగు, లార్వాలు ఉంటాయి. అలాంటి వాటిని ఇతర దేశాలు అంగీకరించవు. ముఖ్యంగా మధ్య ఆసియా దేశాలు, జపాన్ వంటి దేశాలు అంగీకరించడంలేదు. పురుగుమందుల స్వభావం ఉండటం వల్ల కూడా ఆయా దేశాలు మన మామిడిని దిగుమతి చేసుకోవడంలేదు. హాట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఉంటే, మామిడిని అక్కడ శుద్ధి చేస్తే విదేశాలకు ఎగుమతులు చేయడానికి అర్హత లభిస్తుంది. టెంకపురుగు, లార్వాలు పోయి మరింత శుద్ధిగా తయారవుతుంది. కానీ ఇన్నాళ్లూ అటువంటి ప్లాంట్లు లేకపోవడంతో మామిడి రైతులు విదేశాలకు ఎగుమతి చేయలేని పరిస్థితి నెలకొంది.



మా ఊరికి రండి

అకున్ సబర్వాల్‌కు తండా మహిళల ఆహ్వానం

మన తెలంగాణ / హైదరాబాద్ : చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించేందుకు మెదక్ జిల్లా జహీరాబాద్‌లో లచ్చునాయక్ తండా వాసులు ఈ నెల 14వ తేదీన లచ్చు నాయక్ తండాలో బయోడైవర్సిటి ఫెస్టివల్ (మొబైల్)ను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాల్సిందిగా పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్‌సబర్వాల్‌ను ఆ తండా మహిళలు కృష్ణవేణి, చంద్రమ్మ, అంజమ్మ, లక్ష్మమ్మ, అనుసూయమ్మ పౌరసరఫరాల భవన్‌కు వచ్చి ఆహ్వానించారు. ఇటీవలి కాలంలో మారుతున్న సామాజిక పరిస్థితులు, జీవనశైలి కారణంగా చాలా మందిలో వివిధ రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, వైద్య నిపుణులు సైతం చిరుధాన్యాల వినియోగంపై అవగాహన కలిగిస్తున్నారని, ప్రజల్లో కూడా వీటిపట్ల ఆసక్తి పెరిగిందని కమిషనర్‌కు వివరించారు. పేద, సంపన్న అనే తేడా లేకుండా ఇటీవలి కాలంలో పట్టణాల్లో నివసిస్తున్న చాలా మంది ఆరోగ్య అవసరాల కోసం చిరు ధాన్యాలను ఎక్కువగా వినియోగిస్తున్నారని, ఇలాంటి నేపథ్యంలో వాటి దిగుబడి కూడా పెరగాల్సిన అవసరం ఉందని కమిషనర్‌కు వివరించారు. చిరుధాన్యాల సాగుపై రైతుల్లో విస్తృతంగా అవగాహన కలిగిస్తే దిగుబడి కూడా గణనీయంగా పెరుగుతుందని, తెలంగాణ సమాజ అవసరాలకు సరిపోయే తీరులో ఉత్పత్తి జరుగుతుందని, అందువల్ల ఈ నెల 14న జరగనున్న బయోడైవర్శిటీ ఫెస్టివల్‌కు ముఖ్య అతిథిగా హాజరైన రైతుల్లో అవగాహన కల్పించాలని లచ్చునాయక్ తండా మహిళలు అకున్ సబర్వాల్‌కు విజ్ఞప్తి చేశారు.

ప్రజా కూటమి మనుగడపై నీలినీడలు

భాగస్వామ్య పార్టీల మధ్య పెరుగుతున్న అంతరం

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రజాకూటమి భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నట్లే కనిపిస్తున్నాయి. భాగస్వామ్య పార్టీల మధ్య రోజురోజుకూ అంతరం పెరుగుతోంది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కూటమిలోని పార్టీల మధ్య పొత్తు కొనసాగడం అనుమానంగా మారింది. కూటమి అభ్యర్థులు ఇరవై అసెంబ్లీ స్థానాల్లో కూడా విజయం సాధించకపోవడంతో కూటమి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. అసలు పొత్తుల కారణంగానే కాంగ్రెస్ ఓడిపోయిందని గాంధీభవన్‌లో మూడు రోజుల పాటు లోక్‌సభ నియోజకవర్గాల వారిగా నిర్వహించిన సమీక్షా సమావేశాల్లో పలువురు నేతలు కుండబద్దలు కొట్టిన చందంగా వ్యాఖ్యానించారు.

రెండు రోజుల క్రితం డికె అరుణకు చెందిన ఫాంహౌజ్‌లో నిర్వహించిన విందు సమావేశానికి హాజరైన పలువురు కాంగ్రెస్ నేతలు సైతం టిడిపితో కుదిరిన పొత్తే కొంప ముంచిందని వ్యాఖ్యానించారు. అందువల్ల రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో టిడిపితో కలిసి వెళ్ళడం కంటే ఒంటిరి పోరే మేలన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఇదే విషయాన్ని ఏఐసిసికి తెలియజేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ఈ తరహా వ్యాఖ్యలపై భాగస్వామ్య పార్టీలు కూడా తీవ్ర స్థాయిలోనే అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. కూటమి గెలిస్తే అలా అనేవారా అని ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలే తప్ప ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం అర్థంలేని పని అని కూటమిలోని ప్రధాన పార్టీకి చెందిన నాయకుడొకరు వ్యాఖ్యానించారు.

పాత కక్షలతో వ్యక్తిపై హత్యాయత్నం

వేట కొడవళ్లతో దాడి, పరిస్థితి విషమం, హైదరాబాద్‌కు తరలింపు



మనతెలంగాణ/ నారాయణపేట: నారాయణపేట జిల్లా అబంగాపూర్ గ్రామానికి చెందిన ఆశప్ప అనే వ్యక్తిపై ప్రత్యర్థులు బుధవారం రాత్రి మడికెల్ మండల కేంద్రంలో వేట కొడవళ్లతో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. దీనికి సంబంధించి ఆశప్ప అనుచరుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆశప్ప సర్పంచ్ ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా తన అనుచరులతో మంతనాలు జరిపి తనకు సంబంధించిన వారితో నామినేషన్ వేయించి తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా కాపుకాచిన ప్రత్యర్థులు మడికెల్ మండల కేంద్రంలో ఆశప్ప కారును ఆపి వేట కొడవళ్లతో నరికి హత్యాయత్నానికి పాల్పడ్డారు. అ ప్రాంతంలో వున్న ప్రజలు వెంటనే స్పందించి హత్యాయత్నాన్ని ఆపేందుకు ప్రయత్నించగా హత్యకు యత్నించిన వారు అక్కడినుంచి పారిపోయారు. వెంటనే సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆశప్పను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఆశప్ప గత 20 సంవత్సరాల క్రితం తన స్వంత గ్రామానికి చెందిన ప్రత్యర్థి వర్గంలోని 5గురిని తన అనుచరులతో కలిసి హత్యచేశాడు. ఈ కేసులో ఆశప్ప జైలుకు వెళ్లివచ్చిన అనంతరం ప్రత్యర్థి వర్గానికి భయపడి ఊళ్లోకి రావడంలేదు. అపుడప్పుడు ఊళ్లోకి వస్తున్న ఆశప్ప అసెంబ్లీ ఎన్నికల నుంచి గ్రామ రాజకీయాలను శాసిస్తుండడంతో చూడలేని ప్రత్యర్థి వర్గం ఆశప్పను ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకుంది. ఈ పథకంలో భాగంగా మడికెల్ వద్ద బుధవారం రాత్రి కాపుకాచి హత్య చేయడానికి యత్నించాడు. ఈ విషయంపై పోలీసులు ప్రాథమిక దర్యాప్తును ప్రారంభించారు.

అందరినీ గౌరవిస్తాం ఒక్కరిని ఆరాధిస్తాం

చినజీయర్ స్వామీజీ



మనతెలంగాణ/ సిటీబ్యూరో : ఆండాళ్ తల్లి అనుగ్రహించినటువంటి విశేషాలను స్మరించుకుంటూ వాటిని మన జీవితానికి వీలైనంత వరకు సమన్వయం చేసుకునే శ్రద్ధను పొందుతూ ముందుకు సాగుతున్నామని ప్రముఖ ఆద్యాత్మిక గురువు చిన జీయర్ స్వామీజి అన్నారు. నగరంలోని నందగిరిహిల్స్‌లో మైహోం గ్రూపుల అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు నివాస ప్రాంగణంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆయన 25వ రోజు ప్రవచనాలను వినిపించారు. శ్రీకృష్ణుడికి ఉండేటటువంటి స్వభవాలను తెలుపుతూ ఆకించిన్యం, అనన్య గతిత్వం అని రెండు సాంకేతిక పదాలను వివరించడం జరిగిందని, భగవంతుడి అనుగ్రహం వల్లనే నాకు లబ్ది చేకూరిందని, అవకాశాలు ఒనగూరాయని, నా స్వార్జితమైన సాధనాలు ఏమి లేవని భగవంతుడికి చెప్పాలి దానిని ఆకించిన్యం అని అంటారని, ''అనన్యగతిత్వం'' ఏది నాకు తీరవలెనన్నా, ఆ భగవంతుడి వల్లనే తీరుతుందని అనుకోవడం అనన్యగతిత్వం అని ఆయన వెల్లడించారు. ఇతర ఉపాయాలు, ఇతర వ్యక్తులు, ఇతర జీవరాశులెవ్వరూ కూడా నాకు సహకరించరని ఒక్క దేవుడే గతియని అనుకోవడం అని, ఆకించిన్యం, అనన్యగతిత్వం అనే రెండూ కూడా ఆండాళ్ ఆ శ్రీకృష్ణుడికి విన్నవించారని తెలిపారు. మనుష్యులు ఉపాస్యుడిగా నారాయణను తప్ప వేరెవ్వరినీ విశ్వసించరని, ఏ ఇతర దేవతలను కూడా తృణీకరించరని ఆయన వెల్లడించారు. అందరినీ గౌరవిస్తాం, ఒక్కరిని మాత్రం ఆరాధిస్తాం అని, వైదిక ధర్మం మీద మనకు పూర్తివిశ్వాసం ఉన్నట్లైతే నారాయణుడినే ఆరాధిస్తామని, యజ్ఞాలు, యాగాలు జరిగేటప్పుడు నారాయణుడినే ఆరాధన చేసినా, ఇతర దేవతలను కూడా పూజిస్తారని చెప్పారు. ఈ దేవతలందరితోనూ ఒక విశిష్టుడిగా గుర్తించి నారాయణుడిని ఆరాధిస్తామని, విశ్వసించి ఆరాధించేవారి ఎడల భగవంతుడు ప్రసన్నుడై ఉంటాడని జీయర్ స్వామీజి తెలిపారు. 'ఉన్నయ్ అర



తిత్తు వందోమ్' నీ అనుగ్రహంనే కోరుకుందామని కృష్ణుడితో గోదాదేవి చెప్పినట్టు వెల్లడించారు. మనందరినీ నడిపించేవి మీ కళ్యాణ గుణాలని, భగవద్గీతలో మనుష్యులు తరించడానికి కొన్నసాధనలు తెలిపారని, వాటిని యోగములు అంటారని, సాధారణ యోగమంటే అనుసంధానంగా ఆయన పేర్కొన్నారు. భగవద్గీతలో 4వ అధ్యాయంలో అర్జునుడికి జ్ఞాన యోగం ఉపదేశం చేశాడని, ''హిమం వివశ్వతే యోగం ప్రోక్తవాన్ అహం'' అని ఈ జ్ఞాన యోగం సూర్యునితో మాట్లాడుతున్నదని అర్జునుడితో కృష్ణుడు చెప్పాడని జీయర్ స్వామీజి పేర్కొన్నారు. ఈ జ్ఞానయోగం వ్యక్తులలోని జ్ఞానమాంద్యం చేత జ్ఞానం లుప్తప్రాప్తమైందని, ''సయేవాఎం మయాతేద్యా యోగ ప్రోక్త: పురాతనా '' సూర్యుడికి నేనే చెప్పా.. తర్వాత నీకు చెప్తున్నానని అర్జునిడితో కృష్ణుడు అన్నాడని ఆయన వెల్లడించారు. సూర్యుడు 28 చతుర్ యుగానికి పూర్వం వాడు, ఒక చతుర్ యుగం కాలం 43,20,000 సంవత్సరాలు అని, సూర్యుడు అప్పుడెప్పుడివాడో కదా... నీవేమో ఇప్పటివాడివి.. నాకంటే 6 నెలల కన్నా ముందువాడివి... నీవు చెప్పినదెలా అర్థం చేసుకోవాలి అని అడిగినాడని జీయర్ స్వామీజి తెలిపారు. శ్రీకృష్ణ దేవరాయల సభలో ఆయన అష్ట దిగ్గజాలను 12 లో నుంచి 4 తీసేస్తే ఎంత అని ప్రశ్నిస్తే అందరూ 8 అని చెప్పితే.. తెనాలి రామకృష్ణుడు మాత్రం '0' అని తెలిపారని, ఏడాదిలో 12 నెలలు, అందులో 4 నెలలు ఎండ, 4 నెలలు చలి, 4 నెలలు వాన, చలి, ఎండల కాలాన్ని సమతుల్యం చేస్తున్నది 4 నెలల వానకాలమని, ఈ 4 నెలలు తీసేస్తే '0' అని వివరించాడని, ప్రశ్న వేసే వారిని బట్టి సమాధానం ఉంటుందని రామకృష్ణుడు వివరించారని జీయర్ స్వామీజి విశదీకరించారు. ప్రశ్న వేసేవారి స్థాయికి తగ్గట్టుగా జవాబు ఉండాలని ఆయన చెప్పారు.



'సీతారామ' విజయానికి కృతజ్ఞతలు

సిఎంను కలిసిన ఖమ్మం ఎంఎల్ఎ పువ్వాడ

మన తెలంగాణ/ న్యూఢిల్లీ, హైదరాబాద్ : ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు సాగు, త్రాగునీరు అందించే సీతారామ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి పర్యావరణ అనుమతులు సాధించినందుకు ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఖమ్మం శాసనసభ్యుడు పువ్వాడ అజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల హైదరాబాద్ పర్యటనకు వచ్చిన సందర్భంగా కేంద్ర పర్యావరణ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్‌కు ఈ ప్రాజెక్టు వివరాలను తెలియజేసి సత్వరం పర్యావరణ అనుమతులు లభించేలా చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి కెసిఆర్ విజ్ఞప్తి చేశారు. గతేడాది నవంబరులో ఎక్స్‌పర్ట్ అప్రెయిజల్ కమిటీ సమావేశంలో నిపుణులు లేవనెత్తిన సందేహాలను ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నివృత్తి చేయడంతో పాటు ప్రాజెక్టు సమగ్ర నివేదిక స్పష్టంగా ఉండడంతో అనుమతులు మంజూరు చేయవచ్చంటూ ఈ కమిటీ సిఫారసు చేసింది. దీంతో కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖ ఈ అనుమతులను మంజూరు చేసింది. దీంతో పెద్ద అడ్డంకి తొలగిపోయింది.

సిఎం సహాయనిధిలో సిద్దిపేటది అగ్రస్థానం : హరీశ్ రావు



మన తెలంగాణ/ సిద్దిపేట రూరల్ : ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్న సిఎం సహాయనిధి ద్వారా ఆరోగ్య భద్రత, ఆర్థిక భరోసా ప్రతి ఒక్కరికి అందుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం ఆయన నివాసంలో సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వారికి, ఆకస్మాత్తుగా అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరి, ఆర్థిక స్థోమత లేని పేదలకు సిఎం సహాయనిధి అండగా ఉంటుందన్నారు. ఆరోగ్యానికి భద్రత కల్పించటంలో, ఆర్థికంగా భరోసా ఇవ్వటంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ముందుంటుందన్నారు. సిఎం సహాయనిధి అందించటంలో సిద్దిపేట అగ్రస్థానంలో ఉందన్నారు. సిఎం సహాయనిధి ద్వారా 3లక్షల 3వేల రూపాయల చెక్కులను లబ్దిదారులకు అందించారు. పట్టణానికి చెందిన మహేందర్‌రావు రూ. 60 వేలు, జి. అనసూయ రూ. 50 వేలు, జి. బుచ్చిరెడ్డి రూ. 28వేలు, పి. శ్రీనాథ్ రూ. 30వేలు, బి. స్వరూప రూ. 40వేలు, జి. విఘ్నేశ్వర్ రూ. 60వేలు, శాహెదా బేగం రూ. 35వేలు పంపిణీ చేయటం జరిగింది.

ఇక ఆన్‌లైన్‌లో జనన మరణాల నమోదు

పోర్టల్ తయారు చేసిన ప్రభుత్వం

మన తెలంగాణ/ హైదరాబాద్ : జనన మరణ నమోదు వివరాలను ఇక నుంచి ఆన్‌లైన్ ద్వారా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. వీటి నమోదుకోసం వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక పోర్టల్‌ను కూడా రూపొందించింది. ఇప్పటిదాకా జనన మరణాల నమోదును స్థానిక సంస్థలు నమోదు చేసేవి. ఆస్పత్రిలో జన్మించగానే ఆ వివరాలను గ్రామ పంచాయతీలకు లేదా మున్సిపాలిటీలకు ఆయా ఆస్పత్రి యాజమాన్యాలు పంపుతాయి. అక్కడ నుంచి జనన ధృవీకరణ పత్రాలను తీసుకోవాల్సి ఉంటుంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో వీటి నమోదు సక్రమంగానే ఉన్నా గ్రామాల్లో సరిగా జరగటంలేదు. జనాభా లెక్కింపు సమయంలో ఇబ్బంది తలెత్తుతోంది. ఇటీవలి కాలంలో జననాలు 92% ఆసుపత్రిలోనే జరుగుతున్నట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ దృష్ట్యా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులే నేరుగా జనన నమోదును నేరుగా చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం ebirth.telangana.gov.in పోర్టల్‌ను ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చింది. మరణాలను కూడా ఇదే పోర్టల్ ద్వారా నమోదు చేసే ఏర్పాటు చేశారు.

గెలుపు బాధ్యత ఎంఎల్ఎలదే

16 లోక్‌సభ స్థానాలను భారీ మోజారిటీలతో గెలుచుకుంటేనే కేంద్రం మనం చెప్పినట్టు వింటుంది : ఎంఎల్ఎలకు కెటిఆర్ స్పష్టీకరణ ?

మన తెలంగాణ/హైదరాబాద్: ఢిల్లీని యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయి వరకు ఎదగాలంటే ఎట్టిపరిస్థితుల్లోనూ టిఆర్ఎస్ పదహారు పార్లమెంట్ స్థానాల్లో గెలిచి తీరాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదేపదే చెప్తుండడంతో క్షేత్రస్థాయిలో కార్యాచరణ ఇప్పటికే మొదలైంది. తాజాగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించడానికి ఎంపిలు కష్టపడి పనిచేసినందున ఇప్పుడు ఆ గెలుపొందిన ఎంఎల్ఎలంతా రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఎంపి అభ్యర్థులను గెలిపించే బాధ్యతలను తీసుకోవాలని కూడా కెటిఆర్ సూచించినట్లు తెలిసింది. రాష్ట్రంలోని 16 పార్లమెంట్ స్థానాల్లో భారీ మెజారిటీతో గెలిస్తేనే కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆధీనంలో ఉంటుందనే పట్టుదలతో నాయకత్వం పనిచేయాలని ఇప్పటికే టిఆర్ఎస్ అధిష్ఠానం క్షేత్రస్థాయిలోని పార్టీ శ్రేణులకు సూచించింది. గడిచిన శాసన సభ ఎన్నికల్లో టిఆర్ఎస్ ఎంఎల్ఏలను గెలిపించే బాధ్యతలు పార్లమెంట్ సభ్యులు తీసుకుని విజయం సాధించినట్లే ఎంపి ఎన్నికల్లో టిఆర్ఎస్ శాసన సభ్యులు నియోజకవర్గాలవారీగా పార్లమెంట్ సభ్యులను భారీ మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత ఉందని పార్టీ ముఖ్యనాయకులు సంకేతాలు ఇచ్చారు. తాజా శాసనసభ ఎన్నికల్లో ఓటమికి గురైన నియోజకవర్గాలపై పార్టీ శ్రేణులు దృష్టి సారించి ఈసారి పార్లమెంటు ఎన్నికల్లో ఆ వెలితిని భర్తీ చేసే విధంగా కార్యాచరణకు సూచనలు చేసింది. ఓట్లు చీలకుండా ఉండేలా చర్యలు చేపట్టింది. ఈనెల 25 వరకు ఓటర్ల జాబితాలో పేర్ల నమోదుకు అవకాశాలు ఉండటంతో అర్హులైన వారందరినీ నమోదు చేయించాలని ఇప్పటికే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు ఇచ్చారు. టిఆర్ఎస్ మంత్రులు మహేందర్ రెడ్డి, అజ్మీరా చందులాల్, జూపల్లి కృష్ణారావు, స్పీకర్ మదుసుధనాచారి ఓడిన నియోజక వర్గాల్లో పార్టీ శ్రేణులు మరింత దృష్టి సారించి పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీ కోసం కృషి చేయాలని అధిష్ఠానం ఆదేశించింది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపి పార్టీలు ఒంటరిగానైనా, కలిసైనా మెజారిటీ సాధించే అవకాశాలు లేవని టిఆర్ఎస్ పేర్కొనింది. కాంగ్రెస్ కనుమరుగైపోతుందని, మోడి గ్రాఫ్ రోజురోజుకు తగ్గుతోందని పార్టీ శ్రేణులకు ఇటీవల వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పష్టత ఇచ్చారు. ఈనేపథ్యంలో టిఆర్ఎస్ 16 లోక్‌సభ స్థానాలు సాధిస్తే కేంద్ర ప్రభుత్వంలో తెలంగాణ కీలకం కానుందని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో ఖమ్మం, నల్లగొండ జిల్లాలపై దృష్టి సారించాలని టిఆర్ఎస్ భావిస్తోంది. శాసనసభ ఎన్నికల్లో ఖమ్మంలో టిఆర్ఎస్ ఘన విజయం సాధించకపోవడమే దీనికి కారణం. పంచాయితీ ఎన్నికల్లోను పార్టీ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించేందుకు కృషిచేయడంతో పాటు టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 3,400 వేల గిరిజన తండాల్లో ఏకగ్రీవ ఎన్నికలు జరిగేందుకు కృషిచేయాలని పార్టీ నాయకులను ఆదేశించారు.



ఓటర్ల నమోదు కీలకం

శాసన సభ ఎన్నికల్లో ఓట్లు రాలేదని వేలాది మంది అందోళనకు గురయ్యారు. వారందరి పేర్లను జాబితాను పోలింగ్ కేంద్రాల వారీగా సేకరించి ఓటర్ల నమోదు జాబితాలో చేర్పించాలని ఇప్పటికే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆదేశించారు. ఓటర్ల నమోదుతో మెజారిటీ పెంచుకోవాలని భావిస్తోంది. ప్రతీ వంద కుటుంబాలకు ఒక టిఆర్ఎస్ నాయకుడు ఉండేలా శాసనసభ్యులు స్థానిక నాయకత్వాన్ని తీర్చి దిద్ది రాష్ట్ర నాయకత్వానికి నివేదికలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

కోటాలపై రాష్ట్రాలకు స్వేచ్ఛ

- **దేశం మొత్తానికి ఒకే రిజర్వేషన్ విధానం**
- **ఇబిసి రిజర్వేషన్ బిల్లుపై రాజ్యసభలో టిఆర్ఎస్ ఎంపి బండ ప్రకాశ్**

మన తెలంగాణ/ న్యూఢిల్లీ, హైదరాబాద్ : దేశం మొత్తానికి ఒకే రకమైన రిజర్వేషన్ విధానం ఉండాలని, లేదంటే ఆయా రాష్ట్రాల్లోని జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించుకునే అధికారం రాష్ట్రాలకే ఉండాలని టిఆర్ఎస్ ఎంపి బండా ప్రకాశ్ వ్యాఖ్యానించారు. అగ్రకులాల్లోని పేదలకు పది శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లుపై రాజ్యసభలో బుధవారం సాయంత్రం జరిగిన చర్చ సందర్భంగా టిఆర్ఎస్ తరపున ఆయన మాట్లాడుతూ, సమైక్య రాష్ట్రం లో ఉన్న జనాభా పొందికకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పొందికకు మధ్య వ్యత్యాసంఉన్నదని, తెలంగాణ ఏర్పడిన తర్వాత గిరిజనుల జనాభా ఆరు శాతం నుంచి పది శాతానికి పెరిగిందని, ముస్లింల జనాభా ఎనిమిది శాతం నుంచి పన్నెండు శాతానికి పెరిగిందని, దానికి అనుగుణంగా రిజర్వేషనలో మార్పు చేస్తూ రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపితే ఇప్పటికీ ఆమోదం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లలో మార్పులు చేసుకోవడం రాష్ట్రాలకు అవసరమని, ఆ వెసులుబాటు, స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలన్నారు. తెలంగాణలో బిసి, ముస్లిం మైనారిటీలు గణనీయంగా ఉన్నారని, రాష్ట్ర మొత్తం జనాభాలో 90.5% మంది బిసి, ఎస్‌సి, ఎస్‌టి, ముస్లింలేనని అన్నారు. ఇలాంటి పొందికలో తమ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించుకునే స్వేచ్ఛ ఉండాలన్నారు. మొత్తం దేశ జనాభాలో దాదాపు 62% మంది వెనకబడినవర్గాలవారేనని, కానీ సుప్రీంకోర్టు సీలింగ్ ఉన్నందున మండల్ కమిషన్ సైతం 27% రిజర్వేషన్లకు మాత్రమే సర్దుబాటు చేయాల్సి వచ్చిందని, ఇది సామాజికపరంగా న్యాయసమ్మతం కాదన్నారు. రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా రిజర్వేషన్లను కల్పించుకునే అవకాశం లేకుంటే ఆ రాష్ట్రాలకు జనాభాను సంతృప్తి పర్చడం కష్టంగా ఉంటుందన్నారు. రిజర్వేషన్ విధానం సమర్ధవంతంగా, స్టాండర్డ్‌గా ఉండాలన్నారు. కుల ఆధారిత రిజర్వేషన్లు జనాభా నిష్పత్తికి అనుగుణంగా ఉండాలని, ఇందుకోసమే తాము ఈ బిల్లుకు కొన్ని సవరణలను ప్రతిపాదిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో ఉన్న తెలంగాణ అసెంబ్లీ చేసిన తీర్మానానికి ఆమోదం తెలపాలని కోరారు.

ఆ రెండు పార్టీల నిర్వాకం వల్లనే సామాజిక అసమానతలు

గతంలో వెనకబాటుతనం సామాజికంగా వెనకబడినవర్గాల్లోనే ఉంటుందని విన్నామని, మొదటిసారి ఆర్థికంగా వెనకబడినవారికిరిజర్వేషన్ల గురించి ఇప్పుడు ఆలోచిస్తున్నామని బండ ప్రకాశ్ వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఏళ్ళయిన తర్వాత కూడా దేశంలో ఆర్థిక వెనుకబాటుతనం ఉన్నట్లు ఇప్పుడు గుర్తించామని, ఇందుకు కారణం ఇంతకాలం పాలన సాగించిన కాంగ్రెస్, బిజెపి లాంటి పార్టీల వైఫల్యమేనని అన్నారు. సమాజంలోని అట్టడుగు వర్గాలు, సామాన్యుల గురించి ఆ ప్రభుత్వాలు పట్టించుకోలేదని, అందుకే ఇప్పుడు ఈ బిల్లు వచ్చిందన్నారు. అలాంటి అసమానతలను రూపుమాపడానికే తెలంగాణ ప్రభుత్వం ముస్లింలకు 12 శాతం, గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు కల్పించేలా అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసిందని, దానికి కేంద్రం ఇప్పటికీ ఆమోదం తెలపలేదన్నారు. ఈ అంశం గురించి తమ పార్టీ అధినేత కెసిఆర్ ఢిల్లీకి వచ్చి స్వయంగా ప్రధానిని కలిసి వివరించారని, తమ పార్టీ పార్లమెంటు సభ్యులు సైతం నిరసన తెలిపారని, అయినా ఈ రోజుకీ కేంద్రం నుంచి చలనం లేదన్నారు. రిజర్వేషన్ల విషయంలో దేశమంతా ఒకే విధానంఉండాలని, దురదృష్టవశాత్తూ ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తీరులో ఉందని బండ ప్రకాశ్ వివరించారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన బిల్లుతో మొత్తం రిజర్వేషన్లు 60% అవుతున్నాయని, మరోవైపు సుప్రీంకోర్టు 50 శాతం దాటవద్దని అంటోందని అన్నారు

సుప్రీం ఉత్తర్వులు సాకు : వినోద్‌కుమార్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో గిరిజనుల, బిసిల శాతం పెరిగిందని, అందుకే రిజర్వేషన్లు పెంచుతూ తీర్మానం చేసి కేంద్రానికి పంపామని, కానీ మొత్తం రిజర్వేషన్లు 50% దాటవద్దని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సాకుగా చూపి ఇప్పటికీ ఆమోదం తెలపకుండా పెండింగ్‌లో పెట్టిందని కరీంనగర్ ఎంపి వినోద్‌కుమార్ వ్యాఖ్యానించారు. అగ్రవర్ణాల్లో పేదలకు రిజర్వేషన్లు పెంచటంపై వినోద్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ, ఇది మంచి నిర్ణయమేనని, కానీ హడావుడిగా తీసుకున్న నిర్ణయం అని వ్యాఖ్యానించారు. అగ్రవర్ణాల్లో కూడా రిజర్వేషన్లు ఉండటంతో అన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించినట్లయిందన్నారు. దీనికి న్యాయపరంగా కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవనే అనుకుంటున్నామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు సామాజికవర్గాలకు 50 శాతం మించకూడదన్నది కూడా చట్టంతో సమానం కాబట్టి దాన్ని కూడా సవరించాలని కోరుతున్నామన్నారు. చంద్రబాబు గురించి మీడియా అడగ్గా స్పందిస్తూ, ఆయనే ఇప్పుడు ఎదో కొత్తగా కూటమిని ఏర్పాటు చేస్తున్నట్లు, ఆ భారాన్నంతా తన భుజాలపై వేసుకున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

వింత(వసంత) పక్షి



మంచిర్యాల జిల్లాలో వింతపక్షి దర్శనమిచ్చింది. బెల్లంపల్లి డివిజన్ విజన్ కైరిగూడ ఓపెన్ డ్రెస్ దగ్గర భారీ కాయం, రెక్కలు, దానిపై పెద్ద పెద్ద ఈకలతో కూడుకుని ఉంది. ఇలాంటి పక్షిని ఇంతవరకు ఈ ప్రాంతంలో ఎప్పుడూ చూడలేదని స్థానికులు చెప్పారు. మాకు వింతగా అనిపిస్తుంది. ఇలాంటి పక్షిని చూడడం మొదటిసారి అని చెప్పారు. పక్షిని పట్టుకున్న గ్రామస్థులు ఫారెస్ట్ అధికారులకు సమాచారమిచ్చారు



కులవృత్తులకు ఆదరణ

ఎంఎల్ఏ శ్రీనివాస్ గౌడ్

మనతెలంగాణ/ హైదరాబాద్: ఉమ్మడిపాలనలో వివక్షకు గురైన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించినప్పటి నుంచి అభివృద్ధిలో దూసుకు పోతుందని టిఆర్ఎస్ శాసన సభ్యుడు వి.శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఉమ్మడిపాలనలో కులవృత్తులను పూర్తిగా నిషేధించినట్లు వ్యవహరించడంతో పాటు జీవనాధారమైన కల్లు వృత్తిని కనుమరుగు చేసేందుకు ప్రయత్నించారని ఆయన విచారం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కల్లుని షేధించి కల్లుగీత కార్మికులతో ఆనాటి పాలకులు చలగాటమాడారని నిందించారు. అయితే తెలంగాణ ప్రభుత్వం కులవృత్తులను కాపాడేందుకు ప్రత్యేక శ్రద్ధతీసుకోవడంతో వారి జీవన ప్రమాణాలు క్రమేణ మెరుగవుతున్నాయని చెప్పారు. నీరాతో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధిని మెరుగు పర్చేందుకు ప్రభుత్వం యోచిస్తుందన్నారు. టిఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం గౌడ ఐక్య సాధన సమితి క్యాలెండర్‌ను ఎంఎల్ఏ వి. శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. కల్లుగీత కార్మికుల జీవితాలను తీర్చిదిదేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన కృషికి ఫలితాలు వస్తున్నాయని శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం చెట్టు పన్ను రద్దు చేయడంతో పాటు ప్రమాదంలో మృతి చెందిన కల్లుగీత కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5నుంచి రూ.6 లక్షల ఆర్థిక సహాయం చేస్తుందని చెప్పారు. అలాగే ప్రభుత్వం ఈత, తాటి చెట్లును లక్షల్లో పెంచుతూ ఉపాధి అవకాశాలను మెరుగు పర్చిందన్నారు.అలాగే కుల వృత్తుల పై ఆధార పడిన కులాలకు ఆర్థికంగా అవకాశాలు మెరుగు పరుస్తూ అనేక పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉన్నత చదువులకోసం రూ.20 లక్షలు ప్రభుత్వం ఇస్తూ దేశానికి ఆదర్శమైందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్ రావు, రాష్ట్ర గ్రూప్1అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్, గౌడ ఐక్యసాధన సమితి అధ్యక్షుడు అంబాలా నారాయణ గౌడ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ ఏడాదికి ఎయిమ్స్‌లో 50 సీట్లే

మన తెలంగాణ/ హైదరాబాద్: రాష్ట్రానికి మజూరైన ప్రతిష్ఠాత్మక ఎయిమ్స్ విద్యా సంస్థలో తొలి ఏడాది 50 ఎంబిబిఎస్ సీట్లతోనే ప్రారంభం కానుంది. వచ్చే విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభించనున్నట్లు కేద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఆ ప్రకారం 100 ఎంబిబిఎస్ సీట్లతో విద్యా సంవత్సరం ప్రారంభం కావాల్సి ఉంది. కానీ కొత్తగా మంజూరు కావడంతో మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో లేనందున సీట్ల సంఖ్యను వంద నుంచి యాభైకి కుదించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. వరుసగా మూడేళ్ల పాటు ఇదే పరిస్థితి కొనసాగవచ్చని, పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోవడానికి మూడేళ్ల సమయం పడుతున్నందున కేంద్రం ఈ తరహా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అందువల్లనే కేవలం 50 సీట్లతోనే ఎయిమ్స్‌ను ప్రారంభించాలనుకుంటున్నట్లు సమాచారం. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు కూడా ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. రాష్ట్ర రాజధానికి సమీపంలోని బీబీనగర్‌లో ఎయిమ్స్‌ను నెలకొల్పాటానికి కేంద్రం రూ.1,028 కోట్లు మంజూరు చేసింది. 750 పడకలతో ఆసుపత్రికి రోజుకు 1500 మంది ఔట్ పేషెంట్లు వచ్చే అవకాశం ఉంది. తాత్కాలికంగా అద్దె భవనాలు, ఇప్పటికే అక్కడున్న నిమ్స్ భవనాల్లో ఎయిమ్స్ కార్యకలాపాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. అక్కడ ఏర్పాటు చేసే మెడికల్ కాలేజీలో 100 ఎంబిబిఎస్ సీట్లతోపాటు, 60 బిఎస్‌సి నర్సింగ్ సీట్లు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. వచ్చే వైద్య విద్యా సంవత్సరం కోసం ఎయిమ్స్ ఎంబిబిఎస్‌కు నోటిఫికేషన్ జారీ అయ్యింది. అందుకోసం ప్రత్యేకంగా దేశవ్యాప్తంగా ఎయిమ్స్ ఆధ్వర్యంలోనే ప్రత్యేక ప్రవేశ పరీక్ష జరుగనుంది. అలాగే 15 నుంచి 20వరకు సూపర్ స్పెషాలిటీ డిపార్ట్‌మెంట్ సీట్లు రానున్నాయి. ఇక్కడ ప్రధానంగా ఎంబిబిఎస్,బిఎస్‌సి నర్సింగ్ కోర్సులకంటే కూడా సూపర్ స్పెషాలిటీ కోర్సులపైనే ఎయిమ్స్ దృష్టిపెడుతుంది. పైగా మెడికల్ రంగంలో రీసెర్చ్‌ను ప్రోత్సహిస్తారు. వీటన్నిటికి ఇప్పుడున్న భవనాలు సరిపోవు. ఇంతవరకు కొత్త భవనాల నిర్మాణానికి ఎలాంటి అనుమతులు జరగక పోగా, ఇప్పటికే ఉన్న వాటిని కూడా స్వాదీనం చేసుకోలేదు. నూతన బవనాలు, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణానికి మరో మూడేళ్ళ సమయం పట్టొచ్చని అంచనా. దీనివల్ల రానున్న మూడు బ్యాచ్‌ల వరకు కూడా 50సీట్లతోనే ఎంబిబిఎస్ సీట్లను నింపుతారు. తర్వాత ఎయిమ్స్ పూర్తిగా ఉనికిలోకి వచ్చాక 100 ఎంబీబీఎస్ సీట్లకు పెంచుతారు.

పౌరసత్వ పేచీ

సంపాదకీయం


ఒకవైపు ఈశాన్యం తగలబడుతూ మరొకవైపు అస్సాం గణపరిషత్ తమతో పొత్తుకు స్వస్తి చెప్పి నిరసన కంఠం వినిపిస్తున్నా చెవినపెట్టకుండా పౌరసత్వ సవరణ బిల్లును కేంద్రంలోని బిజెపి పాలకులు లోక్‌సభలో ఆమోదింప చేసుకోడం సరైన పద్ధతి కాదు. శాసనపరమైన ఏ చర్య తీసుకున్నప్పుడైనా ప్రజల ఆమోదాన్ని ప్రామాణికం చేసుకోవడం జన హిత ప్రభుత్వాల లక్షణం కావాలి. ఇందుకు విరుద్ధంగా ఎన్‌డిఎ ప్రభుత్వం పౌరసత్వ సవరణ బిల్లును ముందుకు తోసింది. పూర్తిగా అమలుకాని 1985 నాటి అస్సాం ఒప్పందం సాకు చూపి, పొరుగు దేశాల నుంచి పొట్ట చేతపట్టుకొని వచ్చే ముస్లింలకు భారత పౌరసత్వాన్ని శాశ్వతంగా నిరాకరించడం కోసమే ఎన్‌డిఎ ప్రభుత్వం ఈ చట్టాన్ని తెస్తున్నదనే విమర్శకు చోటు ఏర్పడుతున్నది. భారత దేశ పౌరసత్వాన్ని మత ప్రాతిపదికపై ఇచ్చే సెక్యులర్ వ్యతిరేక వైఖరిని ప్రధాని మోడీ ప్రభుత్వం మొదటిసారిగా తీసుకున్నదనే ఆక్షేపణ సబబేననే అభిప్రాయానికి ఇది తావు కలిగిస్తున్నది. పొరుగునున్న బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్‌లలో కొనసాగలేక వచ్చే హిందూ, సిక్కు, బౌద్ధ, క్రైస్తవ మతస్థులకు మాత్రమే భారత పౌరసత్వం ఇవ్వాలని ఈ సవరణ చట్టం సంకల్పిస్తున్నది.

విదేశీయులకు పౌరసత్వం మంజూరును భారత రాజ్యాంగంలోని 5 నుంచి 11వ అధికరణలు నిర్దేశిస్తున్నాయి. 5వ అధికరణ ప్రకారం భారత రాజ్యాంగం అమలులోకి రావడానికి కనీసం ఐదేళ్లకు తక్కువ కాని కాలం నుంచి దేశంలో గల వారందరికీ పౌరసత్వం లభించింది. 8వ అధికరణ ప్రకారం తల్లిదండ్రులు, తాతలు ఈ దేశంలో జన్మించిన వారై విదేశాల్లో నివసిస్తున్న ఎవరైనా భారత పౌరసత్వానికి అర్హులవుతారు. 1987 జూలై 1 తర్వాత భారత దేశంలో పుట్టినవారి తల్లిదండ్రుల్లో ఒకరైనా భారతీయులు కాకపోతే వారికి భారత పౌరసత్వం లభించదని కూడా చట్టాలు చెబుతున్నాయి. తల్లిదండ్రులు భారతీయులు కాని వారు పాస్‌పోర్టు, ఆధార్ కార్డు ఉన్నప్పటికీ పౌరులు కాజాలరని బొంబాయి హైకోర్టు 2013లో తీర్పిచ్చింది. తమంతతాముగా, స్వచ్ఛందంగా ఏ విదేశీ పౌరసత్వాన్ని స్వీకరించినా భారత పౌరసత్వాన్ని కోల్పోతారని రాజ్యాంగం 9వ అధికరణ స్పష్టం చేస్తున్నది. ఇలా భారతీయ పౌరసత్వానికి సంబంధించిన ఏ ఒక్క నియమంలోనూ మతాన్ని ప్రాతిపదిక చేయలేదు. ఇప్పుడు ఎన్‌డిఎ ప్రభుత్వం పౌరసత్వాన్ని పొరుగు దేశాల నుంచి వచ్చే ముస్లిమేతరులకే పరిమితం చేయదలచింది.

వాస్తవానికి స్థానికంగా పాలకుల నుంచి, వారి విధానాల నుంచి ఎదురయ్యే బాధలు భరించలేక వచ్చే విదేశీయులెవ్వరినైనా ఆదరించే మానవీయ నీతికి ఒకప్పుడు ప్రపంచమంతా ఆస్కారముండేది. ఉగ్రవాదం ప్రబలిన నేపథ్యంలో జాతీయతలు వెర్రి తలలు వేసి ఒక మతానికి చెందిన వారిని తమ దేశాల్లోకి రానీయకుండా చేసే వైఖరి పుట్టుకొచ్చింది. మయన్మార్ నుంచి ప్రాణాలరచేత పెట్టుకొని వచ్చిన రోహింగ్యా ముస్లింలకు ఆశ్రయం నిరాకరించిన భారత్ ఇప్పుడు పొరుగు దేశాల నుంచి వచ్చే ముస్లిమేతరులను మాత్రం అనుమతించాలని నిర్ణయించడం గమనించవలసిన విషయం. ఇక్కడ మానవత్వానికి కాకుండా మతానికే ప్రాధాన్యమిస్తున్నట్టు రుజువవుతున్నది. పౌరసత్వ సవరణ చట్టాన్ని కేవలం అస్సాంను దృష్టిలో పెట్టుకొని మాత్రమే తేవడం లేదని దేశంలోకి ఉగ్రవాదుల ప్రవేశాన్ని అరికట్టడం లక్ష్యంగా తెస్తున్నామని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. పొరుగు దేశాల నుంచి వచ్చే ముస్లింలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యగానే దీనిని పరిగణించడం సహజం.

1970 దశాబ్ది ఆఖరులో అస్సాంను కుదిపేసిన విద్యార్థి ఉద్యమానికి మూలంలో ఉన్నది అప్పటి ఉత్తర పాకిస్థాన్ (ఇప్పటి బంగ్లాదేశ్) నుంచి అసంఖ్యాకంగా చొచ్చుకువచ్చిన శరణార్థుల సమస్యే. ఆ ఉద్యమం సంవత్సరాల తరబడి సాగిన తరువాత విదేశీయులను ఏరివేసే అంగీకారం మీద అస్సాం ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం 1971 మార్చి 24 తరువాత సరిహద్దులు దాటి వచ్చిన బంగ్లాదేశీయులందరినీ వారి మతంతో నిమిత్తం లేకుండా విదేశీయులుగా గుర్తించాలని సంకల్పించారు. ఇప్పుడీ పౌరసత్వ సవరణ చట్టం ద్వారా అక్కడి నుంచి 2014 చివరి దాకా వచ్చిన హిందువులను, ఇతర ముస్లిమేతరులను అనుమతించబోవడాన్ని అస్సాం ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఇది అస్సాం ఒప్పందం లక్ష్యానికి విరుద్ధమని వారు భావిస్తున్నారు. ఇలా అస్సాం ఒప్పందం భుజమ్మీద తుపాకీ పెట్టి బిజెపి పాలకులు తమ హిందుత్వ ఎజెండాను నెరవేర్చుకోబోవడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు.

మతతత్వంపై స్త్రీవాద పోరు



'అణగారిన జీవుల నిట్టూర్పే మతం. హృదయరహిత ప్రపంచపు హృదయమది. జీవసారరహిత పరిస్థితుల సారమిది. ప్రజలు తీసుకునే మత్తు మందు అది. ప్రజల నిజ సంతోషం కోసం, భ్రమాత్మక సంతోషమైన మతాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేయాలి.' – కారల్ మార్క్స్. ఈ దృక్కోణం నుంచి 'శబరిమలై ఆలయంలోకి సంతానం కలిగే ప్రాయంలోని మహిళల ప్రవేశంపై సాగుతున్న పోరాటం స్త్రీలకు ఏ విధంగా న్యాయం చేస్తుందన్నది అనుమానమే. అయితే, రాజ్యాధికార రాజకీయాల ఎత్తులు జిత్తుల్లో భాగంగా ఆ పోరాటం సాగుతోంది. ప్రస్తుతం అణచివేత అనేది దానికదే రాజకీయాల మౌలిక ఉత్పత్తిగా తయారైంది. మతం పునాదిగా నడుస్తున్న రాజకీయాలు దళితులు, మహిళలు, బడుగుల అణచివేత రూపంలోనే సాగుతున్న విషయం విదితమే. అయ్యప్ప లేదా మరేయితర దేవుళ్లైనా సరే వారిని మరిచిపోండి. ఆ వివాదం పునాదిగా ఒకటి కంటే మించిన పార్టీలతో ఏర్పడే సంకీర్ణ కూటమి సాగించే రాజకీయాలపైనే

చూపు

దృష్టి పెట్టండి. ఇండియాలోని స్త్రీల కోసం జరిగే స్పష్టమైన పోరాటంగా ఈ రోజు శబరిమలై వివాదం మారింది. అయితే అందుకు భిన్నంగా, ఒకానొక ప్రజా సమస్యను ఎలా ద్విముఖ ఆటగా ఒక రాజకీయ పార్టీ సులభంగా మలచిందనే విషయాన్ని మనం మరచిపోయాం. దేశ రాజకీయాల్లో నడుస్తున్న ఈ దృశ్యం ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన దేశంగా ఇండియాను నిలబెడుతుంది. అధికారం నుంచి అణచివేతకు సాగే క్రమాన్ని రాజకీయాలు జన్మనిస్తాయి. శబరిమల వివాదంపై సాగుతున్న యుద్ధం ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు విభిన్న పార్టీల సంకీర్ణ కూటమికి మార్గం సుగమము చేసింది. రాజ్యాంగం అనే ఆయుధంతో కమ్యూనిస్టు పార్టీ యుద్ధం చేస్తుంటే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు మత విశ్వాసం, సంప్రదాయాల పేరుతో రాజ్యాంగానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. దేశం మత విశ్వాసాల చట్రంలో నడుస్తుండడం ఒక కఠోర వాస్తవమని మనకందరికీ తెలుసు. దేశంలో సాగుతున్న రాజకీయ, సామాజిక పరిణామాలకు అనుగుణంగా కేరళ రాజకీయ ముఖచిత్రం కూడా వేగంగా మారుతోంది.

శబరిమలలో జరుగుతున్న పోట్లాట మార్పుకు ఒక సాధనంగా నిలువబోతోందని స్త్రీ వాదులు గుర్తించాలి. మహిళలపై వివిధ రూపాల్లో సాగుతున్న అకృత్యాల నేపథ్యంలో భారత్‌కు మిలిటెంట్ స్త్రీ వాదం అవసరం. స్త్రీ వాదాన్ని సమర్థించే రాజకీయ పక్షాలకు నేడు ప్రోత్సాహం అవసరం. అయితే స్త్రీల అణచివేతకు మతమే ప్రధాన కారణంగా నిలిచిన నేపథ్యంలో స్త్రీ వాదం మతంపై ఎందుకు కేంద్రీకరించాలి? శబరిమల వివాదం వంటి మత విషయాల్లో స్త్రీ వాదం జోక్యం చేసుకోవడం అర్థరహితంగా అనిపిస్తోంది. విశ్వవ్యాప్తంగా మత సంప్రదాయాల రీత్యా మహిళల పట్ల వివక్ష కొనసాగుతుండడం అత్యంత స్పష్టమైన విషయం. మత అణచివేతకు వ్యతిరేకంగా స్త్రీవాదం నిరంతరాయంగా పోరాటం చేస్తున్న విషయాన్ని మనం గుర్తించాలి. మతాలన్నిటికీ కేంద్ర బిందువు మహిళలను, పేదలను అణచివేయడమే. బ్రాహ్మణవాద అణచివేత దృక్పథాన్ని కలిగిన హిందూయిజం మహిళలపై అనేక రూపాల్లో అణచివేతను కొనసాగిస్తోంది. స్త్రీ పురుషుల విభజన ప్రాతిపదికగా సాగే దైవ ధిక్కారానికి మూల కారకురాలంటూ క్రైస్తవం స్త్రీ వ్యతిరేక వైఖరిని చేపట్టింది. రోమన్ చట్టం ప్రకారం మహిళలకు పౌరులుగా గుర్తింపు లేదు. ఎలాంటి చట్టబద్ధ హక్కులు ఉండవు. ఆ వ్యవస్థలో స్త్రీ పురుష అసమానత్వం అన్ని రంగాల్లో కొనసాగుతుండడం కద్దు. ఉదాహరణకు రోమన్ చట్టం ప్రకారం పురుషుల వ్యభిచారం సమ్మతమైతే, అదే కారణంగా స్త్రీలకు మరణ శిక్ష విధిస్తారు. ఈ నేపథ్యంలో తొలి క్రైస్తవ మతం స్త్రీ, పురుషుల సమానత్వాన్ని సూత్రప్రాయంగా, ఆధ్యాత్మికంగా ప్రతిపాదించింది. ఆ తర్వాత అధికార మతంగా మారిన నాటి నుంచి పురుషాధిక్యత సంప్రదాయాన్ని ముందుకు తెచ్చింది. ఇప్పటికీ కొనసాగుతున్న మహిళలను కొట్టడం, హక్కుల నిరాకరణ, తీవ్ర శ్రమ అనే పురుషాధిక్య సంప్రదాయానికి ఇస్లాం జన్మనిచ్చింది. దైవ ధిక్కారాన్ని, మత అణచివేతను అర్థం చేసుకున్న మహిళలున్న కొన్ని ప్రాంతాల్లో తప్ప పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నిటిలోనూ స్త్రీ అణచివేత కొనసాగుతున్నట్లు అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. 70 శాతం నిరక్షరాస్యత కొనసాగుతున్న దేశంలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, కాంగ్రెస్‌లు మత విశ్వాసం పేరిట స్త్రీ, పురుష భక్తులందర్నీ ఒకటి చేసి దేశ వ్యాప్తంగా ఉద్రిక్తతలను రెచ్చగొట్టడాన్ని, మత విశ్వాసాలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడాన్ని చదువుకున్న మేధావులు ఎలా నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థం కావడం లేదు. రాజ్యాంగాన్ని ఎన్నడూ లేక్క చేయకుండా, మత మొక్కటే సత్యంగా భావిస్తున్న దేశంలో నిరక్షరాస్యత స్థాయిని తగ్గించడం అత్యంత కష్టతరమైన వ్యవహారంగా మారింది. శబరిమల వివాదం సంచలనం సృష్టించిన సందర్భంలోనే, ఒకే రాత్రి నలుగురు మహిళలు సామూహిక అత్యాచారానికి గురైన వార్త గుండెల్ని పిండేస్తుంది. మత్తు మందు లాంటి మత వివాదం కంటే సామూహిక అత్యాచార సంఘటనలు అధికంగా బాధిస్తున్నాయి. 'శబరిమల ఆలయంలోకి అవంధ్య ప్రాయంలోని మహిళల ప్రవేశంపై నిషేధం ఎందుకు విధించాలి?' అనే అంశం కంటే 'మతానికి, రజస్వలకు ముడిపెడుతూ కొనసాగుతున్న రాజకీయాలేమిటి?' అనే విషయం అత్యంత విషాదకరమైనదిగా నిలిచింది. సంప్రదాయాలు పాటిస్తే మోక్షప్రాప్తి ఉంటుందనే మత అమరత్వ భావన నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు నాప్కిన్స్ వాడకుండా కట్టుబాటు చేసినవారే, అదే అణచివేత మత సంప్రదాయాలను అడ్డుపెట్టుకొని పెద్ద పోరాటం చేస్తుండడం హాస్యాస్పదం!

రజస్వల కావడం అశ్లీలమైనది, అపవిత్రమైనదేమీ కాదు. మానవ జన్మకారకమైన జీవ ప్రక్రియ అది. మహిళల రజస్వల వ్యవహారాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయ పార్టీలు సాగిస్తున్న వివాదాలు, పోరాటాలనే నిజమైన అపవిత్రత, అశ్లీలతలుగా పరిగణించాలి. నీచాతినీచంగా కొనసాగుతున్న రాజకీయ అశ్లీలత గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. 'లవ్ జీహాద్', 'మోరల్ పోలీసింగ్ (సదాచార పరిరక్షణ)', వంటి ధోరణులతో అంటకాగుతున్న పార్టీలు నేడు అయ్యప్ప భక్తులను సంఘటితం చేసి 'స్త్రీ వాదం'పై పోట్లాటకు దిగడం విచారకరం. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 17, 25, 26 ప్రకారం మత పవిత్ర స్థలాలన్నిటిలోకి మహిళల ప్రవేశ నిషేధాన్ని నిర్మూలించాలనే దేశ సర్వోన్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాన్ని మనం పాటించాలా లేదా రజస్వలను రాజకీయం చేయడం ద్వారా దేశంలో పురుషాధిక్యతను, స్త్రీల అణచివేతను కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్న రాజకీయ పక్షాల స్వార్థాన్ని, కుట్రలను తిప్పికొట్టాలా? తేల్చుకోవాల్సిన తరుణమిది. చివరగా, శబరిమలలో రజస్వల కేంద్రంగా రాజకీయ పక్షాల మధ్య సాగుతున్న తీవ్రమైన పోట్లాట కేరళలోను, దేశంలోను తప్పుడు సామాజిక సంకేతాలకు దారితీసే ప్రమాదం లేకపోలేదు. మానవ హక్కులకు విఘాతం కలిగించి, యుద్ధాన్ని ప్రేరేపించేందుకు దోహదం చేసే 'మతం' కేంద్రంగా సాగే రాజకీయ వివాదం కంటే హక్కుల ప్రాతిపదికన 'స్త్రీ వాదం' పునాదిగా సాగే పోరాటం నేటి తక్షణ అవసరం. రాజ్యాంగబద్ధమైన సమరం చట్టం పరిధిలో కొనసాగించాలి. అలా కాకుండా, ప్రజల పాలిట మత్తు మందును రాజ్యాధికార సాధనంగా వినియోగించే శక్తులకు సులభంగా అవకాశం కల్పించే వాటిని కదపకుండా ఉండవలసిన తరుణమిది. 'స్త్రీ వాదం' అనేది మతానికి వ్యతిరేకంగా స్థిరంగా నిలుస్తుంది, జెండర్ సమానత్వ సంస్కరణల కోసం కృషి చేస్తుంది.

** కబీర్ దేవ్ (కౌంటర్ కరెంట్స్.ఆర్గ్)*

ఆదివాసీల ఆత్మ పరిశోధకుడు 'డార్ఫ్'



గుమ్మడి లక్ష్మీ నారాయణ
9491318409

మన దేశంలో ఆదిమ జాతులపై నిరంతర పరిశోధనలు జరిపిన భారత తొలి మానవ పరిణామ శాస్త్రవేత్త హైమండార్ఫ్. ఆదిమ గిరిజనులైన చెంచులు, గోండులు, కోలాం, కోయలపై అవిశ్రాంతంగా పరిశోధనలు జరుపుతూ, ఆదివాసుల అభ్యున్నతికి కృషి చేసిన మానవీయుడు హైమండార్ఫ్. ఆయన విస్తృత పరిశోధనల్లో భాగంగా క్షేత్ర పర్యటనకు తోడుగా సతీమణి బెట్టి ఎలిజబెట్ సహకారం ఆయన విజయానికి తోడ్పడింది. ఆదివాసీలపై సిద్ధం చేసిన అధ్యయన నివేదికలను హైదరాబాద్‌లోని నిజాం ప్రభువుకు సమర్పించే సందర్భంలో ఎలిజబెత్ అకాల మరణం చెందారు. ఆమె కోరిక మేరకు నాటి ఆదిలాబాద్ జిల్లాలోని జైనూరు మండలం మార్లవాయిలో గిరిజన సాంప్రదాయంతో ఖననం చేసి, సమాధి నిర్మించారు. డార్ఫ్ కూడా తన చివరి కోరికగా బ్రతికుండగానే బెట్టి సమాధి ప్రక్కనే తానూ సమాధి నిర్మించుకున్నాడు. డార్ఫ్ లండన్‌లో (1995) మరణించిన 17 ఏళ్ల తర్వాత తండ్రి చివరి కోరిక తీర్చేందుకు ఫిబ్రవరి 26, 2012 రోజున కొడుకు నికోలస్, కోడలు సారా, మనువడు హైమండార్ఫ్, మిత్రుడు ఫ్రేసన్‌తో కలిసి తల్లి సమాధి పక్కనే కర్మకాండ నిర్వహించారు. ఇది డార్ఫ్‌కు గోండులతో పెనవేసుకున్న ఆత్మీయ బంధానికి నిదర్శనం. తన కొడుకు పేరును ఆయన ''లచ్చు పటేల్'' గా మార్చడం గోండులతో అనుబంధాన్ని చాటుతున్నది.


ఆస్ట్రియా రాచరిక వంశంలో 1909, జూన్ 15న పుట్టిన ఆగర్భ శ్రీమంతుడు క్రిస్టాఫ్ ఫాన్ ప్యూరర్ హైండార్ఫ్ విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ రచనలు చదివి భారత్‌పై మక్కువ పెంచుకున్నాడు. మొదట ఆగ్రేయాసియా గిరిజనులపై అధ్యయనానికి గెల్డెర్న్‌ను స్ఫూర్తిగా తీసుకున్నాడు. 1936లో మానవ పరిణామ శాస్త్ర అధ్యయనానికి ఈశాన్య భారతంలోని నాగా (గిరిజను)లను మొదట ఎంచుకున్న డార్ఫ్ అనుబంధం జీవితాంతం ఆదివాసులతో కొనసాగింది. రెండవ ప్రపంచ యుద్ధం నాటికి నాజీ జర్మనీ పాస్‌పోర్ట్‌తో దేశంలో ఉన్న నేరానికి బ్రిటీష్ ప్రభుత్వం ఆయన్ను అరెస్టు చేసి, నిజాం సంస్థానానికి పంపించింది. నిజాం డార్ఫ్‌ను గిరిజన వ్యవహారాలపై ప్రత్యేక సలహాదారునిగా నియమించాడు. అలా హైమండార్ఫ్‌కు పడ్డ శిక్ష మన ఆదివాలకు వరమైందనే చెప్పవచ్చు. భార్య బెట్టి ఎలిజబెత్‌తో కలిసి భారత ఆదివాసుల సామాజిక జీవిత అధ్యయనాన్ని, బలహీన వర్గాల ప్రజలకు మేలు చేయడానికి జీవిత లక్ష్యంగా ఎంచుకున్న విలక్షణ పరిశోధకుడు డార్ఫ్. 1938–39 మధ్య నల్లమల అడవుల్లోని చెంచులు, కొండరెడ్లపై డార్ఫ్ అధ్యయనం చేపట్టాడు. ఆ తదుపరి ఆయన కార్యక్షేత్రం ఆదిలాబాద్ గోండు గూడేలకు మారింది. నిత్యం చెంచు పెంటలు, గోండు గూడేల ఆవాసాలే తమ నివాసాలుగా, వారి సంస్కృతీ, సంప్రదాయాలు, గిరిజన జీవనంతో లీనమవుతూ బెట్టి – డార్ఫ్‌ల క్షేత్ర పర్యటనలు కొనసాగటం విశేషం.

జల్– జంగల్– జమీన్ నినాదంతో ఆదివాసీ వీరుడు కొమురంభీం చేసిన తిరుగుబాటు (1938–40) నిజాం ప్రభుత్వాన్ని కుదిపి వేసింది. దీనికి కారణం మైదాన ప్రాంత పట్టేదార్లు, షావుకార్లు, అధికారులేనని తేలింది. వారి దోపిడీని నిర్మూలించనిదే ఆదివాసులకు బ్రతుకు లేదని డార్ఫ్ గ్రహించాడు. నిజాం సర్కార్‌కు ప్రత్యేక సలహాదారునిగా ఉంటూనే స్వయంగా కొన్ని అభివృద్ధి కార్యక్రమాలతో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాడు. వీటిలో ముఖ్యమైనది భూ పంపిణీ. గిరిజనులకు భూమి, అటవీ వనరులే జీవనాధారాలు గనుక పోడు వ్యవసాయం చేసుకునేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి సాధించాడు.

1944–48 మధ్య కాలంలో ఆదిలాబాద్ జిల్లా జైనూరు ప్రాంతంలో 47 వేల ఎకరాల అడవిని నరికించి, మొత్తం 1,60,000 ఎకరాల భూమిని పది వేల గిరిజన కుటుంబాలకు పంచిపెట్టారు. 1948–54 మధ్య కాలంలో డార్ఫ్ కృషి వల్లనే గోండు పటేళ్లు వందల ఎకరాల భూమిని పొందగలిగారు. తమకు జరిగిన మేలుకు గిరిజనులు ఎంతో సంతసించారు. అయితే భూమి కోసమే అడవిని నరకడం అనే దుర్భావనతో క్షీరసాగర మథనంలో కాలకూట విషం బయటపడ్డట్టు ఏజెన్సీ ప్రాంతాల్లోకి గిరిజనేతరుల వలసలు క్రమంగా పెరిగాయి. ఇలా 1960 లోపు గిరిజనుల భూమి 48 శాతం పైగా అన్యాక్రాంతం జరిగింది (గిర్గ్లానీ నివేదిక ప్రకారం). ఏజెన్సీ ప్రాంతాల్లో పని చేసేందుకు ప్రత్యేక సోషల్ సర్వీస్ కేడర్‌ను తయారు చేశారు. మానవ శాస్త్ర అధ్యయనం, పరిశోధనలకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంత్రోపాలజీ విభాగాన్ని (1945) ప్రారంభించారు.

గిరిజనుల అధ్యయనాలకు తోడు వారి అభివృద్ధి, సంక్షేమం కోసం తపించిన మహనీయుడు డార్ఫ్. నిజాం ప్రత్యేక సలహాదారు హోదాను ఉపయోగించుకొని గిరిజనుల రక్షణ కోసం, విద్య కోసం పలు సంస్కరణలకు పూనుకున్నాడు. డార్ఫ్ కృషి మూలంగా 100 దాకా గిరిజన పాఠశాలలు ఏర్పడ్డాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పడ్డ ఈ పాఠశాలల్లో గోండి భాషలోనే విద్యా బోధనకు శ్రీకారం చుట్టారు. మార్లవాయి, తాడ్వాయి, సుదిమళ్ల ప్రాంతాల్లో గిరిజన శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్లవాయిలో వ్యవసాయ క్షేత్రం స్థాపించి ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో శిక్షణ కల్పించారు. పనిముట్ల తయారీకి వడ్రంగి విద్యను బోధించారు. విత్తనాల నిల్వ బ్యాంకులను స్థాపించారు.

ఆదివాసులు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా వ్యవసాయ పని ముట్లు కొనడానికి రుణ సౌకర్యం కల్పిస్తూ 1946 నాటికే కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంకులు నెలకొల్పబడ్డాయి.



గిరిజన ప్రాంతాల్లో అటవీ హక్కులను రక్షించే విధంగా బ్రిటీష్ పాలకులు 'భూ బదలాయింపు చట్టం – 1915ను ప్రవేశపెట్టగా, దానికి బదులుగా నైజాం 1947లో ''దస్తూర్ – ఉల్ – అమాల్'' (1356 పస్లీ) జారీ చేశాడు. ఇది డార్ఫ్ పర్యవేక్షణలో సంస్కరించబడి 'భూ బదలాయింపు చట్టం –1959' వచ్చింది. ఇపుడు 1/70 చట్టంగా మారింది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నోటిఫైడ్ గ్రామాలు మొత్తం 5948 'షెడ్యూల్డ్ ఏజెన్సీ గ్రామాలు' గా మారాయి. అయినప్పటికీ ఏజెన్సీ ప్రాంతాల్లో అక్షర జ్ఞానం కొరవడిన ఆదివాసీలు భూ రక్షణ చట్టాలు, వారి హక్కులను అంత సులభంగా అర్థం చేసుకొని అభివృద్ధి చెందడం సాధ్యమా? అని డార్ఫ్ ఆవేదన వెలిబుచ్చాడు. ఇప్పటికీ డార్ఫ్ కలలు, ఆదివాసుల పోరాట ఫలితాలు అడియాసలుగా మిగులుతున్నాయి.

హైమండార్ఫ్ 1950– 85 మధ్య కాలంలో తెలంగాణ ప్రాంత గిరిజనుల సంస్కృతి, ఆచారాలు, జీవన విధానంపై అధ్యయనం చేసి గత ప్రభుత్వాలకు సలహాలు ఇచ్చాడు. డార్ఫ్ సేవలు, చివరి అనుబంధం ఆదిలాబాద్ గోండు గిరిజనులతోనే ఏర్పడింది. వారి సంస్కృతీ, సంప్రదాయాలకు ఆకర్షితుడైన డార్ఫ్ తన కొడుకు నికోలస్‌కు ఆత్రం లచ్చుపటేల్‌గా పేర్లు మార్చాడు. ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో జరిగే నాగోబా జాతర సందర్భంగా గిరిజనుల వద్దకే ప్రభుత్వం వెళ్లే విధంగా ''గిరిజన దర్బార్'' అనే కొత్త ప్రయోగాన్ని 1941 నుండి అమలు చేశాడు. డార్ఫ్ స్ఫూర్తితో ఆ కాలంలో మడవి తుకారాం ఐఎఎస్ అధికారి కాగలిగారు. డార్ఫ్ 1951లో లండన్ వెళ్లిపోయినప్పటికీ తరచూ ఆదిలాబాద్ జిల్లాను సందర్శించేవారు. 1981, ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో పోలీసు చర్య వల్ల చాలా మంది గోండులు చనిపోయిన దుర్ఘటన డార్ఫ్‌ను కలిచివేసింది.

డార్ఫ్ తన పదవీ కాలంలో, పదవీ విరమణ అనంతరం ఆదివాసులపై 5 పరిశోధక గ్రంథాలు రచించారు. అవి ప్రధానంగా చెంచులు, గోండులు, కోయలపై రాసిన పరిశోధక గ్రంథాలు. వాటిలో ముఖ్యమైనవి. ''ది చెంచూస్ జంగిల్ ఫోక్ రోల్ ఆఫ్ ది డెక్కన్ (1943)'', ''రాజ్ గోండ్స్ ఆఫ్ ఆదిలాబాద్ (1948)'', ''ది గోండ్స్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్'', ''ట్రెడిషన్ అండ్ ఛేంజ్ ఇన్ యాన్ ఇండియన్ ట్రైబ్'' (1979), ''ఎ హిమాలయన్ ట్రైబ్ :ఫ్రమ్ క్యాటిల్ టు క్యాష్ (1980)'' మొదలైనవి. 1982లో చివరగా ఆదివాసీ ప్రాంతాల్లో జన్యు సంబంధ, ఆచార వ్యవహారాలపై పరిశోధన చేస్తున్న ఊర్మిళా సింగ్లే సహకారంతో ''ట్రైబ్స్ ఆఫ్ ఇండియా; ఏ స్ట్రగుల్ ఫర్ సర్వైవల్'' రచించాడు. ఇది 'ఆదివాసీల మనుగడ కోసం పోరాటం' తెలిపే రచన.

ఆదివాసీల జీవితాల్లో మెరుగైన అభ్యున్నతిని కాంక్షించిన వారి తొలి ఆత్మబంధువు డార్ఫ్. తన జీవిత చరమాంకం వారితోనే గడిపిన హైమండార్ఫ్ స్వదేశంలోని లండన్‌లో 1995 జనవరి 11న తుది శ్వాస విడిచారు. అతని చివరి కోరిక నెరవేరడానికి 2012లో డార్ఫ్ అస్థికలను మార్లవాయిలోనే ప్రతిష్టించడం గోండుల ఆత్మీయతకు ప్రతీక. డార్ఫ్ నివేదికల ఆధారంగా గత ప్రభుత్వాలు ఎస్సార్ శంకరన్, బిడి శర్మల ఆధ్వర్యంలో కమిషన్లు వేసినా, వాటిని అమలు చేయడంలో ఇప్పటికీ పురోగతి లేదనేది జగద్విదితం. ఆదిమ జాతుల అభ్యున్నతికి కృషి చేసిన హైమండార్ఫ్ ఆదివాసీలకే కాదు మానవతా వాదులందరికీ ప్రాతఃస్మరణీయుడు.

విడని లంకెల ముడి జి.ఎస్.టి.

వస్తు సేవల పన్ను (జి.ఎస్.టి.) 2017 జులైలో అమలులోకి వచ్చినప్పటి నుంచి 400 ఆదేశాలు, ఉత్తర్వులు జారీ అయినాయి. ఈ పన్ను అమలు చేయడం ఎంత సంక్లిష్టంగా తయారైందో దీనివల్ల రుజువు అవుతోంది. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్నందువల్ల అధికారంలో ఉన్న బిజెపి, ప్రతిపక్ష కాంగ్రెస్ మరిన్ని మార్పులు చేయాలనే కోరుతున్నాయి. బిజెపి ప్రభుత్వం 23 వస్తువులపై జి.ఎస్.టి.ని 18 శాతానికి తగ్గించింది. పన్ను విధింపును మరింత సరళతరం చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేయవచ్చునని మీడియాలో వార్తలు వస్తున్నాయి. కానీ ఇంతవరకు జారీ చేసిన ఉత్తర్వులు, ఇప్పుడు చేస్తున్న వాగ్దానాలు జి.ఎస్.టి. లోని సంక్లిష్టతను ఏ మేరకు తొలగించగలవన్నది శేష ప్రశ్నే. దేశంలోని ద్రవ్య విధానంలో ఫెడరలిజం, పన్నులు చెల్లించేట్టు చూడడం, అన్నింటికన్నా మించి అవ్యవస్థీకృత రంగంలో ఉన్న వ్యాపారాలు, చిన్న మొత్తాల్లో పెట్టుబడులు మొదలైన సమస్యలకు ఇంతవరకు పరిష్కారమే లేదు.

ఎన్నికలు ఎదుర్కోవడానికి పన్నుల సంస్కరణల గురించి మాట్లాడడం కొత్త కాదు. జనంలో ఉన్న అసంతృప్తిని తగ్గించడానికి మలేషియాలో పన్నులు తగ్గించడానికి వెనుకాడకపోవడం జనాకర్షక విధానాలకు తాజా ఉదాహరణ. మలేషియా ప్రభుత్వానికి పన్నుల ద్వారా సమకూరే ఆదాయంలో అయిదోవంతు జి.ఎస్.టి. ద్వారానే వస్తోంది. మన దేశంలో ఇలాంటి తగ్గింపులకు ఉపక్రమిస్తే అది ఖరీదైన వ్యవహారంగా మిగిలిపోవచ్చు. కానీ దేశ ఫెడరల్ విధానానికి మాత్రం భంగం కలగక తప్పదు.

జి.ఎస్.టి.లో మార్పులు చేర్పులు చేయడానికి రాజ్యాంగ సవరణలు అవసరం లేదు అని ఆర్థిక వ్యవహారాలపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరవ్ వల్లభ్ ఇటీవల చెప్పారు. జి.ఎస్.టి. మండలే ఈ పని చేయవచ్చు. ఇది ఆర్థిక విధానాలలో రాష్ట్రాలకు ఉన్న స్వయం ప్రతిపత్తిని కాలరాయడమే. బిజెపి నాయకత్వంలోని ఎన్.డి.ఎ. ప్రభుత్వ లక్షణమే ఇది. వివిధ రాష్ట్రాలలో ఆర్థిక సమస్యలు ఒకేలాగా ఉండవు. విద్యుత్తు, స్థిరాస్తి, పెట్రోలియం ఉత్పత్తులను జి.ఎస్.టి. పరిధిలోకి తీసుకురావడం పంజాబ్ లాంటి రాష్ట్రాలకు ఉపకరించవచ్చు. మిగతా రాష్ట్రాలకు ఇదే సూత్రం వర్తించదు.

ఉత్తరాదిలోను మూడు రాష్ట్రాలకు ఇటీవల జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధించినందువల్ల జి.ఎస్.టి. మండలి స్వరూపంలో కొంత మార్పు వచ్చింది. ఈ మార్పు బిజెపికి వ్యతిరేకమైందే. అయితే దీని ఆధారంగానే జి.ఎస్.టి. స్వరూపాన్ని మార్చగలం అనుకోవడం దురాశే అవుతుంది. 2019లో ఒక వేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది అనుకున్నా జి.ఎస్.టి. మండలిలో మార్పులు చేయడానికి నాల్గింట మూడు వంతుల మెజారిటీ అవసరం. ఎందుకంటే రాష్ట్రాలు కీలక పాత్ర పోషిస్తాయి. రాష్ట్రాలు దాదాపు జి.ఎస్.టి.ని అంగీకరించినందువల్ల అదీ తమ రాబడికి ఏదైనా నష్టం కలిగితే ఆ లోటును కేంద్రం పూడుస్తుందని హామీ ఇచ్చినందువల్లే. అంటే ఫెడరలిజం నిర్ణాయక పాత్ర పోషించడం ఇప్పటికే తగ్గు ముఖం పట్టింది.

అన్నింటికంటే ముఖ్యమైంది ఈ రాజీలు మరో ప్రత్యామ్నాయ వాస్తవికతకు నిదర్శనం. జి.ఎస్.టి. ఫలితాలు ఎలా ఉంటాయన్న విషయంలో విధాన నిర్ణయాలు తీసుకునే వారికే అంటే ఎన్.డి.ఎ. కే స్పష్టత లేదు. ఈ అస్పష్టత ఆధారంగానే ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు సాగుతాయి. ఎన్నికలు లేనప్పుడు ప్రజలనుంచి ముక్కు పిండి పన్నులు వసూలు చేస్తారు. ఉదాహరణకు గ్యాస్ సిలిండర్లకు కుటుంబాలు 2017 జులై నుంచి రూ. 32 అధికంగా చెల్లించవలసి వస్తోంది. దీనికి తోడు సబ్సిడీ తగ్గించారు. ఎన్నికలు దగ్గరపడితే పన్నులను 'హేతుబద్ధం' చేసే పేర పన్నులు తగ్గిస్తుంటారు. గ్యాస్ విషయంలో సబ్సిడీ లేని వినియోగదార్లకు సిలిండర్‌కు రూ. 120.50 తగ్గిస్తే సబ్సిడీ ఉన్నవారికి రూ.5.90 తగ్గించారు. ఏడాదిన్నరపాటు ముక్కు పిండి పన్ను వసూలు చేసిన తర్వాత ఇప్పుడు పన్నులను 'హేతుబద్ధం' చేస్తామంటున్నారు. ఆర్థిక, రాజకీయ వ్యవస్థల్లో అపారమైన తేడాలున్న భారత్ లాంటి దేశంలో జి.ఎస్.టి. అమలు చేయడం సులభం కాదు. అందువల్ల తప్పులు చేయడం, దిద్దుకోవడం సహజమే. ఈ పరిస్థితిలో బిజెపి సాహసాన్ని, స్ఫూర్తిని అభినందించవలసిందే. కానీ ఇలాంటి ప్రయోగాలలో ఉన్న రాజకీయ ఉద్దేశాలు ఏమిటి?

గత నాలుగు దశాబ్దాల నుంచి వివిధ ప్రభుత్వాలు దేశ ప్రజాస్వామ్య మూల సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించకూడదన్న ఉద్దేశంతో జి.ఎస్.టి. లాంటి పన్నుల సంస్కరణలు ప్రవేశపెట్టడానికి సంకోచించాయి. అయితే బిజెపి తొందరపాటుతో జి.ఎస్.టి.ని అమలు చేయడమే కాకుండా పరోక్ష పన్నుల సంస్కరణలలో ఇది బ్రహ్మాండమైందని విపరీతంగా ప్రచారం చేసింది. కానీ ఇందులో ఆర్థికాంశాల ఇంగిత జ్ఞానం లేదు. జి.ఎస్.టి. వల్ల పన్ను వసూళ్లు పెరుగుతాయని, ద్రవ్యోల్బణం తగ్గుతుందని, ఆర్థికాభివృద్ధి రేటు దూసుకెళ్తుందని చేసిన ఆర్భాటాలు ఫలించలేదు. పైగా అందరికీ ఒకే సైజు సరిపోతుందన్న బిజెపి వాదన వెనక ఆర్థిక, రాజకీయ రంగంలో ఆధిపత్యం చెలాయించాలన్న దురుద్దేశం ఉంది. ఉదాహరణకు చిన్న సంస్థలు పెద్ద సంస్థలలాగే పని చేసి వాటి కార్యకలాపాలు పెరుగుతాయని చెప్పారు. కాని అవ్యవస్థీకృత రంగంలోని సంస్థలపై పరిపాలనా సంబంధ భారం పెరిగింది. వ్యవస్థీకృత రంగం మరింతగా ఖర్చులు పెంచాల్సి వచ్చినందువల్ల ఆదాయ, ఉద్యోగాలలో అభద్రతా భావం పెరిగింది. ఒక రాజకీయ పార్టీ సంకల్పం దాని కృత నిశ్చయం, అనూహ్యమైన పరిణామాల ఆధారపడి ఉంటుంది తప్ప కేవలం మాటల వల్ల కాదు. జి.ఎస్.టి. ఇప్పుడు వెనక్కు తీసుకోవడం దాదాపుగా కుదరదు. రాజకీయ పార్టీలు అంటే ఎన్.డి.ఎ. లాంటి సంకీర్ణాలు తమ రాజకీయ అనుయాయులను పెంచుకోవచ్చు. అవి నిలబడతాయా లేదా అన్నది వేరే విషయం. దీర్ఘకాలికంగా ప్రజల పాత్ర పెంచాలంటే విధాన నిర్ణయాలు తీసుకునే వారికి సమ్యక్ దృక్పథం, నిర్మాణాత్మక లోపాలను సరిదిద్దే శక్తి, ఏయే పన్నులను మినహాయించవచ్చునన్న దృష్టి, పన్ను రేట్లను సులభతరం చేసే లక్షణం మొదలైనవి అవసరం. అయితే ఇవన్నీ దేశ ప్రజాస్వామ్యానికి తగ్గట్టుగా ఉండాలి.

** (ఇ.పి.డబ్ల్యు.సౌజన్యంతో)*

సకుటుంబం

అమ్మాయిలకు అమ్మే ఆది గురువు..!



పెరుగుతున్న కొద్దీ పిల్లల్లో ఎన్నో సందేహాలు. తమ చుట్టూ చూసేవి, అనుభవించేవి. ఊహకందేవి అందనివీ కూడా. ఇవన్నీ ఎవర్ని అడగాలి? కచ్చితంగా అమ్మనే. ముఖ్యంగా అమ్మాయిలకు వచ్చే ప్రతి అనుమానం వాళ్ళ దేహం గురించే. ఒక వయస్సు వచ్చేసరికి వాళ్ళ శరీరంలో ఎన్నో మార్పులు మొదలవుతాయి. వాళ్ళు మానసికంగా సిద్ధం అయి వుండరు. ఆ అంశాన్ని గురించి ఎలాంటి ప్రశ్న వేసినా ముందు అమ్మలకే గొంతు పెగలదు. అమ్మ నేనెక్కడ నుంచి వచ్చాను అనే చాలా మంది వేసే ప్రశ్న. ఇలాంటి మాట చెవిన పడగానే తల్లి కంగారుపడి పోయి ఛీ.. అవేం మాటలు? ఎక్కడ నేర్చుకుంటున్నావ్? నోర్మూయ్ అని బెదిరించి వాళ్ళ నోరు మూస్తారు గానీ అది వాళ్ళు తెలుసుకునే వయసుగా గుర్తించరు. తల్లి ముఖం చూసి తామేదో తప్పు చేశామన్న అపరాధ భావనలో పిల్లలు వెళ్ళిపోతారు. సమాచార విప్లవం మొదలై సైన్స్‌లో లైంగిక అంశాలు పాఠ్యాంశాల్లో చేర్చిన తరువాత పిల్లల్లో సహజంగానే స్త్రీ పురుషుల శారీరక నిర్మాణంలోని తేడాలపైన ఆసక్తి కలుగుతుంది. ఆ వయసులో తెలుసుకోవాలనే కోరికతో తమ స్నేహితులను, ఇంటర్నెట్‌ను ఆశ్రయిస్తారు.

ఫలితంగా పెద్ద వాళ్ళ దగ్గర నుంచి దూరంగా జరిగిపోతారు. ఆసక్తి చంపుకోలేరు. సమాచారం అందదు. సరైనదీ, సక్రమైనదీ పిల్లలకి అందితే పర్లేదు. వాళ్ళు అనవసరమైన విషయాలపై దృష్టి మళ్ళించుకొంటే ప్రమాదం. అందుకే పిల్లలకు సరైన మార్గంలో చెప్పగలిగేది తల్లే. ముఖ్యంగా కూతుళ్ళను వయసుకు తగ్గట్టుగా సిద్ధం చేయటం తల్లి బాధ్యత. రజస్వల వయసు వచ్చే సరికి, ముందే ఆ నెలవారీ ఇబ్బంది గురించి తల్లి చెప్పాలి. ఎందుకు ఇబ్బంది, దాని లక్ష్యం ఏమిటీ? ఏం జాగ్రత్తలు తీసుకోవాలి అనే వైజ్ఞానిక వివరణ ఇవ్వాలి. కొత్త ప్రశ్నలు వేస్తే అవకాశం ఇవ్వాలి. ప్రోత్సహించాలి. బహిష్టుతో పాటు లైంగిక కలయిక, గర్భం వచ్చే తీరు వివరించాలి. ఇలా వాళ్ళకు తెలియజేస్తేనే వాళ్ళలో లైంగిక పరమైన అమాయకత్వం పోతుంది. లేని పోని సమస్యలు కొనితెచ్చుకోరు. అలాగే సెక్స్ కోర్కెలు ఎందుకు ఎలా కలుగుతాయో ఆ వయసులో ఆకర్షణలు ఎలా ఏర్పడతాయో వాటి వల్ల వచ్చే ఇబ్బందులు అన్నీ ఆడపిల్లలకు తల్లి చెప్పుకోవాలి.

పదహారేళ్లు దాటుతూనే అవసరమైతే ఓ హాస్టల్‌లోనే చదువుకోవలసిన అమ్మాయి లైంగిక విజ్ఞానం గురించి తెలుసుకుంటేనే జాగ్రత్తగా ఉండగలదు. టీనేజీలో ఎదురయ్యే ఎన్నో ఆకర్షణలు గురించి వాళ్ళు ఒక ఎరుకతో జీవితంలో మొదటి అడుగులు వేస్తారు. టీనేజ్ ఒక రకంగా తిరుగుబాటు దశ. దేన్నీ అంగీకరించకుండా అన్నీ స్వయంగా అనుభవించి తెలుసుకోవాలనుకొంటారు. కొత్తగా దొరికిన స్వతంత్రం వాళ్ళని కొత్తదనాన్ని రుచిచూడమంటుంది. కానీ దానికి పరిమితులు ఉండాలని తల్లి తెలియజేయాలి. గర్భం వచ్చే ప్రమాదం, ఆడపిల్లలకు తెలియాలి. అలాంటి సమయం వస్తే ఆడపిల్లల ఎంత ఒంటరిదయిపోతుందో చెప్పాలి. అలాగే తమ విచ్చలవిడితనాన్ని సహించమని కూడా స్పష్టం చేయాలి.

టీనేజీలో అమ్మాయిలు చక్కని రూపాన్ని సంతరించుకుంటారు. తమ ఇష్టం వచ్చిన రీతిలో అలంకరించుకోవాలని భావిస్తారు. ఈ విషయంలో వాళ్ళు రాజీ పడనక్కరలేదు. తల్లి అనుభవశాలి. జీవితంలో ఆ దశను దాటివచ్చిన మనిషి. తన సొంత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పిల్లలు చక్కగా ఎలా తయారుకావచ్చో ఒక వేళ అమ్మాయిల్లో ఆకర్షణీయ అంశాలు లేకపోతే వాళ్ళు ఆత్మన్యూనతలో పడకుండా, సాటి వాళ్లతో పోల్చుకొని తమ శరీరపు అందచందాల గురించి విచారాలు పడకుండా తల్లే పిల్లలకు అసలైన సౌందర్యం గురించి, హుందాతనాన్ని గురించి నేర్పించాలి. పోషకాహారం, బరువును కంట్రోల్ లో ఉంచుకొనే అవసరం, చర్మ సౌందర్య చిట్కాలు, డ్రస్ వేసుకొనే పద్ధతి. ఆ వయసుకు కావలసిన మేకప్, ఆభరణాలు సర్వం తల్లే మొదటి గురువై ఆడపిల్లకు నేర్పాలి.

ఆలోచనలకు ఆరోగ్యానికి ఉండే సంబంధం గురించి పిల్లలు తెలుసుకోవాలి. కెరీర్‌లో మొట్టమొదటి అడుగు వేసే దశ. అమ్మాయి జీవితపు గ్రాఫ్‌ను తల్లి కళ్ళకు కట్టేలా చూపించాలి. చదువు ప్రాముఖ్యత, జీవితంలో ఆమె స్థిరపడబోయే విధానం. అనవసర అంశాల వైపు దృష్టి పోనివ్వకుండా లక్ష్యం వైపే చూడగలిగే ఏకాగ్రత అమ్మాయి తెలుసుకోవలసిన అంశాలు. తల్లి వాళ్లను గమనించే స్వతంత్రం మాత్రం తీసుకోవాలి. అంతేకానీ నిరంతరం వాళ్ళను వెంటాడే సిఐడిల్లాగా తల్లులు వ్యవహరించకూడదు. తమను అనుమానిస్తూ ఉందని గ్రహించిన మరుక్షణం పిల్లలు మనసు దాచుకుంటారు.

చాలా మంది తల్లులకు వయసు వచ్చిన కూతురుపైన ప్రేమతో పాటు అనుమానం కూడా జాస్తిగానే ఉంటుంది. ఆంక్షలతో వాళ్ళని కంట్రోల్‌లో ఉంచగలరని తల్లులు భావిస్తారు. కానీ పిల్లలు అమాయకులు కారని గ్రహించాలి. వాళ్ళది నేర్చుకొనే వయసు. ఏ విషయమయినా చిటికెలో నేర్పిస్తారు. తల్లి తనను అనుమానించే విషయాన్ని కూడా ఆమె పట్ల నమ్మకం తగ్గుతూ ఉంటే ఆ ప్రేమను, నమ్మకాన్ని, ఆదరణను ఇంటి బయట వెతుక్కుంటారు. నిజానికి ఇలాంటి సందర్భాల్లోనే తమను ఫేవర్ చేసే అబ్బాయిల ఆకర్షణకో మాటలకో దొరికి పోతారు.

అమ్మాయిలు వ్యక్తిత్వం గలవారిగా తీర్చిదిద్దడంలో ఇంటి పనులు, మర్యాదలూ, సమాజంలో మెలిగే పద్ధతులతో పాటుగా, శరీరం గురించి అందం గురించి స్త్రీ పురుష సంబంధంతో లైంగిక ఆనందం వాటిని పొందటంతో ఉన్న సామాజిక ఇబ్బందులు వ్యక్తిగత ఆరోగ్యం కుటుంబ సంక్షేమం గురించి తల్లి క్షుణ్ణంగా నేర్పితేనే ఆమె పెంపకంలో ఆడపిల్లలు సంస్కారానికి రూపాలుగా పెరుగుతారు. బిడ్డకు మొదటి గురువుగా తల్లిది ఒక అసాధరణ పాత్ర. ఆమె వేసిన ప్రాథమిక పునాదితో ప్రపంచం గురించి ఆమె ఇచ్చిన నమ్మకంతో సమాజానికి పనికొచ్చే వాళ్ళవుతారు. చదువుతో పాటు వ్యక్తిత్వం లైంగిక పరమైన పరిజ్ఞానం అవసరమేనని తల్లులు గుర్తిస్తే ఒక ఉత్తమమైన మహిళాతరాన్ని సమాజానికి అందించగలవారు అవుతారు.

పుట్టిన మరుక్షణం నుంచి బిడ్డను గుండెకత్తుకొని ప్రేమను మాత్రమే పంచే తల్లి పాత్ర ఈ తరంలో ఇంకాస్త బాధ్యతాయుతంగా ఉండాలి. వారి భావోద్వేగాలను కూడా ఒడిసి పట్టుకొని వాళ్ళను భవిష్యత్తు మార్గదర్శకాలుగా వ్యవహరించాలి. వారి జీవితంలో ఎదురయ్యే ప్రతి కష్ట సుఖానికీ నేనున్నాననీ ధైర్యాన్ని వారికి రక్తంలో ఇంకేలా ఇవ్వగలగాలి.

బిడ్డలు ఆమె నుంచి వారసత్వంగా మానవత్వం, దయ కరుణ, అర్థం చేసుకొనే తత్వం, దేన్నయినా ఇవ్వగలిగే మంచి మనసు, కష్టాన్ని ధీరత్వంతో ఎదుర్కొనే తెగువ, ప్రేమించే మనసు అన్నీ రావాలి. తల్లి ప్రేమను నిర్వచించే పదాలు బహుశా ఇంకా ఎవరూ సృష్టించలేదు.

నాణ్యమైన కాస్మొటిక్స్‌తో చర్మానికి మేలు

రోజులో రెండుసార్లు గోరువెచ్చని నీటితో ముఖం కడుక్కోవాలి. దానికి నాణ్యమైన ఫేస్‌వాష్‌ని వాడాలి. ఇలా చేస్తే చర్మంపై పేరుకుపోయిన మురికి తొలగిపోతుంది. అలాగే నాణ్యమైన మాయిశ్చరైజర్‌ని వాడితే చర్మం తేమగా ఉంటుంది.


* ఏ ఉత్పత్తి వాడాలనుకున్నా సరే.. చర్మతత్వాన్ని బట్టి ఎంచుకోవాలి. అలంకరణ వీలైనంత తక్కువగా వాడాలి. అలాగే మేకప్‌ని తప్పనిసరిగా శుభ్రం చేసుకున్నాకే పడుకోవాలి.
* మొటిమల్ని గిల్లడం, నొక్కడం వంటివి చేస్తే ఇన్‌ఫెక్షన్ రావొచ్చు. అలాగే వెల్లుల్లి, పసుపు, చందనం రాయడం, తెలిసిన ప్రతి పూతను వేసుకోవడం వంటి సొంత ప్రయోగాల చేస్తే సమస్య ఇంకా పెరగొచ్చు.
* మొటిమలు ఉన్నప్పుడు నూనె శాతం ఎక్కువగా ఉండే చిప్స్, బేకరీ పదార్థాలు, వేపుళ్లు, శీతలపానీయాల వంటివాటికి దూరంగా ఉండాలి.



నిద్రలేమికి కివీతో చెక్!

ఆ న్యూజిలాండ్ పండుగా పేరొందిన కివీ, ఇటీవల మనదేశంతో బాటు ప్రపంచవ్యాప్తంగా దొరుకుతోంది. ఇందులో పోషకాలు ఎక్కువ, క్యాలరీలు తక్కువ. పైగా మిగిలిన పండ్లతో పోలిస్తే సి–విటమిన్ శాతం చాలా అధికం ఒకపండు నుంచి 42 క్యాలరీల శక్తితోబాటు, సుమారు 64 మి.గ్రా సి– విటమిన్, 3 గ్రా. ఎ– విటమిన్, 252 మి.గ్రా పొటాషియం, 17 మై.గ్రా ఫోలేట్, 2.1 గ్రా. పీచూ లభ్యమవుతాయి. ఇంకా విటమిన్ –ఇ, కెలతో బాటు కాపర్, మెగ్నీషియం, కోలీన్, ఫాస్ఫరస్ కూడా ఉంటాయి. అందుకే ఇది ఆరోగ్యానికి ఎంతో మంచిదని అనేక తాజా పరిశోధనల్లో తేలింది.

* కివీ పండ్లను ఎక్కువగా తీసుకోవడం వల్ల చర్మానికి నిగారింపు వస్తుంది. సూర్యరశ్మి, కాలుష్యం కారణంగా చర్మం ముడతలు పడకుండా ఇందులోని సి– విటమిన్ కొల్లాజెన్‌లా పని చేస్తూ ఒంటిఛాయను మెరుగుపరుస్తుంది.
* నిద్రలేమితో బాధపడేవాళ్ళకి ఈ పండ్లు ఔషధంలా పనిచేస్తాయి.
* సోడియం తక్కువ, పొటాషియం ఎక్కువ ఉండే ఈ పండ్లను ఎక్కువగా తీసుకోవడంవల్ల హృద్రోగాలు వచ్చే ప్రమాదం తక్కువని మెడికల్ స్కూల్‌కు చెందిన పరిశోధకులు పేర్కొంటున్నారు. పొటాషియం కారణంగా పక్షవాత ప్రమాదం తగ్గడంతోబాటు ఎముక సాంద్రత క్షీణించుండా ఉంటుంది. మూత్రపిండాల్లో రాళ్ళు ఏర్పడకుండానూ ఉంటాయి. బీపీ కూడా తగ్గుతుంది. అన్నింటికన్నా కివీ పండులోని జిగురు కారణంగా మల బద్ధకం లేకుండా ఉంటుందట. కాబట్టి మలబద్ధక బాధితులకి ఇది ఎంతో మంచిది.



పిల్లల్లో బుద్ధిమాంద్యం పోవాలంటే..!

ఎదురుగా ఎవరూ లేకున్నా, ఆటలాడుకుంటున్నప్పుడు చిన్న పిల్లలు ఒకే పదాన్ని ఒకటికి రెండుసార్లు పలకడం, తమలో తామే మాట్లాడుకోవడం చేస్తుంటారు. సరిగ్గా మాట్లాడటం నేర్చుకోవడంలో భాగంగానే వాళ్లలా చేస్తారట. ఇది వాళ్ల మెదడు పెరుగుదలకు సంకేతం కూడా. అలా ఒకటికి రెండుసార్లు తమలో తామే మాట్లాడుకోవడం ద్వారా భాషను మెరుగుపరుచుకుంటారు, ఉచ్ఛారణలోని తప్పుల్ని కూడా సరిచేసుకుంటారు. కాబట్టి ఆ వయసులో పిల్లల్ని అలా గట్టిగా మాట్లాడుకోనివ్వడం మంచిదట. బుద్ధిమాంద్యంతో బాధపడే పిల్లల్లో ఇది అంతగా కనిపించదు. కాబట్టి వాళ్లు అలా చేసినప్పుడు పెద్దవాళ్లు కూడా ఆయా పదాలను ఉచ్ఛరించితే మంచిది. నర్సరీ స్కూళ్ళలో అంకెలనీ పద్యాలనీ బయటకు వినిపించేలా గట్టిగా ఒకటికి నాలుగుసార్లు చదివించేదీ అందుకే మరి.



జీన్స్..జిగేల్



పాత వస్తువులను పడేయకుండా...వాటిని రీసైకిల్ చేసి తిరిగి ఉపయోగించుకోవడాన్ని చాలామంది పెద్ద పనిగా భావిస్తుంటారు. కానీ ఒకసారి పక్కనున్న ఫొటోలను చూస్తే అదెంత సులువో మీకే అర్థమవుతుంది. చిరిగిపోయిన జీన్స్ ప్యాంట్లు అందరింట్లో తప్పకుండా ఉంటాయి. మరి వాటిని పడేయకుండా జాగ్రత్తగా దాచి..వాటికున్న పాకెట్లను కత్తిరించి పక్కన పెట్టుకోవాలి. అలా ఓ అయిదారు పాకెట్లు పోగయ్యాక మీ రీసైక్లింగ్ ప్రారంభించండి...ఎలా అంటారా? ముందుగా పెద్ద సైజు జీన్స్ క్లాత్‌ను (పాతవైనా..)తీసుకోండి. ఇప్పుడు పక్కన పెట్టుకున్న పాకెట్లను ఆ క్లాత్‌పై పెట్టి, చుట్టూ కుట్లేస్తే సరి. ఇప్పుడు వాటిని ఎలాగైనా ఉపయోగించుకోవచ్చు. గోడకు ఈ పాకెట్ హ్యాంగర్‌ను హాల్లో తగిలించి, అందులో మనకవసరమైన వస్తువులను ఇందులో పెట్టుకోవచ్చు. ఇదే కాకుండా దిండు కవర్‌గా, మెడలో నగగా, హ్యాండ్‌బ్యాగ్‌గా, మొబైల్ చార్జ్ పౌచ్‌గా, పెన్నులు వేసుకునే స్టాండ్‌గా ఇలా రకరకాలుగా చేసుకునే వీలున్న ఈ జీన్స్‌ను ఇక నుంచి పడేయకుండా...ప్రయత్నించండి.










చిట్కాలు

* అన్నం మాడిపోయి వాసన వస్తుంటే కొంచెం ఉప్పు వేస్తే ఆ వాసన పోతుంది.
* కాఫీపొడిని గాలి చొరబడని డబ్బాలో ఉంచి డీప్ ఫ్రిజ్‌లో ఉంచితే గడ్డ కట్టకుండా ఉంటుంది.
* గారెలు చేసేటప్పుడు నూనె చిందకుండా ఉండాలంటే అందులో కొంచెం నెయ్యి కలిపితే చాలు.




మన రంగవల్లులు



13 చుక్కలు
7వచ్చే వరకు
మధ్య చుక్క



బరిగెల కీర్తి
బొగ్గుల దొన



15–1చుక్కలు

సులోచన
గోదావరిఖని

ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం : కాంగ్రెస్

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిపై తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ నిజాముద్దీన్ డిమాండ్ చేశారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఆదాయ రాబడి, ఖర్చుల వివరాలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు అవసరమయ్యే బడ్జెట్‌పై ప్రజలకు స్పష్టత వస్తుందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రైతు బంధు పథకానికి రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 12వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించంగా, వచ్చే ఆర్థిక సంవత్సరానికి రెట్టింపు బడ్జెట్ అవసరమవుతుందని వ్యాఖ్యానించారు. ప్రతీ యేడాదికి సంబంధించిన సాధారణ ఖర్చులు, ఉద్యోగుల జీతభత్యాలతో, పెన్షన్లు, ఇతర సంక్షేమ కార్యక్రమాలకు కూడా నిధులను ఖర్చు చేస్తున్నందున ఇక రాష్ట్రానికి వచ్చే ఆదాయం కంటే ఖర్చే ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజల్లో నెలకొన్న ఆందోళనను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే ఆర్థిక పరిస్థితిపై ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు.

తెలంగాణ కిసాన్
కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్‌గా అన్వేష్‌రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ చైర్మన్‌గా అన్వేష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఏఐసిసి అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నుంచి ఆయనకు నియామక పత్రం అందింది. ఇప్పటివరకు చైర్మన్‌గా ఉన్న కోదండరెడ్డి ఏఐసిసి కిసాన్ కాంగ్రెస్ జాతీయ వైస్‌చైర్మన్‌గా నియమితులైన నేపథ్యంలో అన్వేష్‌రెడ్డిని ఆ పదవిలో నియమించారు. అన్వేష్‌రెడ్డి ఇప్పటి వరకు కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.

ఇవ్వలేం : ఏపి

(మొదటిపేజీ తరువాయి)

చైర్మన్ ఆర్‌కె జైన్ సూచించారు. మార్చి నెల తర్వాత మరోమారు ఈ అంశంపై చర్చించి శాశ్వత పరిష్కారం కోసం ఆలోచించాలని ఆ రాష్ట్రాలకు స్పష్టం చేశారు. ఒప్పందం ప్రకారం చెన్నయ్‌కు మహారాష్ట్ర, కర్నాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు తలా ఐదు టిఎంసిలు చొప్పున ప్రతీ ఏటా తాగునీటి అవసరాలకోసం మొత్తం పదిహేను టిఎంసిలను ఇవ్వాలని బచావత్ ట్రిబ్యునల్ గతంలో తీర్పు ఇచ్చింది. ఇందుకు ఆ రాష్ట్రాలు సమ్మతి తెలిపాయి. ఆ ప్రకారం గతేడాది జూలై నుంచి మొదలైన 'వాటర్ ఇయర్'లో ఇప్పటివరకు తమకు కేవలం 1.76 టిఎంసిల నీరు మాత్రమే అందిందని, నగర తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని ఆ రాష్ట్ర ఇంజనీర్ ఇన్ చీఫ్ భక్తవత్సలం ఆవేదన వ్యక్తం చేయడంతో అన్ని రాష్ట్రాల ప్రతినిధులతో కృష్ణా బోర్డు చైర్మన్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చెన్నయ్ నగరానికి ఇకపైన నీరు ఇవ్వలేమని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎవ్వరికీ నీరు ఇవ్వవద్దంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని ఆ రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ మురళీధర్‌రెడ్డి ఈ సమావేశంలో వ్యాఖ్యానించారు. కండలేరు జలాశయం పరిధిలో పంటలు వేసుకోవద్దంటూ 'క్రాప్ హాలిడే' ప్రకటించినా ఆ ప్రాంత రైతులు వినకుండా పంటలు వేసుకున్నారని, ఈ నేపథ్యంలో వారికి సాగునీటిని అందించాల్సి ఉందని సిఎం సూచించారని చీఫ్ ఇంజనీర్ గుర్తుచేశారు. కండలేరులో ప్రస్తుతం కేవలం సుమారు 7.8 టిఎంసిల నీటి నిల్వ ఉన్నా అక్కడి నుంచి పూండి (చెన్నై సమీపంలోని రిజర్వాయర్)కి నీటిని వదిలినా 150 కి.మీ. మార్గంలో రైతులు మధ్యలోనే పొలాలకు మళ్లించుకునే అవకాశం ఉందని, అందువల్ల చెన్నైకు నీరు అందడం కష్టమేనని ఆ రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ అభిప్రాయపడింది. తమకు చాలా ఇబ్బంది ఉన్నందునే తమిళనాడు అధికారులు చెప్పడంతో బోర్డు చైర్మన్ జైన్ జోక్యం చేసుకుని నీటి విడుదలకు ఏపీపై ఒత్తిడి తెచ్చారు. దీంతో మార్చి నెల వరకు రెండు టిఎంసిలను విడుదల చేసేందుకు చీఫ్ ఇంజినీర్ అంగీకరించారు. ఏటా 15 టీఎంసీలు అందాల్సి ఉన్నప్పటికీ ఆ రాష్ట్రాలు నాలుగైదు టిఎంసిలతోనే సరిపెడుతున్నాయని కేంద్ర ప్రభుత్వానికి తమిళనాడు మొరపెట్టుకుంది. చివరకు ఈ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాల్సిందిగా కృష్ణా బోర్డును కేంద్రం ఆదేశించింది. ఆ ప్రకారం జలసౌధలోని బోర్డు కార్యాలయంలో బోర్డు సమావేశం దాదాపు మూడు గంటలకు పైగా కొనసాగింది. కర్ణాటక జల వనరుల శాఖ అధికారులు ఈ సమావేశానికి డుమ్మా కొట్టారు. ట్రిబ్యునల్ ఉత్తర్వుల ప్రకారం ఉమ్మడి ఏపీ వాటా ఐదు టిఎంసిలు కాగా అందులో తెలంగాణకు సంబంధించి సుమారు 1.67 టిఎంసిల వాటా ఉందని, ఇప్పటికే తమ వాటాగా 0.471 టిఎంసిలను ఇచ్చామని, మిగిలిన నీటిని కూడా సరఫరా చేసి, తమ వాటాలో మినహాయించుకుంటామని తెలంగాణ అధికారులు స్పష్టం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం మాత్రం అసలు బచావత్ ట్రిబ్యునల్‌లో చెన్నై తాగునీటికి సంబంధించిన పేరా లోపభూయిష్టంగా ఉందని ఆ రాష్ట్ర చీఫ్ ఇంజినీర్ ముండే వ్యాఖ్యానించారు. మిగులుజలాలు ఉన్నపుడే ఐదు టిఎంసిలు ఇవ్వాలని బచావత్ ట్రిబ్యునల్ పేర్కొనిందని, నీటి కొరత సమయంలో సరఫరా చేయాలన్న నిబంధన లేదని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాము ఏమాత్రం నీటిని ఇవ్వలేమని మహారాష్ట్ర చేతులెత్తేసింది.

ఓటు హక్కుపై కోటి లేఖలు

(మొదటిపేజీ తరువాయి)



తొలగింపులు వంటి వాటి వివరాలను తెలియపర్చనున్నట్లు పేర్కొన్నారు. ఇందు కోసం రూ.50 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. లేఖ అందిన తరువాత ఎదుటి వారు తమ సమస్యను తన కార్యాలయ అడ్రస్ (సిఇఒ)కు పంపేందుకు కూడా అవకాశం కల్పిస్తున్నారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు ఓటర్ల మొబైల్స్‌కు బల్క్ ఎస్‌ఎంఎస్‌లు పంపేందుకు కూడా ఏజెన్సీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వివరించారు. సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రజత్ కుమార్ మాట్లాడుతూ, తాము డిలీట్ చేసిన ఓటర్లలో 95 శాతం సరియైనవేనన్నారు. మేడ్చల్ జిల్లాల్లో 7.40 లక్షల ఓటర్లను తొలగిస్తే, అందులో 6.80 లక్షలు సరైన తొలగింపులేనని స్పష్టమైందన్నారు. మిగతా 60 వేల ఓటర్ల తొలగింపుపై కూడా వివరాలు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. పైలట్ రివ్యూలో భాగంగా మేడ్చల్ జిల్లాలో చేశామని, మిగతా అన్ని జిల్లాల్లోనూ ఇలాగే చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 2015, 2016లలో జాతీయ స్థాయిలో జరిగిన ఓటరు సవరణ కార్యక్రమంలో రాష్ట్రంలో దాదాపు 35 లక్షల మంది ఓటర్లను తొలగించినట్లు వివరించారు. ఈ విషయం ఆ ఓటర్లకు తెలియక ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు వెళ్లి జాబితాలో పేరు లేదని వెనక్కి వచ్చారన్నారు. ఒక్కసారి ఫైనల్ జాబితా ప్రకటించిన తరువాత ఓటరును తొలగించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. డబుల్ ఎంట్రీ ఓటర్లను అందుకే తొలగించలేకపోయామని వివరించారు. తొలగింపు ఓటర్లలో కొన్ని పొరపాట్లు కూడా ఉన్నాయని, వాటిని సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జిహెచ్‌ఎంసి పరిధిలో ముగ్గురు రిటర్నింగ్ అధికారులకు తాఖీదులు పంపినట్లు చెప్పారు. అర్హత ఉండి కొందరు మళ్లీ నమోదు చేసుకోవడంలో నిర్లక్ష్యం చూపారన్నారు. అలాగే తాము తగిన సౌకర్యాలను కూడా గతంలో కల్పించలేకపోయామని సిఇఒ రజత్ కుమార్ ఒప్పుకున్నారు. అందులో భాగంగానే ఈసారి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం గత ఏడాది డిసెంబర్ 26వ తేదీన ప్రారంభమైందని అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు నమోదుకు వచ్చిన దరఖాస్తుల సంఖ్య 8.64 లక్షలుగా ఉందన్నారు. తొలగింపులకు 57,348 దరఖాస్తులు వచ్చాయన్నారు. మిగతా వాటితో కలిపి మొత్తం 9,54,827 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. జనవరి 25వ తేదీ వరకు విజ్ఞప్తులు, ఫిర్యాదులు స్వీకరిస్తామని, తుది జాబితాను ఫిబ్రవరి 22వ తేదీన ప్రకటిస్తామన్నారు. ఇదిలా ఉండగా ఎంఎల్‌సి ఎన్నికలపై దృష్టి సారించినట్లు రజత్ కుమార్ వివరించారు. ఈ నెల 21వ తేదీ వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉందన్నారు. ఫిబ్రవరి 20వ తేదీన తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. మెదక్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎన్నికలకు 1.42 లక్షల మంది ఓటర్లుగా ఉన్నారన్నారు. టీచర్ ఎంఎల్‌సికి 33.08 లక్షల మంది ఓటర్లుగా ఉన్నారన్నారు. మరింత సమయం ఉన్నందున ఈ ఓటర్ల నమోదుపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.



రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం.

10 లక్షల సాయం

(మొదటిపేజీ తరువాయి)

చెక్కులు ఇచ్చారని ఈ సందర్భంగా సాయికృష్ణ తల్లిదండ్రులు పూస ఎల్లయ్య, శైలజ దంపతులు తెలిపారు. ఇంకా సహాయం అవసరమైతే కేంద్ర నుంచి కూడా సాయం కోరుతూ వివరాలు పంపినట్లు వారు తెలిపారు.

ముఖ్యమంత్రి కెసిఆర్ మేలు మరువలేం

టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కృషితో ముఖ్యమంత్రి కెసిఆర్ మేలు మరువలేమని సాయికృష్ణ తల్లిదండ్రులు ఎల్లయ్య, శైలజ దంపతులు మన తెలంగాణకు తెలిపారు. హైదారాబాద్‌లో చెక్కు అందుకున్న అనంతరం మనతెలంగాణతో ఫోన్‌లో మాట్లాడుతూ సాయికృష్ణకు పెద్దదిక్కుగా ఆదుకున్న కెసిఆర్, కెటిఆర్‌ల సాయంతో తన కొడుకును చూసినంత ఆనందంగా ఉందన్నారు. తక్షణమే అమెరికా వెళ్ళేందుకు తాము అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే కేంద్ర సాయం కూడా కోరామని, ప్రభుత్వ సూచన మేరకు అన్ని వివరాలు కేంద్రానికి పంపించడం జరిగిందని వారు తెలిపారు.

జిఎస్‌టి ఎగవేత

(మొదటిపేజీ తరువాయి)

ఉల్లంఘించడం తీవ్రమైన నేరంగా పరిగణించాల్సి ఉంటుందని, ఇటువంటి నేరాలకు పాల్పడితే 5 ఏళ్లపాటు జైలు శిక్షను ఎదుర్కొవాల్సి వస్తుందని అధికారులు వివరిస్తున్నారు. జిఎస్‌టి చెల్లింపు, విచారణకు సదరు రిసార్ట్ యజమాని సహకరించని కారణంగా అతన్ని అరెస్ట్ చేశామని, ఈక్రమంలో ఈనెల 18 వరకు రిసార్ట్ నిర్వహకుడిని రిమాండ్ తరలించడం జరిగిందన్నారు.

గూగుల్ పే పట్టిచ్చిన గొలుసు దొంగలు

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడా, పిఎస్ సెక్టార్49, గౌతంబుద్ధా నగర్, సెక్టార్–115, సోర్‌కాకు చెందిన మను వాల్మికి అలియాస్ రాహుల్ అలియాస్ గుడువా అలియాస్ మోను పందుల పెంపకం చేస్తున్నాడు. ఉత్తరప్రదేశ్, బులంద్‌శేహర్, పిఎస్ గజ్‌రోలా, మనికి మదయాకు చెందిన ఆటో డ్రైవర్ చోకా, నగరంలోని వనస్థలిపురం, సాహెబ్ నగర్‌కు చెందిన చింతమల్ల ప్రణీత్ చౌదరి నగరంలోని కొత్తపేట, మోహన్ నగర్‌లో ఉంటున్నాడు. ప్రణీత్ చౌదరి గతంలో దొంగతనాలు చేశాడు. ఇంజనీరింగ్ మధ్యలో ఆపివేసి ఇంగ్లండులో బిబిఎం చేశాడు. అక్కడ ఇమ్మిగ్రేషన్ నిబంధనలు ఉల్లంఘించడంతో ఢిల్లీకి వచ్చి స్థిరపడ్డాడు. అక్కడ ఉన్న ఐదు నెలల్లో క్రిమినల్ గ్యాంగ్‌లతో పరిచయాలు ఏర్పడ్డాయి. హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత సరూర్‌నగర్, ఉప్పల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 2014–15లో మూడు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. జైలు నుంచి విడుదలైన తర్వాత నోయిడాకు షిఫ్ట్ అయి అక్కడ దొంగతనాలు చేయడంతో జైలుకు పంపించారు. జైలు నుంచి విడుదలైన తర్వాత హైదరాబాద్‌లో దొంగతనాలకు పాల్పడాలని పథకం రచించారు. మోను వాల్మికి అంతరాష్ట్ర దొంగ పలు రాష్ట్రల్లో దొంగతనాలు, దోపిడీలకు పాల్పడడంతో 40 కేసులు నమోదయ్యాయి. చోకా కూడా అంతరాష్ట్ర దొంగ, వివిధ రాష్ట్రల్లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడడంతో 40 కేసులు నమోదయ్యాయి. ప్రణీత్ చౌదరికి వనస్థలిపురం ప్రాంతంపై పూర్తిగా పట్టు ఉండడంతో ప్రణాళిక రచించి సులభంగా దొంగతనాలు చేశారు. ఐదు రోజుల ముందు నగరానికి వచ్చిన దొంగలు వివిధ లాడ్జిల్లో ఉన్నారు. మలక్‌పేటలో సోఫియాన్ వద్ద కెటిఎం బైక్‌ను అద్దెకు తీసుకున్నారు. ముగ్గురు వనస్థలిపురం, హయత్‌నగర్, మీర్‌పేట, ఎల్‌బి నగర్ దాని పరిసర ప్రాంతాల్లో తిరిగి పరిసరాలను పరిశీలించారు. గత ఏడాది డిసెంబర్ 26, 27వ తేదీల్లో చోకా, మోను వాల్మి కలిసి 11 చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. 15గంటల వ్యవధిలోనే 11 చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డారు, 26వ తేదీన నాలుగు గంటల్లో ఆరు, 27వ తేదీన గంట వ్యవధిలో ఐదు చైన్‌స్నాచింగ్‌లు చేశారు. సులభంగా తప్పించుకుపోయేందుకు వీలుగా మేయిన్ రోడ్డుకు సమీపంలోనే చైన్‌స్నాచింగ్‌లు చేశారు. ప్రణీత్ చైన్‌స్నాచింగ్‌లో పాల్గొనకుండా వారికి నేతృత్వం వహించాడు. సిసిటివిల్లో కన్పిస్తే పోలీసులకు దొరుకుతామని, చోకా, మోను వాల్మికి సమన్వయం చేశాడు. చైన్ స్నాచింగ్‌లు చేసిన తర్వాత ప్రణీత్ కాచీగూడలోని ఓ లాడ్జిలో వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు తీసుకున్నాడు. మీడియాలో బైక్‌కు సంబంధించిన ఫోటోలు రావడంతో తలాబ్‌కట్ట వద్ద బైక్‌ను వదిలేశామని నిందితులు తెలిపారు.

గూగుల్ పే పట్టించింది

ప్రణీత్, మోను వాల్మీకి, చోకా నగరంలోని లాడ్జిలో ఐదు రోజులు బసచేశారు. ఓ లాడ్జిలో ప్రణీత్ గూగుల్ పే ద్వారా బిల్లు చెల్లించడంతో పోలీసులకు పట్టుబడ్డారు. మోను, చోకా అనుమోల్ హోటల్, ఎడిబజార్ నుంచి పల్సర్ బైక్‌పై వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

120 టీములు

చైన్‌స్నాచింగ్ నిందితులను పట్టుకునేందుకు నగర పోలీసులు 120టీములను ఏర్పాటు చేసింది. సౌత్ జోన్, ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ టీములు, భవానీ నగర్ పోలీసులు, ఎస్‌ఓటి రాచకొండ పోలీసులు ఉమ్మడిగా విచారణ చేసి పట్టుకున్నారు. 600 సిసిటివి ఫుటేజ్‌లను పరిశీలించారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, ఎయిర్‌పోర్టులు, లాడ్జిల్లో తనిఖీలు చేశారు. ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీల్లో తనిఖీ చేశారు. నోయిడా, న్యూఢిల్లీ పోలీసులను కూడా సంప్రదించారు. నిందితుల ప్రాంతాలైన నోయిడా, ఉత్తరప్రదేశ్‌ను సందర్శించారు.

మరిన్ని సిసిటివిలు ఏర్పాటు చేస్తాం

నగరంలో మరిన్ని సిసిటివిలు ఏర్పాటు చేస్తామని నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ తెలిపారు. సిబ్బందికి శిక్షణ ఇచ్చి వారి సామర్థ్యాన్ని పెంచుతామని అన్నారు. సైంటిఫిక్ విధానంలో సాక్ష్యాలను సేకరించి శిక్షపడేవిధంగా చూస్తామని అన్నారు. నిందితులపై పిడి యాక్ట్ పెట్టేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. సౌత్‌జోన్ డిసిపి అంబర్‌కిషోర్ ఝూ, టాస్క్‌ఫోర్స్ అదనపు కమిషనర్ చైతన్య కుమార్, భవానీ నగర్, టాస్క్‌ఫోర్స్ హైదరాబాద్, ఇన్స్‌స్పెక్టర్స్ మధుమోహన్ రెడ్డి, శ్రీనివాస్, ఎస్‌ఓటి రాచకొండ సిబ్బంది కేసు దర్యాప్తు చేశారు.

కొత్త చరిత్ర

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వేషన్లను కల్పించాలని ఇతరత్రా మార్పులు తీసుకురావాలని తీసుకువచ్చిన ప్రతిపాదనలన్నీ కూడా వీగిపోయ్యాయి. దీనితో లోక్‌సభలో ఆమోదం పొందిన తరహాలోనే ఆ స్థితిలోనే ఎగువసభలోనూ ఈ బిల్లు ఆమోదం పొందింది. బిల్లు ఆమోదం తరువాత రాజ్యసభను నిరవధికంగా వాయిదా వేశారు. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలనే తీర్మానం వీగిపోయింది. మంగళవారం లోక్‌సభలో ఇప్పుడు బుధవారం రాజ్యసభలో ఈ బిల్లుకు ఆమోదం దక్కడంతో ఈ కీలక జనరల్ కేటగిరి బిల్లుకు పార్లమెంట్ పూర్తి స్థాయి ఆమోద ముద్ర దక్కింది. ప్రతిపక్షాలు అన్నీ దాదాపుగా చర్చల ప్రక్రియ దశలో బిల్లులోని కీలక అంశాలను వాటిలోని ప్రాతిపదికలను నిలదీశాయి. అసలు ప్రభుత్వానికి సమాజంలోని ఏ వర్గానికి సరైన న్యాయం చేయాలనే ఆలోచన లేనప్పుడు ఇప్పుడు తీసుకువస్తున్నది కేవలం ఓట్ల కోసం ఆడుతున్న ఆటగానే వెల్లడవుతుందని పేర్కొన్నాయి. అయితే డివిజన్ జరిగి ఓటింగ్ నిర్వహణ సమయంలో బిల్లుకు అత్యధిక స్థాయిలో మద్దతు దక్కింది. సెలెక్ట్ కమిటీకి పంపించాలనే డిఎంకె ప్రతిపాదనకు చర్చల దశలో కాంగ్రెస్ ఇతర పార్టీల సభ్యులు మద్దతు పలికినా తరువాతి దశలో దీనిపై జరిగిన ఓటింగ్‌లో అత్యల్పంగా మద్దతు దక్కింది. సభలో పాల్గొన్న మొత్తం 172 మంది సభ్యులలో 165 మంది సభ్యులు మద్దతు తెలిపారని దీనితో బిల్లు ఆమోదం పొందినట్లుగా ప్రకటిస్తున్నామని డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ తెలిపారు. రాజ్యసభ కూడా ఆమోదించిన ఈ బిల్లుతో కోటాకు చట్టబద్ధత ఏర్పడుతుందని , రాజ్యాంగపరమైన చట్టబద్ధకు సరైన విధంగా 15, 16 క్లాజులను చేర్చినట్లు న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ చెప్పారు.



అంతకుముందు అగ్రవర్ణాల పేదలకు కోటాబిల్లుపై రాజ్యసభలో బుధవారం వాడివేడి చర్చ రగులుకుంది. ప్రభుత్వం బిల్లును ప్రవేశపెడుతున్న దశలోనే ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. బిల్లును మంత్రి సభలో ప్ర కోటా కోసం రాజ్యాంగ సవరణ బిల్లును సెటెక్ట్ కమిటీకి పంపించాల్సిందేనని కాంగ్రెస్ ఇతర ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. ఎన్నికలకు ముందు అదును చూసుకుని ప్రభుత్వం ఈ రిజర్వేషన్ల కోటాకు రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకువచ్చినట్టుందని ప్రతిపక్షాలు విమర్శించాయి. ప్రతిపక్షాలు ఈ కోటా కల్పనకు మద్దతు ఇస్తాయని, అయితే బిల్లును తీసుకువచ్చిన తీరు, అంశాలవారి చర్చకు వీల్లేని పరిస్థితిపై తాము నిరసన వ్యక్తం చేస్తున్నట్లు ప్రతిపక్ష ఎంపీలు స్పష్టం చేశారు. అగ్రవర్ణాలలోని ఆర్థికంగా బలహీనంగా ఉన్న వారికి ప్రభుత్వోద్యోగాలు, విద్యాసంస్థలలో రిజర్వేషన్ల కల్పనకు ప్రభుత్వం బిల్లు తీసుకువచ్చింది. దీనికి అధికార పక్షం బలం ఉన్న లోక్‌సభ ఒక్కరోజు క్రితం ఆమోదం తెలిపి సభను ప్రస్తుతానికి ముగించింది. అయితే ఎగువ సభ రాజ్యసభలో ప్రభుత్వానికి చాలినంత బలం లేకపోవడంతో దీనిని నెగ్గించుకోవడం కీలక అంశంగా మారింది. రాజ్యసభ ఒక్కరోజు పొడిగింపు ప్రకటన తరువాత బుధవారం సమావేశం అయింది. సభలో సామాజిక సంక్షేమ సాధికారత మంత్రి థావర్‌చంద్ గెహ్లోట్ కోటా కల్పనకు సంబంధించిన ఈ బిల్లును రాజ్యాంగ (100వ మరియు 124వ సవరణ) బిల్లు 2019గా ప్రవేశపెట్టారు. కోటాపై ప్రభుత్వం రాజకీయ సయ్యాటకు దిగుతోందని ప్రతిపక్షాలు బిగ్గరగా కేకలు పెడుతూ నిరసనలకు దిగుతున్న దశలోనే మంత్రి ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ప్రతిపక్షాలు ఈ బిల్లుపై అనవసరంగా రాద్ధాంతానికి దిగుతున్నాయని మంత్రి ఎదురుదాడికి దిగారు. ప్రభుత్వం చాలా సదుద్దేశంతోనే దీనిని తీసుకువస్తున్నదని, దేశంలోని పేదల అభ్యున్నతికి దీనిని తలపెట్టినట్లుగా గ్రహించి సహకరించాలని సూచించారు. జనరల్ కేటగిరిలోని పేదలకు న్యాయం జరగాల్సి ఉందని , ఇది చిరకాల వాంఛగా ఉందని తెలిపారు. అయితే ఇది కేవలం ఎన్నికట ముందు ప్రభుత్వం చేస్తున్న జిమ్మిక్కు అని, పూర్తిగా ఓట్ల కోసం ఎత్తుగడ అని ప్రతిపక్షాలు విమర్శించాయి. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ లోగానే కాంగ్రెస్, డిఎంకె, ఆర్జేడీ, ఆప్ పార్టీల సభ్యులు వెల్‌లోకి దూసుకువెళ్లారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలకు దిగారు. సభలో సజావైన పరిస్థితి లేకపోవడంతో అప్పుడు సభానిర్వహణ బాధ్యతలలో ఉన్న డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ సభను మధ్యాహ్నం రెండు గంటల వరకూ వాయిదా వేశారు. తరువాత చర్చ మొదలైంది.

బిల్లును స్క్రూటినీ చేయాల్సిందే : కనిమొళి



ఉన్నట్లుండి సభలో ఆమోదానికి ఇంత కీలకమైన బిల్లును ప్రవేశపెట్టడం ఎంతవరకు సబబు అని డిఎంకె సభ్యులు కనిమొళి ప్రశ్నించారు. అన్నిఅనుమానాలు తీర్చుకోవడానికి అంతా సజావుగా సాగేందుకు దీనిని సెలెక్ట్ కమిటీ పరిశీలనలకు పంపించాలని డిమాండ్ చేశారు. దీనికి మరింత పరిశీలన అవసరం అన్నారు. సెలెక్ట్ కమిటీకి పంపాలనే తమ తీర్మానంపై ఓటింగ్ జరగాలని కోరారు. ఆమె డిమాండ్‌ను సిపిఐ సభ్యులు రాజాతో పాటు కాంగ్రెస్ సభ్యులు సమర్థించారు. తొలుత సెలెక్ట్ కమిటీకి దీనిని పంపించే అంశాన్ని తీసుకోవాలని డిప్యూటీ ఛైర్మన్‌ను కోరారు. తీర్మానంపై ఓటింగ్‌కు పట్టుపట్టారు.అయితే సభ డిప్యూటీ ఛైర్మన్ దీనిపై స్పందిస్తూ తొలుత చర్చ జరగాల్సిందేనని, తరువాత సెలెక్ట్ కమిటీకి పంపించడంపై ఓటింగ్ అంశాన్ని పరిశీలించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

అసంపూర్తి బిల్లు : మిస్త్రీ



బిల్లు అసమగ్రంగా, అసంపూర్తిగా ఉందని కాంగ్రెస్ సభ్యులు మదుసూధన్ మిస్త్రీ విమర్శించారు. బిల్లు లక్ష్యాలు ఏమిటనేవి ఇందులో పొందుపర్చలేదన్నారు. అయినా ఇంత తొందరపాటుగా బిల్లు తీసుకురావల్సిన అవసరం ఏమిటని ప్రభుత్వాన్ని నిలదీశారు. అయితే బిల్లును సభలో హడావిడిగా తీసుకురావడం లేదని, సభాధ్యక్షులు ఎం వెంకయ్యానాయుడు బిల్లును ప్రవేశపెట్టడానికి రెండు రోజుల మినహాయింపు ఇచ్చారని ఇప్పుడు అందుకు అనుగుణంగానే దీనిని తీసుకువచ్చారని డిప్యూటీ ఛైర్మన్ వివరణ ఇచ్చారు. అంతకు ముందు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్ గోయల్ ప్రతిపక్షాల వైఖరిని తీవ్రంగా తప్పుపట్టారు. పేదల సంక్షేమానికి తీసుకురాదల్చిన చట్టానికి అడ్డుపడుతూ ప్రతిపక్షాలు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ సీనియర్ సభ్యులు ఆనంద్ శర్మ లేచి బిల్లుకు తమ పార్టీ అనుకూలం అని, అయితే ఇటువంటి కీలక అంశాలను సభలో ప్రవేశపెట్టే తీరు ఇదేనా? అని ప్రశ్నించారు.

ఆంధ్రలో రైతుబంధు అమలు చేస్తా

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షుడు, ఎపి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. పాదయాత్ర ముగిసిన నేపథ్యంలో ఇచ్ఛాపురంలోని బహుదా నదీ తీరంలో ఏర్పాటైన విజయ సంకల్ప స్థూపం(పైలాన్)ను బుధవారం జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈక్రమంలో పైలాన్ ఆవిష్కరణకు ముందు జగన్ సర్వమత పెద్దల ఆశీస్సులు తీసుకున్నారు. స్థూపాన్ని ఆవిష్కరించిన అనంతరం జగన్ కాలినడకన ఇచ్ఛాపురం పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జగన్ తెలంగాణ రాష్ట్టంలో అద్భుత ఫలితాలను సాధించిన పథకాలపై ప్రసంగించారు. పాలనా సౌలభ్యం కోసం తెలంగాణ రాష్ట్రంలో 10 జిల్లాలలో 31 జిల్లాలు చేశారని, అదే మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లోనూ 13 జిల్లాలోని 25 ఎంపి స్థానాలను జిల్లాలుగా చేస్తామని ప్రకటించారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో రైతులకు అందిస్తున్న విధంగా రైతు భీమా మాదిరిగానే రైతులకు ప్రీమియం తాము ప్రభుత్వంలోకి వస్తే చెల్లిస్తామన్నారు. భీమా మొత్తాలను రైతుల కుటుంబాలకు చేర్చే బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్టంలో రైతుబంధు పథకాన్ని ఆదర్శంగా తీసుకుని ఎపిలోనూ మే నెలలో ప్రతి రైతుకు రూ.12,500 ఇస్తామని, అలాగే రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే టిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి మండలంలో గోదాములతోపాటు మరి కొన్ని నియోజక వర్గాలలో కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేసిన విధంగానే మన రాష్ట్రంలో కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదేవిధంగా టిఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల మాదిరిగానే ఇక్కడ కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు పగటిపూట 9 గంటలపాటు ఉచితంగా విద్యుత్ అందిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్టలో అనుసరిస్తున్న విధంగా ఆంధ్రప్రదేవ్ రాష్ట్రంలో ప్రతి రైతుకు వడ్డీలు లేని రుణాలు ఇచ్చి ఆదుకుంటామని, రైతుల సాగు వ్యయాలను తగ్గించి, పెట్టుబడి సాయంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఆలాగే గ్రామ పంచాయతీలను బలోపేతం చేసేందుకు మరిన్ని పథకాలను ప్రవేశ పెడతామన్నారు. వేలాది కిలోమీటర్ల పాదయాత్రలో నడిచింది నేనేనని అయితే తనను నడిపించింది మాత్రం జనమేనని వివరించారు. 2017 నవంబర్ 6వ తేదీన మొదలైన పాదయాత్ర 2019 జనవరి 9న పూర్తయ్యిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 13 జిల్లాలోని 134 నియోజక వర్గాలలో 124 బహిరంగ నిర్వహించిన సభలలో ప్రజల సమస్యలు అవగతమయ్యాయన్నారు. ప్రజల మధ్యనే ఉంటూ 341 రోజులు (04 నెలలుగా) ,3,648 కిలోమీటర్లు సాగిన చారిత్రాత్మక యాత్రలో దగా పడ్డ రైతన్నలు, మోసపోయిన డ్వాక్రా అక్కచెల్లెమ్మలు, ఉద్యోగం రాక నిశారలో ఉన్న తమ్ముళ్లను, భ్రష్టుపట్టిన రాజకీయ వ్యవస్థను కళ్ళారా చూశానన్నారు. రాష్ట్రంలో నాలుగున్నరేళ్లు చంద్రబాబు పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని తేల్చిచెప్పారు. గత ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా చేసుకుని ప్రజలకు ఇచ్చిన 600 హామీలలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని జగన్ మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతి ఒక్క రంగాన్ని నిర్వీర్యంతోపాటు నాశనం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సమస్యలు తిష్టవేసుకుని ఉన్నసమయంలోనూ చంద్రబాబు జాతీయ రాజకీయాల పేరితో తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తిరిగాయడని ఎద్దేవా చేశారు. రైతుల ఆదాయ విషయంలో రాష్ట్రం దేశంలో 28వ స్థానంలో, రైతుల అప్పులలో మాత్రం 2వ స్థానంలో ఉంటే చంద్రబాబు మాత్రం గ్రోత్ రేట్ పెరిగిందని అబద్దాలు వల్లిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్టంలో ప్రతి ఒక్కరైతు నేడు చంద్రబాబును నమ్మమని తేల్చిచెబుతున్నారన్నారు. పొదుపు సంఘా వ్యవస్థను నిర్వీర్యం చేసిన ఘనత బాబుకే దక్కిందన్నారు. బాబు వచ్చాడు జాబు వస్తుందని నమ్మబలికి ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టాడన్నారు. రాష్ట్ర విభజన సమయంలో 1.42 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే ఇప్పుడు 2.40లక్షలకు పెరిగినా ఒక్క ఉద్యోగం కూడా బర్తీ చేయలేదని, ప్రతి ఇంటికి రూ.2వేలు నిరుద్యోగ భృతి ఇస్తానని 2014 ఎన్నికల హామీ ఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేదని వివరించారు. నాలుగేళ్ల పాటు ప్రత్యేక హోదాను పక్కన పెట్టి బిజెపితో కాపురం చేశాడని ఆపై తన ఎంపిలను కేంద్రంలో మంత్రులను చేసుకుని పబ్బం గడుపుకున్నాడన్నారు. రాష్ట్ర వ్యాప్తంగాఉన్న పేద ప్రజలకు ప్రతి పథకం అందాలని, ఆ దిశగా పాలన ఉండాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుభీమా మాదిరిగానే రైతన్నలకు జరగకూడని నష్టం జరిగితే వైఎస్‌ఆర్ భీమా కింద రూ. 5 లక్షలు వెంటనే ఆ కుంటుంబానికి అందజేస్తామని, అలాగే పక్క రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదిక్న పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆంధప్రదేశ్ రాష్ట్రంలో అస్తవ్యస్థంగా మారిన రాజకీయాలను బాగు చేసేందుకు బయలుదేరిన నాకు తోడుగా ఉండి ఆశీర్వదించాలని కోరుతున్నానని జగన్ తన ప్రసంగాన్ని ముగించారు. భారీ ఎత్తున తరలివచ్చిన వైఎస్సార్ సిపి పీనియర్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున ప్రజలు పైలాన్ ఆవిష్కరణ, బహిరంగం సభలో పాల్గొన్నారు.



ఎయిర్‌పోర్టులో విదేశీ కరెన్సీ పట్టివేత

మన తెలంగాణ/శంషాబాద్ : అక్రమంగా విదేశాలకు వివిధ దేశాల కరెన్సీని తరలిస్తుండగా బుధవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్న సంఘటన చోటుచేసుకుంది. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రెగ్యులర్ చెకప్‌లో భాగంగా తనిఖీ చేస్తుండగా సిఐఎస్‌ఎఫ్ ఎస్‌ఐ వరుణ్‌కుమార్ ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేస్తున్నారు. డిపార్చర్‌లో ఇండియాకు చెందిన మహ్మద్ పర్వేజ్ అనే ప్రయాణికునికుడు హైదరాబాద్ నుంచి దుబాయ్ వెళ్ళాడానికి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చినట్లు తెలిపారు. అతని బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో 16500ల యుఎస్‌డి కరెన్సీ, 52450 కాతర్ కరెన్సీ, యుఎఇకి చెందిన 37950 కరెన్సీ, కువైట్‌కు చెందిన 2165 కరెన్సీ, ఓమన్ దేశానికి చెందిన 4625 రూపాయల కరెన్సీ పట్టుబడిందన్నారు. వీటి విలువ ఒక కోటి 2లక్షల రూపాయలుగా ఉంటుందన్నారు. దీంతో అతని అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి తదుపరి విచారణ కోసం తరలించినట్లు తెలిపారు.

ఓటర్ల జాబితా సవరణను పొడిగించాలి




మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియను రీషెడ్యూల్ చేసి క్లైయిమ్స్, అబ్జెక్షన్స్‌కు ఇచ్చిన సమయాన్ని వచ్చే నెల 10వ తేదీ వరకు పొడిగించాలని తెలంగాణ పిసిసి ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ జి. నిరంజన్ విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు బుధవారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఒక లేఖ పంపారు. ప్రస్తుతం రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నందున గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్ల జాబితాలో సవరణల ప్రక్రియను చేపట్టాల్సిన ప్రభుత్వ యంత్రాంగం ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఇచ్చిన గడువు షెడ్యూల్ ప్రకారం ఈనెల 25వ తేదీ వరకు క్లైయిమ్స్, అబ్జెక్షన్స్‌కే అవకాశముందన్నారు. పంచాయతీ ఎన్నికలు ఈనెల 30న ముగిసే వరకు బూత్‌లెవల్ ఆఫీసర్లు, ఇఆర్‌వోలు, జిల్లా ఎన్నికల అధికారులు ఎవరూ కూడా ఓటర్ల జాబితాల సవరణ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లేదని ఆ లేఖలో నిరంజన్ ప్రస్తావించారు. అందువల్ల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఫిబ్రవరి 10వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలకు బూత్‌లెవల్ ఏజెంట్లను నియమించుకునేందుకు వచ్చే నెల ఒకటవ తేదీ వరకు గడువు ఇవ్వాలని కోరారు.

ఓటుకు పట్టభద్రులు శ్రద్ధ తీసుకోవాలి

మనతెలంగాణ/హైదరాబాద్ : పట్టభద్రుల ఓటర్ల నమోదుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని టిఆర్‌ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి రజత్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. బుధవారం సచివాలయంలో గెల్లు శ్రనివాస్ యాదవ్ తన ప్రతినిధి బృందంతో రజిత్ కుమార్‌కు ఈమేరకు విజ్ఞప్తి చేశారు. ఓటర్ల నమోదు కార్యక్రమం మాదిరిగానే పట్టభద్రులను నమోదు చేసుకునేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు, ఇప్పటి వరకు 15 శాతం పట్టభద్రులు మాత్రమే ఓటరు జాబితాల్లో నమోదు చేయించుకున్నారని విచారం వ్యక్తం చేశారు. 100 శాతం నమోదుకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు.జిల్లా, మండల స్థాయి ధికారులు పట్టభద్రులను ఓటరు జాబితాల్లో నమోదు చేయించుకునే విధంగా ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యావంతులైన పట్టభద్రులను ఓటర్ల జాబితాల్లో నమోదు చేసి ఓటు హక్కు వనియోగించుకునే విధంగా ఎన్నికల కమిషన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గెల్లు శ్రీనివాస్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

సర్పంచ్ అభ్యర్థి అదృశ్యం



మన తెలంగాణ/కొడంగల్ : అర్ధరాత్రి సర్పంచ్ అభ్యర్థి అదృశ్యమైన సంఘటన తీవ్ర కలకలం రేపుతోంది. వికారాబాద్ జిల్లా, నియోజకవర్గ పరిధిలోని దౌల్తాబాద్ మండలం, నీటూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ విశ్వనాథం మంగళవారం అర్ధరాత్రి నుంచి కనబడడం లేదని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశా రు. రంగంలోకి దిగిన పోలీసులు తమదైన శైలిలో దర్యాప్తు చేస్తున్నారు. అర్ధరాత్రి 11 గంటలకు ఇంటికొచ్చిన విశ్వనాథం దాదాపు ఒంటి గంట సమయంలో పశువులకు మేత వేసేందుకు పశువుల పాకా వద్దకు వెళ్తానని చెప్పి వెళ్ళినట్లు భార్య నిర్మల తెలిపారు. తిరిగి రాకపోవడంతో బయటకు వెళ్ళి వెతికినా ఎంతకు ఆచూకి లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విశ్వనాథం అదృశ్యమైన సమాచారం తెలిసి మాజీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి గ్రామానికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంటనే ఆయన డిఎస్‌పితో మాట్లాడారు. డిఎస్పీ రవీంద్రారెడ్డి గ్రామానికి వచ్చి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తి అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. సర్పంచ్ అభ్యర్థి విశ్వనాథం అదృశ్యమైనట్లు సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిఎస్‌పిని ఆదేశించారు.

విద్యుత్ సంస్కరణల్లో ఈఆర్‌సి చైర్మన్ కీలక భూమిక

పదవీ విరమణ సందర్భంగా జెన్‌కో సిఎండి కితాబు



మన తెలంగాణ / న్యూఢిల్లీ, హైదరాబాద్ : రాష్ట్ర విద్యుత్ రంగంలో కొత్త సంస్కరణల్లో విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ ఇస్మాయిల్ ఖాన్ పాత్ర అమోఘమని రాష్ట్ర జెన్‌కో సిఎండి ప్రభాకరరావు కితాబునిచ్చారు. ఇస్మాయిల్ ఖాన్ పదవీ విరమణ సందర్భంగా ఆయనను ప్రభాకర్‌రావు సత్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ, నాలుగేళ్ళ తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు, సంస్కరణలు తీసుకురావడంలో ఇస్మాయిల్‌ఖాన్ పాత్ర అద్వితీయమని, నిర్ణీత వ్యవధిలో టారిఫ్ ఉత్తర్వులు ఇచ్చారని, పలు సవరణలకు ఆమోదం తెలిపారని గుర్తు చేశారు. సింగరేణి భవన్‌లో బుధవారం జరిగిన వీడ్కోలు సభలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, దక్షిణ డిస్కం సిఎండి రఘుమారెడ్డి తదితరులు ఇస్మాయిల్ ఖాన్ కృషిని ప్రశంసించారు.

డిగ్రీ కోర్సులకు అదనపు సెక్షన్లు

గత ఏడాది అత్యధికంగా సైన్స్ గ్రూపుల్లోనే ప్రవేశాలు

మనతెలంగాణ/హైదరాబాద్ : సంప్రదాయ డిగ్రీలో డిమాండ్ ఉన్న సైన్స్, కామర్స్ కోర్సులకు అదనపు సెక్షన్లు కేటాయించనున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో డిగ్రీ సీట్లకు, ప్రవేశాలకు భారీగా వ్యత్యాసం ఉంటుంది. మొత్తం 1,092 ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలల్లో 4,10,267 సీట్లు అందుబాటులో ఉండగా అందులో డిమాండ్ ఉన్న సైన్స్, కామర్స్ కోర్సులు మినహా మిగతా కోర్సుల్లో ఏటా భారీగా సీట్లు మిగులుతున్నాయి. బిఎస్‌సి, బి.కాం(కంప్యూటర్స్) కోర్సులకు కోర్సులకు విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి డిమాండ్ ఉన్నా సీట్లు పరిమితంగానే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో డిమాండ్ ఉన్న కోర్సులకు అదనపు సెక్షన్లు కేటాయించే అంశాన్ని ఉన్నత విద్యామండలి పరిశీలిస్తోంది. బి.ఎ, బి.కాం జనరల్ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నా ఆ సీట్లు 30 శాతం కూడా భర్తీ కావడం లేదు. ఆ సీట్లను ఇతర కోర్సుల సీట్లుగా మార్చుకునే అవకాశం లేకపోవడంతో ఏటా ఖాళీగా మిగిలిపోతున్నాయి. డిమాండ్ ఉన్న కోర్సుల్లో సీట్లు లభించని విద్యార్థులు ఏడాది వృథా అయినా అదే కోర్సు చదివేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు. ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్న సైన్స్, కామర్స్ కోర్సుల పట్లనే విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్న నేపథ్యంలో ఆ కోర్సులకు అదనపు సెక్షన్లు కేటాయించే అంశాన్ని ఉన్నత విద్యామండలి పరిశీలిస్తోంది.

అత్యధికంగా సైన్స్ గ్రూపుల్లోనే ప్రవేశాలు

సంప్రదాయ డిగ్రీ కోర్సులలో బ్యాచ్‌లర్ ఆఫ్ సైన్స్(బిఎస్‌సి)కే అధిక డిమాండ్ ఉంటోంది. గత ఏడాది డిగ్రీ ప్రవేశాలలో బిఎస్‌సిలోనే అత్యధికంగా ప్రవేశాలు నమోదు కాగా, బి.కాం రెండవ స్థానంలో నిలిచింది. ఇంటర్‌లో ఎంపిసి, బైపిసి వంటి సైన్స్ కోర్సులు చదివిన విద్యార్థులు ఇంజనీరింగ్, ఫార్మసీ, పరిమిత సంఖ్యలో మెడిసిన్, ఇతర వృత్తి విద్యా కోర్సులలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తారు. అయితే వృత్తి విద్యా కోర్సులు కాల పరిమితి ఎక్కువగా ఉండటం, ఆ కోర్సులు పూర్తి చేసినా ఉపాధి అవకాశాలు అంతంతమాత్రమే ఉండటంతో మూడేళ్ల బిఎస్‌సిలో చేరేందుకే విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఇంజనీరింగ్‌లో నాణ్యతా ప్రమాణాలు తగ్గడం, మంచి ప్యాకేజీలు లభించకపోవడంతో విద్యార్థులు డిగ్రీ కోర్సులవైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. కోర్సు పూర్తయిన తర్వాత డిగ్రీతో ఉద్యోగం చేయడం ఇష్టం లేకపోతే ఆయా సబ్జెక్టుల్లో ఎంఎస్‌సి లేదా ఎంబిఎ, ఎంసిఎ, బి.ఇడి, ఎంఎ వంటి కోర్సుల్లో ప్రవేశాలు పొందుతున్నారు. ప్రస్తుతం డిగ్రీలో బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్, బిఎస్‌సి కెమిస్ట్రీ, బిఎస్‌సి బిజెడ్‌సి, బిఎస్‌సి స్టాటిస్టిక్స్ కోర్సుల్లో విద్యార్థులు ఎక్కువగా చేరుతున్నారు.

బిఎస్‌సిలోనే 46 శాతం ప్రవేశాలు

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ(దోస్త్) మూడు విడతలుగా నిర్వహించగా అందులో కేవలం బిఎస్‌సి కోర్సుల్లోనే 46 శాతం ప్రవేశాలు నమోదయ్యాయి. మూడు విడతల్లో మొత్తం 1,84,157 మంది విద్యార్థులకు డిగ్రీ సీట్లు కేటాయించగా, 86,550 సీట్లు బిఎస్‌సి కోర్సుల్లోనే కేటాయించారు. ఆ తర్వాత 71,325 సీట్లు బి.కాం కోర్సుల్లో కేటాయించారు. బిఎస్‌సి, బికాం కోర్సులు చదివితే ఉపాధి అవకాశాలు లభిస్తుండటంతో విద్యార్థులు వీటిలో ప్రవేశాలు పొందేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

ఇంజనీరింగ్ కంటే రెట్టింపు ప్రవేశాలు

ఇంజనీరింగ్‌పై కమంగా ఆసక్తి తగ్గుతున్నట్లు తెలుస్తోంది. ఏటా ఇంజనీరింగ్ సీట్లు మిగలడమే ఇందుకు అద్దం పడుతోంది. డిమాండ్ ఉన్న కొన్ని కోర్సులు మినహా మిగతా కళాశాలల్లో ఏటా సీట్లు మిగుతులున్నాయి. ఒకప్పుడు బిఎస్‌సి అంటే చులకన భావం ఉండేది. కానీ ఇప్పుడు డిగ్రీ చేయడానికి చాలా మంది విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇంజనీరింగ్ అయితే నాలుగేళ్లపాటు ఎంతో ఖర్చు చేసి సీరియస్‌గా చదవాల్సి ఉంటుంది. బిఎస్‌సి అయితే ఖర్చు తక్కువగా



ఉండటంతో పాటు మూడేళ్లలో కోర్సు పూర్తవుతుంది. కోర్సు చేస్తున్న సమయంలో కూడా పార్ట్‌టైం ఉద్యోగాలు చేసుకునే అవకాశం ఉంటుంది. దాంతో ఇంటర్‌లో ఎంపిసి, బైపిసి వంటి సైన్స్ గ్రూపులు చేసిన పేద,దిగువ మధ్యతరగతికి చెందిన విద్యార్థులు బిఎస్‌సిలో చేరేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు. గత విద్యాసంవత్సరం ఇంజనీరింగ్‌లో కన్వీనర్ కోటా కింద 64,946 సీట్లు అందుబాటులో ఉండగా 52,621 సీట్ల కేటాయింపు జరిగింది. గత విద్యాసంవత్సరం బిఎస్‌సి కోర్సులో ఇంజనీరింగ్ కంటే రెట్టింపు ప్రవేశాలు నమోదయ్యాయి.

4.17 లక్షల ఎకరాల్లో వరినాట్లు

● మొత్తం 13.86 లక్షల ఎకరాల్లో సాగైన పంటలు ● వ్యవసాయ శాఖ తాజా నివేదిక



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో వరినాట్లు నెమ్మదిగా పుంజుకుంటున్నాయి. వ్యవసాయ శాఖ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం 24 శాతం వరినాట్లు పడ్డాయి. రబీ సీజన్లో పంటల సాధారణ సాగు విస్తీర్ణం 33.45 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 13.86 లక్షల (42%) ఎకరాల్లో పంటలు సాగు చేశారు. అందులో ఆహార పంటల సాధారణ సాగు విస్తీర్ణం 26.12 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 9.88 లక్షల (38%) ఎకరాల్లోనే సాగయ్యాయి. ఆహారధాన్యాల్లో కీలకమైన వరి రబీ సాధారణ సాగు విస్తీర్ణం 17.62 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 4.17 లక్షల (24%) ఎకరాల్లో నాట్లు వేశారు. అలాగే మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 4.15 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.32 లక్షల (57%) ఎకరాల్లో సాగైంది. ఇక నూనె గింజల సాగులో కీలకమైన వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 3.57 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.56 లక్షల (73%) ఎకరాల్లో సాగైంది. ప్రధానంగా వరి నాట్లు పుంజుకోకపోవడంతో వ్యవసాయశాఖ అప్రమత్తమైంది. సాగునీటి వనరులు లేని చోట వరికి బదులు ప్రత్యామ్నాయ వర్షాధార పంటలు వేయాలని రైతులకు విన్నవించింది. అందుకు సంబంధించిన విత్తనాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించింది. రబీ సీజన్‌లో ఆదిలాబాద్ జిల్లాలో రైతులు రికార్డు స్థాయిలో పంటలు సాగు చేశారు. అక్కడ సాధారణ సాగు విస్తీర్ణంతో చూస్తే 27 శాతం అదనంగా సాగవడం గమనార్హం. నాగర్‌కర్నూల్‌లో 85 శాతం, కుమురం భీం ఆసిఫాబాద్‌లో 77 శాతం, వనపర్తిలో 68 శాతం, నిజామాబాద్‌లో 62 శాతం పంటలు సాగయ్యాయి. అతి తక్కువగా మంచిర్యాల జిల్లాలో 12 శాతం, జగిత్యాలలో 16 శాతం, నల్లగొండలో 19 శాతం, యదాద్రి భువనగిరిలో 19 శాతం విస్తీర్ణంలో పంటలు సాగైనట్లు నివేదికలో వెల్లడించారు.

18 జిల్లాల్లో వర్షాభావం

ఇక రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. 18 జిల్లాల్లో వర్షాభావం నెలకొని ఉందని వ్యవసాయశాఖ తెలిపింది. దీంతో రబీ పంటల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మరోవైపు మొక్కజొన్నపై కత్తెర పురుగు దాడి ఉధృతమైంది. ప్రధానంగా నిజామాబాద్, కామారెడ్డి, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, నిర్మల్, కరీంనగర్, మహబూబాబాద్ జిల్లాల్లో మొక్కజొన్నకు కత్తెర పురుగు సోకిందని వ్యవసాయశాఖ తెలిపింది. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల వ్యవసాయ అధికారులను ఆదేశించింది.

పంచాయతీల్లోనైనా కమలం సత్తా చాటుకునేనా?



మన తెలంగాణ/హైదరాబాద్ : పంచాయతీ ఎన్నికలు బిజెపికి అత్యంత కీలకంగా మారాయి. కనీసం ఈ ఎన్నికల్లోనైనా గౌరవ ప్రదమైన పంచాయతీలను, వార్డు సభ్యులను గెలుచుకోవాలని భావిస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికిని కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఘోర పరాజయాన్ని చవి చూడడంతో ఇప్పుడు పంచాయతీ ఎన్నికలపై దృష్టి పెట్టింది. అసెంబ్లీ ఎన్నికల్లో వందకుపైగా స్థానాల్లో బిజెపి అభ్యర్థులు డిపాజిట్లను కూడా పొందలేకపోయారు. ఈ పరిణామం పార్టీ శ్రేణుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసింది. ఈ షాక్ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంకా కోలుకోకముందే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. పోయిన పరువును కనీసం పంచాయతీల్లోనైనా కాపాడుకోవాలని భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో కాకుండా కొన్ని చోట్ల మాత్రమే అభ్యర్థులను పోటీపెట్టాలని అనుకుంటోంది. పోటీ చేసిన వాటిల్లో అత్యధిక పంచాయతీలను దక్కించుకోవాలని భావిస్తోంది. అభ్యర్థులను గెలిపించే బాధ్యతను స్థానిక నేతలకు అప్పగించింది. మరోవైపు పంచాయతీ ఎన్నికలు ముగిసిన రెండు, మూడు నెలల్లోనే పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సమాయత్త ం కాని పక్షంలో ప్రస్తుతమున్న ఒక ఎంపి సీటును కూడా పోగొట్టుకోవాల్సి ఉంటుందని ఒక నాయకుడు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తుండడం విశేషం.

5525 రైతు కుటుంబాలకు రూ.276 కోట్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : రైతు బీమా పథకం ద్వారా ఇప్పటి వరకు 5525 మంది రైతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున జమ చేసినట్లు వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారధి తెలిపారు. గత ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి ఇప్పటి వరకు 5525 మంది రైతులు దురదృష్టవశాత్తు మృతి చెందినట్లు గుర్తించారు. వీరి నామినీలకు రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.276.26 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. సచివాలయంలో ఎల్‌ఐసి అధికారులతో పార్థసారధి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా పరిధిలో ఉన్న రైతు మృతి చెందిన తరువాత వ్యవసాయాధికారులు ఎల్‌ఐసి నోడల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని అప్‌డేట్ చేయాలన్నారు. అలాగే రైతు బీమాకు 2019–20కి సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందించాలని అధికారులకు ఆదేశించారు.

ఆర్థిక వెనకబాటుతనానికి

రిజర్వేషన్లు పరిష్కారం కాదు



మన తెలంగాణ / హైదరాబాద్ : అగ్రకుల రిజర్వేషన్ల బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడం దురదృష్టకరమని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సామాజిక వివక్ష వల్లనే ఇంతకాలం రిజర్వేషన్లు అమలయ్యాయని, ఆర్థిక వెనకబాటు సమస్యకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పరిష్కారించాలన్నారు. చాలా రంగాల్లో ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం లేదని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అగ్రకుల రిజర్వేషన్లు కూడా ఒక ఎన్నికల ఎత్తుగడ మాత్రమేనని ఆరోపించారు. అనేక లోపాలు ఉన్న ఈ బిల్లు అగ్రకుల పేదలను మభ్యపెట్టడమేనన్నారు. నగరంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాఫెల్ డీల్ విషయంలో ప్రజలకు వస్తున్న అనుమానాలను పక్కదోవ పట్టించడానికే మోదీ రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తెచ్చారని అన్నారు. దేశవ్యాప్తంగా రెండు రోజుల పాటు జరిగిన కార్మిక సంఘాల సమ్మె విజయవంతమైందని, సంఘటిత, అసంఘటిత, బ్యాంకు లాంటి పలు రంగాల కార్మికులు సమ్మెలో పాల్గొన్నారని తెలిపారు. సమ్మె వల్ల ముంబాయి నగరంలో పాలన పూర్తిగా స్తంభించిపోయిందని, కార్మికులు తమ హక్కుల కోసం పోరాడుతుంటే ప్రభుత్వాలు మరిన్ని నల్ల చట్టాలను కార్మికులపై ప్రయోగించడం దుర్మార్గమన్నారు. సిబిఐ డైరెక్టర్ ఆలోక్ వర్మ విషయంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు కేంద్రానికి చెంపదెబ్బ లాంటిదని, ప్రధాని మోడీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముస్లిం సభ్యులు ప్రొటెం స్పీకర్ గా ఉంటే ప్రమాణం చేయబోనంటూ బిజెపి ఎంఎల్‌ఏ రాజాసింగ్ వ్యాఖ్యానించడం సిగ్గులేని చర్య అని అన్నారు.

ఎన్నికల కోసమే ఇబిసి బిల్లు : చాడ వెంకట్ రెడ్డి

ప్రొటెం స్పీకర్‌గా ముస్లిం ఉంటే ప్రమాణస్వీకారం చేయబోనంటూ రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, బిజెపి ముస్లింల పట్ల ఎలా వ్యవహరిస్తుందో ఆయన వ్యాఖ్యలే నిదర్శనమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. రాజాసింగ్ వ్యాఖ్యలపై కెసిఆర్ స్పందించాలన్నారు. పంచాయతీ ఎన్నికల్లో బిసిలకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని, ఎస్‌సి వర్గీకరణ విషయంలో బిజెపి ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. అగ్రకుల రిజర్వేషన్లను బిజెపి రానున్న పార్లమెంటు ఎన్నికల కోసమే వాడుకుంటోందని, ఆ పార్టీ అవకాశవాద రాజకీయాలను ఖండించాలని పిలుపునిచ్చారు.

మోడీ కార్పొరేట్‌లకు అనుకూలం : నారాయణ

కార్పోరేట్ శక్తులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ కార్మికుల అవసరాల గురించి నరేంద్ర మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. కార్మికుల దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఢిల్లీలోని పార్లమెంటు స్ట్రీట్‌లో జరిగిన కార్మిక సంఘాల నిరసనకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, కార్మిక చట్టాలను అమలు చేయాలని, కనీస వేతనం, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వానికి కార్మికులు వారి శక్తి ఏంటో చూపిస్తారని, కార్మికుల చట్టాలను అమలు చేయకుండా నిరుగార్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అగ్రకులాల్లోని పేదలకు పది శాతం రిజర్వేషన్‌ను కల్పించే బిల్లును కేంద్ర ప్రభుత్వం హడావుడిగా తీసుకొచ్చిందని ఆయన అన్నారు.

26 జనవరికి ఘనమైన ఏర్పాట్లు

ఉన్నతాధికారులతో ప్రధాన కార్యదర్శి సమీక్ష

మన తెలంగాణ / హైదరాబాద్ : సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జనవరి 26న జరిగే గణతంత్రదినోత్సవ వేడుకల ఏర్పాట్లు ఘనంగా నిర్వహించాలని, అందుకు అవసరమైన పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖల అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి ఆదేశాలు జారీ చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జనవరి 26న ఉదయం పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయని, గవర్నర్ నరసింహన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, వేడుకలకు అవసరమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు కూడా ఏర్పాట్లు చేపట్టాలని పోలీస్ శాఖను ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ద్వారా పరేడ్ గ్రౌండ్స్‌లో పారిశుద్యం, మొబైల్ టాయిలెట్లు తదితర ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. గన్‌పార్క్, క్లాక్‌టవర్, ఫతేమైదాన్‌లను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించాలని తెలిపారు. రహదారులు, భవనాల శాఖ ద్వారా అవసరమైన బారికేడ్ వ్యవస్థను నెలకొల్పాలని, పరేడ్ గ్రౌండ్స్‌లో ఆహ్వానితులకు అవసరమైన సీటింగ్ ఏర్పాట్లను, నిర్దిష్ట సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రాజ్ భవన్, సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, చార్మినార్‌లతో పాటు చారిత్రక ప్రాధాన్యత కలిగిన భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సూచించారు. విద్యుత్‌శాఖ ద్వారా నిరంతర విద్యుత్ సరఫరా, మెట్రో వాటర్ విభాగం ద్వారా మంచినీటి సరఫరా, సమాచార శాఖ ద్వారా మీడియాకు అవసరమైన ఏర్పాట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, ఎల్‌ఇడి టివిలు, ప్రత్యక్ష ప్రసారానికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకకు హాజరయ్యే పాఠశాల విద్యార్థుల కోసం ఆర్‌టిసి ద్వారా ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేయాలన్నారు. అంబులెన్స్, అగ్నిమాపక ఏర్పాట్లు ఉండాలన్నారు. అమరవీరుల సైనిక స్మారక్ వద్ద ముఖ్యమంత్రి కెసిఆర్ రీత్ సమర్పించడానికి కూడా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి అధర్‌సిన్హా, రహదారులు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, జిహెచ్‌ఎంసి కమిషనర్ దాన కిశోర్, రక్షణ శాఖకు



చెందిన కాలేజ్ ఆఫ్ ఎయిర్ వార్‌ఫేర్ వింగ్ కమాండర్, శ్రీనివాస్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్, అదనపు డైరెక్టర్ జనరల్ జితేందర్, ఎంకె సింగ్, అభిలాష్ భిష్ట్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ గోపి కృష్ణ, హైదరాబాద్ కలెక్టర్ రఘునందన్ రావు, ప్రోటోకాల్ డైరెక్టర్ అర్విందర్ సింగ్, దక్షిణ డిస్కం సిఎండి రఘుమారెడ్డి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సమాచార మిలిటరీ, కంటోన్మెంట్ బోర్డ్, అగ్నిమాపక, స్కౌట్ అండ్ గైడ్స్ తదితరులతో పాటు అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గిరిజన క్రీడోత్సవాలు



మన తెలంగాణ/ భద్రాచలం : తెలంగాణ రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాలు రెండో రోజు ఉత్సాహంగా సాగాయి. 31 జిల్లాల నుండి వచ్చిన వివిధ కళాశాలల గిరిజన విద్యార్థులు తమతమ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఆర్చరీ, కబడ్డీ, వాలీబాల్, కోకో, చెస్, క్యారమ్స్, అథ్లెటిక్స్‌లో పాల్గొన్నారు. అథ్లెటిక్స్ సీనియర్స్ జావలిన్‌త్రో విభాగంలో భద్రాచలం జోన్‌కు చెందిన ప్రమీలకు మొదటి స్థానం దక్కింది. ద్వితీయ స్థానం భద్రాచలం జోన్‌కు చెందిన టి.నాగరాణి, తృతీయ స్థానం ఏటూరునాగారం జోన్‌కు చెందిన వై.శిరీషకు దక్కింది. సీనియర్ బాలికల హైజంప్‌లో భద్రాచలం జోన్‌కు చెందిన కె.కౌసల్య, కె.సరస్వతిలకు వరుసగా మొదటి, ద్వితీయ స్థానాలు దక్కగా, ఏటూరు నాగారం జోన్‌కు చెందిన కె.భవ్యకు తృతీయ స్థానం దక్కింది. సీనియర్ గర్ల్స్ 1 కెఎం రన్‌లో డి.శిల్ప ప్రథమస్థానం సాధించింది. భద్రాచలానికి చెందిన కె.వెంకటలక్ష్మి ద్వితీయ స్థానం, ఏటూరు నాగారానికి చెందిన జి.దీపిక తృతీయ స్థానం సాధించారు. కాగా విద్యార్థులు ఉల్లాసంగా క్రీడలలో పాల్గొనడానికి ఐటిడిఏ ఆధ్వర్యంలో క్రీడా మైదానంలో క్యాంప్‌ఫైర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా క్రీడాధికారి పట్టా శంకరయ్య తెలిపారు. రోజంతా ఆటలు ఆడిన క్రీడాకారుల అలసట పోగొట్టి, మరుసటి రోజు ఉత్సాహంగా ఆటలలో పాల్గొనడానికి ఫైర్‌క్యాంప్ ఏర్పాటు చేశారు. క్యాంప్ ఫైర్‌లో విద్యార్థులు, ఆటపాటలతో ప్రేక్షకుల్లో ఆనందాన్ని నింపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులు తమ తమ ప్రాంత సంస్కృతుల నృత్యాలను క్యాంప్ ఫైర్‌లో ప్రదర్శించారు. చలిలో క్యాంప్‌ఫైర్‌లో పాల్గొనడానికి అందరూ ఇష్టపడ్డారు. చక్కటి వాతావరణంలో క్యాంప్ ఫైర్ ఏర్పాటు చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

బ్లాస్టింగ్‌లో ఇద్దరి మృతి?



మనతెలంగాణ/ కొత్తగూడెం: చట్టం క్వారీ యజమానుల చుట్టమైంది. పోలీసులంటే లెక్కేలేదనిపిస్తోంది. మంగళవారం రాత్రి పాల్వంచ మండలంలోని తోగగూడెం రాళ్ల క్వారీలో రిగ్ బ్లాస్టింగ్ చేస్తున్న సమయంలో అది సమయానికంటే ముందే పేలి పలువురు గాయపడ్డారు. ఇద్దరు మృతిచెందినట్లు తెలుస్తోంది. గాయపడ్డవారిని యాజమాన్యం పోలీసులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే ఆసుపత్రులకు తరలించింది. ఇంతకి ఎంతమంది గాయపడ్డారు. ఎవరైనా మృతిచెందారా? లేదా? అన్న వివరాలు కూడా కనీసం యాజమాన్యం బుధవారం రాత్రి వరకు కూడా పోలీసులకు అందజేయలేదంటే చట్టం అంటే సదరు యాజమాన్యం ఏ స్థాయిలో గౌరవిస్తుందో తెలుస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఈ రిగ్ బ్లాస్టింగ్‌కు సంబంధించి రాత్రి ఎక్స్‌ప్లోజివ్ యాక్టులో పాల్వంచ రూరల్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ అనిల్ 'మన తెలంగాణ'కు చెప్పారు. ఒక క్షతగాత్రుడు హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడని, మరో ముగ్గురు గాయపడి ఉండవచ్చని చెబుతున్నారు. కేసు ప్రస్తుతం కెఆర్‌కెపై నమోదు చేశారు. క్వారీ ఎవరిపేరున ఉందో పూర్తి వివరాలు సేకరించి కేసు మార్చే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు. ఎవరైనా మృతిచెందితే సెక్షన్ ఆల్టర్ చేస్తామంటున్నారు. బ్లాస్టింగ్‌కు సంబంధించి పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, అనుమతులు ఉన్నాయో లేదో పరిశీలిస్తామని పోలీసులు చెప్పారు. ఇదిలా ఉండగా ఇక్కడ రిగ్ బ్లాస్టింగ్‌కు అనుమతి లేదని తెలుస్తోంది. లారీలో కంప్రెసర్ ఏర్పాటు చేసి, ఒక ట్రాక్టర్‌కు రిగ్గు ఏర్పాటు చేసి బోరు వేసి అందులో పేలుడు పదార్థాలు అమర్చి రాళ్ల క్వారీ పేలుస్తున్నారు. ఈ తతంగమంతా అధికారుల కనుసన్నల్లో నడుస్తుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బ్లాస్టింగ్ సమయంలో రిగ్గు వర్కర్లు ముగ్గురు, ఒక ట్రాక్టర్ డ్రైవర్, లారీ డ్రైవర్ ఉండి ఉంటారని భావిస్తున్నారు. ఒకరు ఖచ్చితంగా మృతిచెందారని వినవస్తోంది. ఇంకా పూర్తి వివరాలు అందాల్సి ఉంది. పోలీసులు వివరాల సేకరణకు కసరత్తు చేస్తున్నారు. రాళ్ల క్వారీలు అన్ని నిబంధనలు తుంగలో తొక్కి సింగరేణి ఓపెన్ కాస్టులకంటే పెద్దవిగా ఉన్నాయి.

ఆత్మకూర్ శివారులో చిరుతపులి కళేబరం



మనతెలంగాణ/మెట్‌పల్లి: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి డివిజన్ పరిధిలో ఆత్మకూర్ గ్రామ శివారులోని న్యాలదండి ఏరియాలో బుధవారం ఉదయం చిరుతపులి కళేబరం లభించినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి రాజేశ్వర్‌రావు తెలిపారు. ఈ చిరుతపులి రెండు మాసాల క్రితం అనారోగ్యానికి గురై మృత్యువాత పడ్డట్లు పంచనామా నిర్వహించిన పశువైద్యురాలు నస్రీన్ తెలియజేశారు. అనంతరం ఫారెస్ట్ అధికారులు చిరుతపులి కళేబరాన్ని దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శంకర్‌రావు, విఎస్‌ఎస్ చైర్మన్, విఆర్‌ఒ, ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఎల్ సక్కారావు, బిట్ ఆఫీసర్ అజీమొద్దిన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అక్కారం ఆదర్శం

- ఆరు సార్లు ఏకగ్రీవమే
- నాలుగు దశాబ్దాలలో రెండు సార్లే ప్రత్యక్ష ఎన్నికలు
- మరోసారి పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఏకగ్రీవానికి తీర్మానం
- ఆదర్శం... పలు గ్రామాలకు మార్గదర్శకం



మనతెలంగాణ/అచ్చంపేట: తెలంగాణ రాష్ట్రంలోనే వెనుక బడిన నల్లమల ప్రాంతంలో ఏజెన్సీ గిరిజన గ్రామాలు దశాబ్దాలుగా చైతన్యంగా ముందుకు వెళ్తూ తమ గ్రామాలను అభివృద్ధి చేసుకుంటూ ఎన్నో గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తూ ఐక్యమత్యంగా ముందుకు సాగుతున్నాయి. గ్రామం పంచాయతీగా ఏర్పడిన నాటి నుండి దాదాపు 42 ఏళ్లలో ఆరు పర్యాయాలు గ్రామ పంచాయతీ సర్పంచ్‌తోపాటు వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుని గ్రామాభివృద్ధికి సమిష్టిగా ముందుకు వెళ్తున్నారు. అచ్చంపేట మండల పరిధిలోని మారుమూల గ్రామమైన అక్కారం గ్రామాన్ని 1980వ సంవత్సరంలో ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఆనాటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అంతకు ముందు అక్కారం గ్రామం ఘన్‌పూర్ గ్రామానికి అనుబంధంగా ఉండేది. అక్కారం గ్రామం అచ్చంపేట మండలంలోనే ఉన్న మండల కేంద్రానికి దాదాపు 50 కిలోమీటర్ల దూరంలో నల్లమల అడవులకు అతి సమీపంలో ఉన్న ఏజెన్సీ గ్రామం. ఏజెన్సీ ప్రాంతం కావడంతో సర్పంచ్ పదవి ఎస్టీలకు రిజర్వ్‌డ్ చేయబడింది. 1980లో పంచాయతీగా ఏర్పడిన అక్కారం గ్రామాన్ని దాదాపు 35 సంవత్సరాలు ఒకే కుటుంబానికి చెందిన వారు సర్పంచ్‌గా పాలించారు. 1980 నుంచి గ్రామానికి చెందిన మూడావత్ చత్రూనాయక్ 20 సంవత్సరాలపాటు గ్రామాన్ని పాలించాడు. నాలుగు పర్యాయాలు ఏకదాటిగా ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా గ్రామ సర్పంచ్‌గా చత్రూనాయక్ ఎన్నికయ్యాడు. తర్వాత చత్రూనాయక్ కుటుంబానికి చెందిన వసూరాం నాయక్ టిడిపి తరుపున పోటీ చేసి విజయం సాధించాడు. గ్రామ పంచాయతీ ఏర్పడిననాటి నుండి మొదటిసారి జరిగిన ఎన్నికలలో దాదాపు 25 సంవత్సరాలు పాలించిన అదే కుటుంబానికి చెందిన వ్యక్తికి మరోసారి గ్రామస్తులు పట్టం కట్టారు. మరోసారి 2006లో జరిగిన ఎన్నికలలో సోమాని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించింది. పంచాయతీ ఏర్పడిన 30 సంవత్సరాలకు మరో కుటుంబానికి గ్రామ సర్పంచ్‌గా ప్రజలు అవకాశం కల్పించారు. 2013లో జరిగిన ఎన్నికలలో మరోసారి వసూరాం సతీమణి కమలను గ్రామ సర్పంచ్‌గా గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ ఎన్నికలలో మరో పర్యాయం గ్రామ సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు గ్రామస్తులు తీర్మానం చేశారు. ఈపర్యాయం గ్రామానికి చెందిన ఇస్లావత్ కృష్ణవేణి అనే విద్యావంతురాలిని ఏకగ్రీవంగా ఎన్నకునేందుకు గ్రామస్తులు తీర్మానం చేశారు. గ్రామంలో అధిక శాతం గిరిజనులే ఉన్నా, ఇతర కులాల వారు కూడా వారితో కలిసిమెలిసి జీవిస్తూ ఒక్కతాటిపై ఉంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారు. గ్రామంలో ఎలాంటి గొడవలు లేకుండా, ఎన్నికల పేరుతో సొమ్మును దుర్వినియోగపరుచకుండా ఒక్కతాటిపై ఉండి గ్రామాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారు. గ్రామంలో ప్రస్తుతం 1826 మంది జనాభా ఉండగా 999 మంది ఓటర్లు ఉన్నారు. గ్రామంలో విద్యావంతులే అధికంగా ఉండడంతోపాటు, దాదాపు వంద మంది ప్రభుత్వ ఉద్యోగులుగా వివిధ ఉన్నత హోదాలలో పని చేస్తునారు. ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న ఎలాంటి బేషాజాలకు పోకుండా ఒక్కతాటిపై ఉండి గ్రామ పంచాయ తీ సర్పంచ్‌ను ఏకగ్రీవంగా చేసుకుంటూ రాష్ట్రంలోని ఎన్నో గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. అక్కారం గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని ఒక్కతాటిపై ఉండి తమ గ్రామాలకు ఏకగ్రీవ సర్పంచ్‌లను ఎన్నుకుంటే బాగుంటుందని వివిధ గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

రెండుసార్లే సర్పంచ్ పదవికి ఓటేశాను



అక్కారం గ్రామ పంచాయతీ 40 ఏండ్ల కింద ఏర్పడింది. 40 ఏళ్ల నుండి రెండు సార్లు మాత్రమే సర్పంచ్ పదవికి ఎన్నికలు జరిగాయి. గ్రామస్తులమంతా ఒక్క మాటపై ఉండి ఏకగ్రీవం చేసుకునేందుకు అందరం కలిసి మాట్లాడుకుని నిర్ణయం తీసుకుంటున్నాం.

కె.రామస్వామి, అక్కారం గ్రామస్థుడు



గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా



తనపై నమ్మకంతో తనను ఏకగ్రీవంగా సర్పంచ్‌ను చేసేందుకు తీర్మానం చేసిన గ్రామస్తులందరికి ధన్యవాదాలు. గ్రామస్తులందరి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తాను.

ఇస్లావత్ కృష్ణవేణి, (నూతన సర్పంచ్‌గా గ్రామస్థులు ఏకగ్రీవ తీర్మానం చేసిన అభ్యర్థి)

ఐక్యమత్యంగా నిర్ణయాలు తీసుకుంటాం



గ్రామంలో ఏ చిన్న సమస్య వచ్చినా అందరం కలిసి శాంతియుత వాతావరణంలో చర్చించుకుని సమస్యలు పరిష్కరించుకుంటాం. సర్పంచ్ ఎన్నికల పేరుతో డబ్బును వృథా చేయకుండా, ఏకగ్రీవ పంచాయతీగా ఏర్పాటు చేసుకుని ప్రభుత్వం నుండి వచ్చే నజరానాతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటాం.

శ్రీనువాస్ రెడ్డి. అక్కారం గ్రామస్థుడు

సిసిఐ పునరుద్ధరణపై చిగురిస్తున్న ఆశలు

- ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తే జిల్లా అభివృద్ధి
- రాయితీ కల్పిస్తే తెరిచే అవకాశం
- అందుబాటులో సున్నపురాయి
- సిసిఐతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు



మన తెలంగాణ/ఆదిలాబాద్‌ప్రతినిధి : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిశ్రమ (సిసిఐ) 25 ఏళ్ల క్రితం మూతపడడంతో వందలాది కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డా యి. ఇక ఈ పరిశ్రమతో పరోక్షంగా ఉపాధి పొందుతున్న వారు సైతం ఫ్యాక్టరీని మూసివేయడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొన్నారు. అప్పటి నుంచి ఎన్నో ప్రభుత్వాలు మా రినా ఈ పరిశ్రమను తెరిపించేందు కు ముందుకు రాకపోవడంతో జిల్లా ప్రజలు ఈ పరిశ్రమపై ఆశలు వదులుకున్నారు. ఈ తరుణంలో ముఖ్యమంత్రి కెసిఆర్ సిసిఐను పునరుద్ధరించాలని కోరు తూ ప్రధాని నరేంద్రమోడీకి వినతిపత్రాన్ని అందచేయడంతో జిల్లా ప్రజలలో ఆశలు చిగురిస్తున్నాయి. కాగజ్‌నగర్‌లోని పేపర్ మిల్లు పునరుద్ధరణకు పరిశ్రమల శా ఖ లైన్ క్లియర్ చేయడం, దీనిని తెరిపించేందుకు కసరత్తు ప్రారంభం కా వడంతో ఆదిలాబాద్‌కు గుండెకా య, జిల్లాకే తలమానికంగా ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ) ఫ్యాక్టరీ పునరుద్ధరణ సైతం జరుగుతుందని ఆశిస్తున్నారు.

పేపర్ మిల్లుకు పదేళ్ల పాటు అన్ని రకాల రాయితీలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించడంతో మిల్లు పునరుద్ధరణ సాధ్యమైంది. ఆదిలాబాద్ జిల్లాలో ఉ న్న సిసిఐ ఫ్యాక్టరీకి సైతం రాయితీ లు కల్పిస్తే తెరుచుకునే అవకాశం ఉంది. ఇదే అంశంపై మాజీ మంత్రు లు కెటిఆర్, జోగు రామన్నలు కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి అనంత్‌గితెతో గతంలో ఢిల్లీలో మూతపడిన సిసిఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై చర్చ లు జరిపారు. రాష్ట మంత్రివర్గ సమావేశంలోనూ ముఖ్యమంత్రి కెసిఆర్ సిసిఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై తీర్మా నం చేశారు. సిసిఐ పునరుద్ధరణపై కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పిస్తామని ప్రకటించారు. అందుకు అనుగుణంగానే ఫ్యాక్టరీని తెరిపించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయడం గమనార్హం.

రాయితీలు కల్పించాలి

రాష్ట ప్రభుత్వం కాగజ్‌నగర్ పేపర్ మిల్లుకు పదేళ్ల పాటు ఎస్‌జిఎస్టి రీ యింబర్స్‌మెంట్, వందశాతం స్టాం ప్, విద్యుత్ ద్యూటీ మినహాయింపు, మూలధనం పెట్టుబడిలో 20 శాతం సబ్సిడీ, వంటి పలురకాల అనుమతులకు వెసులుబాటు కల్పించింది. పేపర్ మిల్లు పరిశ్రమకు ఇచ్చినట్లుగానే రాష్ట ప్రభుత్వమే సిసిఐ సిమె ంట్ కొనుగోలు చేయడం, అప్పులు మాఫీ చేయడం, పన్ను రాయితీతోపాటు ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తే సిసిఐ మళ్లీ తెరుచుకోవడానికి అవకాశాలు లేకపోలేదు. గతేడాది జనవరిలోనే కెటిఆర్, జోగు రామన్నలు కేం ద్రమంత్రిని కలిసిన సమయంలో రా ష్ట ప్రభుత్వం నుంచి అన్ని చర్యలు తీ సుకుంటామని, సిసిఐని పునరుద్ధరించాలని కోరారు.

తెలంగాణ రాష్ట ప్రభుత్వం నూతన పరిశ్రమల స్థాపనకు అందజేస్తున్న రాయితీలను సిసి ఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కూడా అందించేందుకు సిద్ధంగా ఉందని కెటిఆర్ ప్రకటించారు. 1993లో మూతపడ్డ పరిశ్రమఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకే సిసిఐ తలమానికంగా నిలిచింది. దాంట్లో సిసిఐ ఫ్యాక్టరీ ఎంతో ముఖ్యమైనది. ఇప్పటికి సిసిఐలో 69 ఏళ్లకు సరిపడా సున్నపు రా యి అందుబాటులో ఉంది. దేశంలో నే సిసిఐ మ న్నికైన సున్నపురాయి అందిస్తూ గు ర్తింపు పొందింది. సిసిఐలో ఉన్న య ంత్రాలు కూడా ఇప్పటికీ చెక్కు చెదరలేదు. వేల టన్నుల సామర్థ్యం కలిగిన వాహనాలను మూలన పడేశా రు. సిసిఐ ప్రారంభం లో వేల కోట్ల టర్నోవర్ చేసింది. 19 78 సంవత్సరంలో జిల్లాకు మంజూరైన సిసిఐ ఆ దిలాబాద్ పట్టణ శివారు ప్రాం తంలో 874 ఎకరాల్లో ప్రభుత్వ భూ మితో పాటు 2 వేల ఎకరాల లీజు భూమిలో ఉంది. 1982 ఆగస్టు 15 న సిమెంట్ ఉత్పత్తి ప్రారంభం కా గా, రూ.60 కోట్లతో స్థాపించారు. 1991లో కేంద్రంలో అధికార ంలోకి వచ్చిన పివి నర్సింహారావు ప్ర భుత్వంలో నూతన పారిశ్రామిక ఆర్థి క విధానాలు ప్రవేశపెట్టారు. తద్వారా 1991, 1992, 1993 సంవత్సరా ల్లో సిసిఐ వేల కోట్లలో లాభాలు గడి ంచింది. ఇదే సమయంలో ప్రభు త్వం లెవీ పద్ధతి (60 శాతం ప్రభు త్వం కొనుగోలు చేయడం)ని రద్దు చేయడంతో సిసిఐకి బడ్జెట్ కేటాయింపులు నిలిచిపోయాయి.

దీంతో 1993 అక్టోబర్‌లో సిసిఐ ఉత్పత్తి పూ ర్తి స్థాయిలో నిలిచిపోయింది. అప్పటి నుంచి కార్మికులు, కార్మిక సంఘా లు ఆందోళనలు చేపట్టినా ప్రజా ప్ర తినిధులు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదని అం టున్నారు.

సమైఖ్య పాలకుల నిర్ల క్ష్యం కారణంగా పరిశ్రమ తెరుచుకోకపోవడంతో కార్మికులు, పరిశ్రమపై ఆ ధార పడుతూ బతికే వారు అవస్థలు పడాల్సి వచ్చింది. ఈ తరుణం లో ప్రభుత్వం సిసిఐ పునరుద్ధరణపై దృష్టి సారించడంతో జిల్లా అభివృద్ధితోపాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంటున్నారు.

అర్ధరాత్రి సెల్‌ఫోన్ షాపుల్లో చోరీ

- 80లక్షల విలువ చేసే సెల్‌ఫోన్‌లు దొంగతనం
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీం



మనతెలంగాణ/జగిత్యాల : జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. పట్టణ నడిబొడ్డున ఉన్న రెండు పెద్ద సెల్ పాయింట్ల షెటర్లు ధ్వంసం చేసి లోనికి చొరబడ్డ నలుగురు దొంగలు అందులోని రూ.80 లక్షల విలువ చేసే సెల్‌ఫోన్లు, రూ.5 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని యావర్ రోడ్డులో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న లాట్ మొబైల్ స్టోర్ షెటర్లు ధ్వంసం చేసి లోనికి చొరబడ్డ నలుగురు దొంగలు అందులోని 25 లక్షల విలువ చేసే సెల్‌ఫోన్‌లు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనకు పాల్పడిన కొద్ది నిమిషాల తేడాలో అంగడి బజార్‌లోని భవానీ సెల్ పాయింట్ షెటర్లు ధ్వంసం చేసి అందులోని 50 లక్షల విలువ చేసే సెల్ ఫోన్‌లు, రూ. 5 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. బొలెరో వాహనంలో వచ్చిన నలుగురు దొంగలు ఇనుపరాడ్‌తో దుకాణాల షెటర్లు ధ్వంసం చేసి లోనికి చొరబడి కేవలం 5 నిమిషాల వ్యవధిలోనే దుకాణాన్ని ఊడ్చుకెళ్లినట్లు సిసి కెమెరాల ద్వారా తెలుస్తోంది. దొంగతనానికి పాల్పడ్డ నలుగురు ముఖాలకు ముసుగులు, చేతులకు గ్లౌజ్‌లు ధరించి సెల్‌ఫోన్‌లను సంచుల్లో నింపుకుని ఎత్తుకెళ్లగా ఆ దృశ్యాలన్నీ సిసి కెమెరాలో రికార్డు అయ్యాయి. తెల్లవారుజామున సెల్‌ఫోన్ దుకాణాల షెటర్లు తెరిచి ఉన్నట్లు తెలుసుకున్న దుకాణాల నిర్వాహకులు హుటాహుటిన దుకాణాలకు చేరుకుని పరిశీలించగా రెండు దుకాణాల్లో విలువైన సెల్‌ఫోన్‌లన్నీ మాయం కావడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దాంతో జిల్లా ఎస్‌పి సింధూశర్మ, అదనపు ఎస్‌పి మురళీధర్, డిఎస్‌పి వెంకటరమణ, సిఐలు ప్రకాశ్, నాగేందర్‌గౌడ్, లక్ష్మి బాబులు సంఘటనా స్థలాలను పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలోకి దింపి ఆధారాలు సేకరించారు. సిసి కెమెరా ఫుటేజిని పరిశీలించిన ఎస్‌పి, దొంగతనానికి పాల్పడ్డ వారిని పట్టుకునేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి సాధ్యమైనంత తొందరగా కేసు ఛేధించాలని ఆదేశించారు.

జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న రెండు సెల్‌ఫోన్ దుకాణాలను టార్గెట్ చేసుకున్న దొంగలు ధర్జాగా బొలెరో వాహనాన్ని దుకాణాల ముందు నిలిపి రెండు దుకాణాల్లోని విలువైన సెల్‌ఫోన్‌లను ఎత్తుకెళ్లిన సంఘటన జగిత్యాల పట్టణ వ్యాపారులను ఉలిక్కిపడేలా చేసింది. పట్టణంలోని ప్రతి కూడలిలో సిసి కెమెరాల ఏర్పాటుతోపాటు రాత్రి పూట ప్రత్యేక పోలీస్ బృందాలు గస్తీ నిర్వహిస్తుండగా దొంగలు పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న రెండు సెల్‌ఫోన్ దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడి ఒక రకంగా పోలీసులకు సవాల్ విసిరినట్లయింది. ఎప్పుడు రద్దీగా ఉండే ప్రాంతం కావడం... జాతీయ రహదారిపై రాత్రింబవళ్లు వాహనాల రాకపోకలు కొనసాగుతుండగా ఎవరి దృష్టి తమ మీద పడకుండా నిమిషాల్లో రెండు దుకాణాల్లో భారీ ఎత్తున సెల్‌ఫోన్‌లను లూఠీ చేయడాన్ని బట్టి చూస్తే దొంగతనాల్లో ఆరితేరిన వారే పక్కా ప్రణాళికతో దొంగతనానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. దుకాణాల్లో సిసి కెమెరాలు ఉన్నట్లు ముందే గుర్తించిన దొంగలు ముఖాలకు ముసుగులు వేసుకుని లోనికి చొరబడ్డారు. క్లూస్ టీంకు వేలి ముద్రలు దొరకకుండా ఉండేందుకు చేతులకు గ్లౌజ్‌లు ధరించి నేరుగా ర్యాక్‌లలో ఉంచిన విలువైన సెల్‌ఫోన్‌లు ఎత్తుకెళ్లి తక్కువ ధర ఉన్న సెల్‌ఫోన్‌లు వదిలివేసి వెళ్లిన తీరు చూస్తే దొంగలు ముందే ఆ రెండు దుకాణాల్లో రెక్కీ నిర్వహించినట్లు స్పష్టమవుతోంది.



టైగర్ జోన్‌లో వన్యప్రాణులకు రక్షణేది?





మనతెలంగాణ/ఆదిలాబాద్ ప్రతినిధి : అడవుల జిల్లా లో అటవీ ప్రాంతాన్ని కాపాడేందుకు కోట్లాది రూపాయలను వెచ్చించి ఏర్పాటు చేసిన కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో పెద్ద పులుల జాడ కనిపించడంలేదు. వచ్చిన పులులను సంరక్షించడానికి సంబంధిత శాఖ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అడవుల సంరక్షణ పేరుతో అనేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పుకుంటున్నప్పటికీ ఆచరణలో మాత్రం కనీస చర్యలు తీసుకోవడం లేదని విమర్శలున్నాయి. ఇటీవల కవ్వాల్ అభయారణ్యంలోకి వచ్చిన పె ద్ద పులిని చంపి దాని చర్మాన్ని విక్రయించేందుకు య త్నించగా వైల్డ్ లైఫ్ క్రైం కంట్రోల్ బ్యూరో, అటవీశాఖ అధికారులు వలపన్ని నలుగురు నిందితులను పట్టుకొని వారి నుంచి పులి చర్మాన్ని స్వాధీనం చేసుకున్నారు. పులిని చంపిన కేసులో ప్రధాన నిందితుడైన గుగ్లావత్ రమేష్ అంతకు రెండు రోజుల ముందే నీలుగాయి వే టాడి మాంసాన్ని తన ఇంట్లో నిల్వ చేసుకోవడం గమనార్హం. ఈ ఘటనలో పెంబి ఎఫ్‌ఆర్ ఒ హాఫీజోద్దిన్ నీలుగాయి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నప్పటికీ నిందితుడిపై ఎలాంటి కేసు నమోదు చేయకుండా వదిలివేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. అయితే ఆ తరువాత కవ్వాల్ అభయారణ్యంలో సంచరిస్తున్న పులి అదృశ్యమైంది. రహస్యంగా విచారణ చేపట్టిన అధికారులు పులి హత్యకు గురైనట్లు గుర్తించారు. ఆ తరువాత పులి చర్మాన్ని కొనుగోలు చేస్తామంటూ పక్కా ప్రణాళికతో వ్య వహరించి నిందితులతో సహా పులిచర్మాన్ని స్వాధీ నం చేసుకున్నారు. నీలుగాయి, కుందేళ్లు, జింకలు లా ంటి వన్యప్రాణులను నిత్యం వేటాడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం కేసులు నమోదు చేయకు ండా మిన్నకుంటున్నారనే ఆరోపణలున్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో అనేక కార్యక్రమాలను చేపట్టారు. దీంతోపాటువన్యప్రాణులు, పులుల కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకొనేందుకు లక్షలాది రూపాయల ను వెచ్చించి సిసి కెమెరాలను సైతం ఏర్పాటు చేశారు. ఈ సిసి టీవీలను హైదరాబాద్‌కు అనుసంధానం చేశారు. అయినప్పటికీ పులులు వచ్చినట్లు గుర్తించిన సమయంలో సైతం అప్రమత్తంగా ఉండకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై జంతు ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దిద్దుబాటు చర్యలు ప్రారంభం

కవ్వాల్ అభయారణ్యంలో పులిని చంపిన విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం విధులను నిర్లక్ష్యం చేశారనే కారణంతో నిర్మల్ జిల్లా పెంబి అటవీ క్షేత్రాధికారి(ఎఫ్‌ఆర్‌ఒ)గా పని చేస్తున్న హాఫీజోద్దిన్‌ను సస్పెండ్ చేసింది. అలాగే అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఇక ఈ ఘటనలో బాధ్యులైన అటవీశాఖ సిబ్బందిపై సైతం సస్పెన్షన్ వేటు వేసిన అధికారులు అటవీ ప్రాంతంలోకి వచ్చే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. కవ్వాల్ అభయారణ్యానికి ఆనుకొని ఉన్న గ్రామాలపై నిఘా పెట్టి స్మగ్లర్ల ఆట కట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పులితోపాటు నీలుగాయిని వేటగాళ్లు చంపడంతో పెంబి రేంజి పరిధిలోని అటవీశాఖ సిబ్బంది, అధికారులపై కఠిన చర్యలు తీసుకున్న అధికారులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అటవీ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఏదైనా సంఘటన చోటుచేసుకున్న సమయంలోనే హడావుడి చేయడంతో సరిపెట్టుకోకుండా అనునిత్యం అడవులు, వన్యప్రాణుల సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భర్త ఇంటి ముందు భార్య బైఠాయింపు



మనతెలంగాణ/సంగారెడ్డి/నారాయణఖేడ్‌టౌన్: భర్త మూడేండ్లుగా విడిచిపెట్టిన ఒక మహిళ తన కుమారుడికి న్యాయం చేయాలంటూ భర్త ఇంటి ముందు బైఠాయించిన సంఘటన బుధవారం నారాయణఖేడ్ పట్టణంలో చోటు చేసుకుంది. బాధితులు, తేజస్వీ కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం ఉట్‌పల్లి గ్రామానికి చెందిన తేజస్వీకి నారాయణఖేడ్‌కు చెందిన రామాచారికి ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. రెండేండ్ల వరకు వీరి కాపురం సజావుగా కొనసాగినట్లు సదరు మహిళ తెలిపారు. అదనపు కట్నం కోసం వేధించి తనకు మూడేళ్లుగా దూరంగా ఉంటున్నారని తేజస్వీ తెలిపారు. మానసికంగా తనను వేధిస్తున్నాడని వాపోయి ంది. అదన పు కట్నం కోసం వేధించిన రామాచారిపై చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే పోలీ సులను ఆశ్రయించానని అన్నారు. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీ జరిగినా రామాచారి వినలేదన్నారు. రామాచారిలో మార్పు రాకపో వడంతో ఆమె బుధవారం అతని ఇంటి ముందు బైఠాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు తేజస్వీని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

మన తెలంగాణ/పూడూరు : ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండల పరిధిలోని హైదారాబాద్ బీజాపూర్ జాతీయ రహదారిపై కేశవరెడ్డి స్కూల్, పూడూరు స్టేజీ మధ్యలో ఉన్న గోల్డన్‌ప్లస్ ఫాంహౌస్ సమీపంలో బుధవారం రాత్రి సమయంలో చోటుచేసుకుంది. చన్‌గోములు ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపిన కథనం ప్రకారం.. మండల పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన ఓ పత్తి ట్రాక్టర్ పూడూరు స్టేజీ సమీపంలో ఉన్న సాయిబాబా టెక్నో కాటన్ మిల్లుకు పత్తిని తరలిస్తుండగా రాత్రి సమయంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరిలో ఎల్లప్ప(23) తల తెగి 100 మీటర్ల దూరంలో పడంది. మరో వ్యక్తి మారతి కాశప్ప(32) తలకు బలమైన దెబ్బ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతులు కొడంగల్ మండల పరిధిలోని ఇస్మాపూర్ గ్రామానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు చన్‌గోములు పోలీస్‌లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జర్పుతున్నట్లు తెలిపారు.

డెటొనేటర్లు పేలి వ్యక్తి మృతి

మన తెలంగాణ/సిద్దిపేట/చిన్నకోదూరు: బండరాయిని పగలగొట్టడానికి ఉపయోగించే డిటోనేటర్లు నిల్వ ఉంచే గోదాంలో ప్రమావదశాత్తు పేలుడు సంభవించటంతో అందులో పనిచేసే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామానికి చెందిన జిందం రాజయ్య(46) గత 11 ఏండ్లుగా డిటోనేటర్లు తీసుకొచ్చి ఆయా క్రషర్లకు, సంబంధిత వారికి తన ఆటో ద్వారా చేరవేసేవాడు. బుధవారం రోజువారి మాదిరిగా చిన్నకోదూరు మండల పరిధిలోని మల్లారం గ్రామ శివారులోని శ్రీ లక్ష్మీ గణేష్ ఆంజనేయ క్రషర్ వద్ద నిల్వ ఉండే గోదాంలో డిటోనేటర్లు తీసుకురావటానికి వెళ్లిన్నట్టు సమాచారం. అక్కడికి వెళ్లిన అతను గది తలుపులు తీసి డిటోనేటర్లను తన ఆటోలో వేసుకునే క్రమంలో పేలుడు సంభవించినట్లు స్థానికులు, సిద్దిపేట పోలీసు కమిషనర్ జోయల్ డేవీస్, ఏసిపి రామేశ్వర్లు తెలిపారు. డిటోనేటర్లు భద్రపరిచే భవనం కుప్పకూలిపోయి, డిటోనేటర్ల అగ్నికి రాజయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మంటల తాకిడికి రాజయ్య మృతదేహం గోదాంకు దాదాపు 50 గజాల దూరంలో పడి పూర్తిగా ఛిద్రమైంది. ఆటో సుమారు 150 మీటర్ల దూరంలో పడిపోయింది. ఈ సంఘటన ఉదయం 8 గంటల ప్రాంతంలో జరిగితే మధ్యాహ్నం 12 గంటల వరకు బాంబుల మోత ఆగలేదు. ప్రతి నిమిషానికి ఒక్కసారి బాంబులు బ్లాస్టు కావటంతో పోలీసులు సైతం ప్రమాద స్థలం వద్దకు వెళ్లాలంటే వెనుకడుగు వేశారు. మంటలను ఆర్పేందుకు ఫైర్ ఇంజన్ వచ్చినప్పటికి అగ్నిమాపక యంత్రం కూడా పక్కనే నిలిపివేసి, బాంబులు పూర్తిగా పేలే వరకు ఆపారు. పేలుడు సంభవించిన ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో మృతుని బంధువులు, కుటుంబసభ్యులు అక్కడికి చేరుకొని రోదించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి వివరాలు తెలియజేస్తామని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో బాధ్యులైన వారిపై తగు చర్యలు తీసుకుంటామని చిన్నకోదూరు ఎస్‌ఐ అశోక్ తెలిపారు. ఈ సంఘటన స్థలంలో సిపి, ఏసిపి, సిఐలు, ఎస్‌ఐలు ఉన్నారు.

కాకతీయ కాలువ వద్ద ఉద్రిక్తత



మనతెలంగాణ/కమ్మర్‌పల్లి: జగిత్యాల జిల్లా సరిహద్దులోని ఎస్సారెస్పి కాకతీయ కాలువ హెడ్‌రెగ్యూలేటరీ వద్ద బుధవారం ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం, వర్షకొండ, పెద్దాపూర్, రేగుంట తదితర గ్రామాలకు చెందిన ఎస్సారెస్పి కాకతీయ కాలువ ఆయకట్టు రైతులు కలిసి నిజామాబాద్ జిల్లా సరిహద్దులో ఉన్న కాకతీయ కాలువ హెడ్‌రెగ్యులేటరీ వద్దకు చేరుకొని గేటు ఎత్తి నీటిని దిగువ భాగానికి వదిలారు. సమాచారం అందుకున్న నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామానికి చెందిన ఆయకట్టు రైతులు హెడ్‌రెగ్యులేటరీ వద్దకు చేరుకుని నీటి తరలింపును అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు జిల్లాల రైతుల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. సంబంధిత అధికారులకు తెలియకుండానే కాలువలో నిలువ ఉన్న నీటిని ఎలా తరలించుకుపోతారని మండిపడ్డారు. కాలువ గేటును కిందికి దింపారు. ఎస్‌ఐ మురళి ఆధ్వర్యంలో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరు ప్రాంతాల రైతులతో చర్చలు జరిపారు. ప్రాజెక్ట్ నుంచి నీటిని వదలగానే గేట్లు ఎత్తుతామని ఇక్కడి రైతులు తెలుపడంతో జగిత్యాల జిల్లా రైతులు వెనుదిరిగి వెళ్లారు.

పథకం ప్రకారమే యువకుడి హత్య

తెలంగాణ/ చందుర్తి : మాటు వేసి, పథకం ప్రకారం యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన గ్రామస్థులను, మృతుని బంధువులను, కుటుంబ సభ్యులను తీవ్రంగా కలిచివేసింది. యువకుడిని హత్య చేసి శవా న్ని మంగళవారం వ్యవసాయ బావిలో పడేసారు. బావి లో నుంచి మృతదేహాన్ని బుధవారం బయటకు తీయగానే హత్యోదంతం అత్యంత కిరాతకంగా కనిపించిం ది. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత పరిస్థితికి దారితీసింది. ఓ దశలో పోలీసులు గ్రామస్థుల ఆవేశం చూసి వెనక్కి తగ్గారు. చివరకు పరిస్థితి చేయిదాటుతోందని వేములవాడ డిఎస్‌పి వెంకటరమణకు, చందుర్తి సిఐ విజయ్‌కుమార్ సమాచారాన్ని ఇవ్వడంతో పోలీసులు బలగాలను రంగంలోకి దించి పరిస్థితిని చక్కబెట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రా మానికి చెందిన మెరుపుల హరీష్(23) వ్యవసాయ పొ లం వద్ద ఉన్న పశువులకు నీళ్లు పెట్టి గుర్రం బుచ్చయ్య అనే వ్యక్తితో కలిసి ఆక్టివ్ హోండాపై తిరిగి వస్తుండగా చెరువు మత్తడి వద్ద మాటు వేసిన ఇదే గ్రామానికి చెం దిన నేరేళ్ల రమేష్, నేవూరి బాబులు మంగళవారం మధ్యాహ్నం వేట కొడవలితో హరీష్ తలను నరికి కిరాతకంగా హత్య చేశారు. హరీష్‌తో ద్విచక్ర వాహనంపై ఉన్న మరో వ్యక్తి బుచ్చయ్య ది గి పరుగులు తీయడంతో బతికి బయటపడ్డాడు. హరీష్‌ను హ తమార్చి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో ద్విచక్ర వాహనంతోపాటు పడేసారు. ఈ విషయమై అదేరోజు సాయం త్రం చందుర్తి పోలీసులకు స మాచారాన్ని ఇవ్వడంతో సం ఘటన స్థలానికి వేములవాడ డిఎస్‌పి వెంకటరమణ, చం దుర్తి సిఐ విజయ్‌కుమార్, ఎస్‌ఐ రవిలు రాత్రే చేరుకున్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి బావిలో మో టారు పంపుల సహాయంతో రాత్రంతా నీటిని తోడేశారు. బుధవారం ఉదయాన్నే మృతదేహాన్ని బయటకు తీయడంతో తల నరికి ఉన్న తీరును చూసి గ్రామస్థులు తీవ్ర ఆవేశానికి లోనయ్యారు. వారిని అడ్డుకునేందుకు యత్నించి పోలీసులపై దాడి చేసేందుకు కూడా ఓ దశలో యత్నించారు. దీంతో పోలీసులు ఒకడుగు వెనక్కి తగ్గారు. ఇదే అదనుగా భావించిన మృతుని బంధువులు, గ్రామస్థులు శవాన్ని, నిందుతుడిగా భావిస్తున్న రమేష్ ఇంట్లో వేసి దహనం చేసేందుకు యత్నించారు. అంతటితో ఆగకుండా నిందితుడి ఇంట్లో ఉన్న ఫర్నీచర్, ధాన్యాన్ని, రసాయనిక ఎరువులను పాడుచేశారు. ఇంటిని ధ్వంసం చేశారు. పరిస్థితి విషమించడంతో చందుర్తి సిఐ విజయ్‌కుమార్ వెంటనే రుద్రంగి, కోనరావుపేట, వేములవాడ రూరల్ ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, నరేష్, శివకేశవులతోపాటు జిల్లా గార్డులను రప్పించారు. మరోవైపు వేములవాడ డిఎస్‌పి వెంకటరమణ సంఘటన స్థలానికి చేరుకొని ఉద్రిక్తత పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.



సూరత్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి పతంగుల పండుగలో పోటీదారుల సందడి

పుష్కరం గడిచినా పూర్తి కాని పనులు

- అధునాతన స్టేడియం నిర్మాణానికి 2006లోనే శ్రీకారం
- నాలుగు కోట్లు మంజూరు చేయించినా ముమ్మరం కానీ పనులు
- ఎంఎల్‌ఏ మాధవరం చొరవతో పనుల్లో చలనం

మనతెలంగాణ/ కేపీహెచ్‌బికాలనీ: హైదరాబాద్ నగరంలో జిహెచ్‌ఎంసి ఆవిర్భావానికి ముందు కూకట్‌పల్లి సెలక్షన్ గ్రేడ్ మునిసిపాలిటీ. ఆసియాఖండంలోనే అతి పెద్ద కాలనీగా పేరొందిన కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో హుడా లేఅవుట్ ప్రకారం ప్రజల అవసరాల కోసం ఖాళీ స్థలాలను వదిలారు. అందులో కెపిహెచ్‌బికాలనీ 6వ ఫేజ్‌లో ఉన్న ఖాళీ స్థలంలో అధునాతమైన ఇండోర్ స్టేడియం కమ్ స్విమ్మింగ్‌పూల్ నిర్మించాలని అప్పటి మునిసిపాలిటీ కౌన్సిల్ తీర్మానించింది. దీంతో ఇంజనీరింగ్ అధికారులు రూ.4.25కోట్లతో అంచనాలు రూపొందించి కౌన్సిల్ ముందుంచారు. 2008 నాటికి టెండర్ ప్రక్రియను పూర్తిచేసిన ఇంజనీరింగ్ విభాగం కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించింది. పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ మొక్కుబడిగా పనులను ప్రారంభించాడు. ఐదేండ్ల కాల వ్యవధిలో రూ.1.2 కోట్ల పనులను కూడా చేయలేదు. దీంతో ఆగ్రహించిన అప్పటి ప్రజాప్రతినిధులు, స్థానికులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో 2013 సంవత్సరంలో కాంట్రాక్టును రద్దు చేసి పెనాల్టీ విధించారు. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో ఉన్న కెపిహెచ్‌బి కాలనీ అప్పటి దివంగత ఎంఎల్‌ఏ పి.జనార్ధన్‌రెడ్డి హయాంలో శ్రీకారం చుట్టిన పనులు తరువాత విష్ణువర్ధన్‌రెడ్డి ఎంఎల్‌ఏగా ఉన్న సమయంలో కూడా పూర్తి కాలేదు. ఆ తదుపరి కెపిహెచ్‌బి కాలనీ కూకట్‌పలి నియోజకవర్గంలో చేరింది. అప్పుడు ఎమ్మెల్యేగా లోక్‌సత్తా నేత జయప్రకాష్‌నారాయణ కాలంలో కూడా స్టేడియం పూర్తి కాలేదు. 2014లో మాధవరం కృష్ణారావు ఎంఎల్‌ఏగా గెలిచిన అనంతరం చొరవ తీసుకుని ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ఇండోర్ స్టేడియానికి అవసరమైన రూ.4కోట్ల నిధులను మంజూరు చేయించారు. అనంతరం తిరిగి ఇండోర్ స్టేడియం పనుల కోసం 2016 ఫిబ్రవరిలో కొత్తగా టెండర్లు పిలిచి మరో కాంట్రాక్టు ఏజెన్సీకి అప్పగించారు. మళ్లీ కదలిక మొదలైంది. ఇండోర్‌స్టేడియం నిర్మాణ పనుల బాధ్యతను జిహెచ్‌ఎంసి ప్రాజెక్టు విభాగానికి అప్పగించారు. దీంతో కొంతకాలంపాటు పనుల్లో వేగం పెరగడంతో స్టేడియం ఓ రూపం సంతరించుకుంది. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వం వెరసి మళ్లీ పనుల్లో వేగం మందగించి స్టేడియం కమ్ స్విమ్మిం గ్‌పూల్ నిర్మాణం పనులు కొలిక్కి రాకుండాపోయాయి. అప్పటికి కృష్ణారావు టర్మ్ కూడా పూర్తయింది. ఇండోర్ స్టేడియం నిర్మాణంలో భాగంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో అతిపెద్ద స్విమ్మింగ్‌పూల్, నీటిని శుద్ధి చేసే మిషన్ రూం, ఆఫీస్‌రూం, మహిళలు, పురుషలకు వేర్వేరుగా వసతిగృహాలు, డ్రెస్ చేంజ్‌రూం, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి. అలాగే మొదటి అంతస్తులో 4బ్యాట్మెంటన్ కోర్టులు, క్యారం కోర్టు, జిమ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. రెండో అంతస్తులో అంతస్తులో టెన్నీస్ కోర్టులు, ఇండోర్ గేమ్స్‌కు సంబంధించిన మరిన్ని క్రీడలు ఆడుకునేలా ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలి. వెరసి గత పన్నెండేళ్లుగా సాగుతున్న అధునాతన ఇండోర్‌స్టేడియం కమ్ స్విమ్మింగ్‌పూల్ నిర్మాణ పనులు అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. ఇండోర్‌స్టేడియం భవనం పూర్తయినట్లు ముఖ ద్వారం ఎలివేషన్ రంగులు వేసిన అధికారులు అంతర్గత పనులను మర్చిపోయారు భవనం మూడు వైపులా ఇప్పటికీ ప్లాస్టింగ్ కూడా పూర్తి కాలేదు. స్విమ్మింగ్‌పూల్‌కు కావాల్సిన నీటి వసతిపై అధికారులకే అంచనా లేదు. దానికి కావాల్సిన మోటార్లు, మిషనరీ ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. సిమ్మింగ్‌పూల్‌కు గతంలో వేసిన టైల్స్ పెచ్చులూడి కనిపిస్తున్నాయి. మొదటి, రెండో అంతస్తులో ఏర్పాటు కావాల్సిన వసతి గదుల్లో ఫ్లోరింగ్ పనులు ఇంకా పూర్తి కాలేదు. బ్యాట్మెంటెన్ కోర్టులు, షెటిల్ కోర్టులకు సంబంధించి షెడ్డు అసంపూర్తిగా వదిలేశారు.



ఎమ్మెల్యే మాధవరం ఆగ్రహం

కూకట్‌పల్లి ఎమ్మెల్యేగా రెండోసారి గెలుపొందిన మాధవరం కృష్ణారావు ఇండోర్‌స్టేడియం పనులను సోమవారం పరిశీలించి జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పని చేయలేకపోతే బదిలీ చేసుకుని వెళ్ళిపోవాలని, తమ పరువు తీయొద్దని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను ప్రత్యేక చొరవ తీసుకుని 4కోట్లు మంజూరుచేయించినా ఇంత వరకు ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారని నిలదీశారు. ఈ నేపథ్యంలో మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ శంకరయ్య, మూసాపేట ఉపకమిషనర్ మమత, ఎస్‌ఈ, ఈఈలతో కలిసి ఇండోర్‌స్టేడియం నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు నడుస్తున్న తీరుపై వారు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్టేడియం స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు.

రెండు నెలల్లో స్విమ్మింగ్‌పూల్ అందుబాటులోకి

'ఇండోర్‌స్టేడియం కమ్ స్విమ్మింగ్‌పూల్ నిర్మాణ పనులు అనివార్య కారణాల వల్ల ఆలస్యమయ్యాయి. 2016లో జిహెచ్‌ఎంసి ప్రాజెక్టు విభాగానికి పనులు అప్పగించారు. కొత్తగా కాంట్రాక్టర్ అప్పగించి పనులు చేపడుతున్నారు. మరో రెండు నెలల్లో ఇండోర్‌స్టేడియం గ్రౌండ్ ఫ్లోర్‌లోని స్విమ్మింగ్‌పూల్‌ను అందుబాటులోకి తెస్తాం. షెటిల్‌కోర్టు, బ్యాట్మెంటన్ కోర్టు నిర్మాణ పనులకు సంబంధించి అదనపు వ్యయం కోసం అనుమతులు తీసుకుని చేయాల్సి ఉంది' అని జిహెచ్‌ఎంసి ప్రాజెక్టు విభాగం డిఇ కార్తీక 'మనతెలంగాణ'కు తెలిపారు.





'నాసా'కు ఎంపికైన తెలంగాణ విద్యార్థులు

50శాతం ఖర్చు భరించేందుకు స్కూల్ యజమాన్యం నిర్ణయం

మనతెలంగాణ/మణుగూరు: మణుగూరు పట్టణం గుట్టమల్లారంలోని గౌతమ్ మోడల్‌స్కూల్, శ్రీచైతన్య కరికులం విద్యార్థులు, అమెరికా అంతరిక్ష పరిశోధన కేంద్రం (నాసా)లో రెండు ప్రాజెక్టుల పరిశోధనలకు ఎంపికయ్యారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతి సంవత్సరం నాసా, విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు పరీక్షలు నిర్వహిస్తుంది. ప్రపంచంలోని వివిధ దేశాల నుండి విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారు. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన పరిశోధనలకు, గౌతమ్‌మోడల్, శ్రీచైతన్య కరికులం విద్యార్థులు 10మంది ఎంపికయ్యారు. వీరిలో నలుగురు బాలికలు, ఆరుగురు బాలురు ఉన్నారు. ఎం.చరణ్య, డి.శ్రీవర్షిణి, డి.రుత్విక్, సుమేష్‌లు 9వతరగతి చదువుతుండగా, ఎ.రసగ్న, పి.భవ్యశ్రీ, బి.నాగహేమంత్, బి.మేగనాథ్‌లు 8వతరగతి నుండి ఎంపిక కాగా, కె.వివేక్, మిరియాల రోహిత్, 7వతరగతి నుండి, జె.హర్షిక్ 6వ తరగతి నుండి ఎంపికయ్యారు. నాసాకు ఎంపికైన విద్యార్థులను పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రత్యేకంగా అభినందించారు. నాసానుండి అందిన ధృవ పత్రాలను విద్యార్థులకు అందించారు. మరోవైపు విద్యార్థుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు అమెరికాకు వెళ్లి తిరిగి వచ్చేందుకు అవసరమయ్యే పాస్‌పోర్టు, వీసా రవాణా ఖర్చు రూ.రెండు లక్షల్లో 50శాతం భరించేందుకు యజమాన్యం ముందుకు వచ్చిందని పాఠశాల డీన్ నరేష్ తెలిపారు.



ట్రావెల్



శ్రీహరిధామం శ్రీరంగం

ఆళ్వారుల దివ్వ ప్రబంధాలకూ, రామానుజుని శ్రీ వైష్ణవ సిద్ధాంతానికి పట్టుగొమ్మగా నిలిచిన పవిత్ర వైష్ణవ క్షేత్రం శ్రీరంగం. ఇక్కడున్న శ్రీరంగనాథుడి ఆలయం 'ఇండియన్ వాటికన్'గా పేరు పొందింది. వైష్ణవ ఆలయాల్లోకెల్లా ఇది పెద్దది. భారత దేశంలో ఉన్న 108 దివ్య దేశాలలో అగ్రగణ్యమైనదిగా ఇది విరాజిల్లుతోంది. శ్రీరంగనాథుడు రంగనాయకి అమ్మవారితో కొలువైయున్న ఈ దివ్యక్షేత్రం.. తమిళనాడులోని తిరుచ్చికి ఆనుకుని ఉండే ఉభయ కావేరీ నదుల మధ్యన విలసిల్లుతోంది.

భారతదేశంలోని అతిపెద్ద ఆలయ సంకీర్ణాలలో ఒకటైన శ్రీరంగం ఆలయం..156 ఎకరాల విస్తీర్ణంతో.. 4 కిలోమీటర్ల పొడవైన ప్రాకారంతో భాసిల్లుతున్న ఈ ఆలయం ప్రపంచంలో పూజాదికాలు జరిగే అతిపెద్ద హిందూ దేవాలయంగా ఖ్యాతిగాంచింది. కావేరీ నది, దాని ఉపనది కొలిదం మధ్యలో విస్తరించిన శ్రీరంగం ఒక ద్వీపంలా ఉంటుంది. శ్రీరంగ పట్టణంలో దేవాలయం ఉండడం కాక.. శ్రీరంగం దేవాలయంలోనే పట్టణం ఉండటం దీని ప్రత్యేకతగా చెప్పవచ్చు.

భారతదేశంలో ఏడు ప్రాకారాలతో నిర్మితమైన గుడి ఇదొక్కటే. ఈ ఏడు ప్రాకారాలు యోగాలో ఏడు కేంద్రాలుగా వైష్ణవులు భావిస్తుంటారు. ఏడు ప్రాకారాలతో నిర్మితమైన ఈ ఆలయాన్ని మొదటిసారి పదో శతాబ్దంలో నిర్మించగా.. అల్లాఉద్దీన్ ఖిల్జీ ఢిల్లీ సుల్తానుగా ఉన్నప్పుడు ఈ ఆలయంపై దాడి చేసి ధ్వంసం చేశాడు. ఆ తరువాత 1771వ సంవత్సరంలో ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు. అయితే ప్రస్తుతం ఉండే రంగనాథ ఆలయాన్ని 17వ శతాబ్దంలో నాయక రాజులు పునర్నిర్మించారు. దీని దక్షిణ మహాద్వారం 1987లో పూర్తి చేశారు.

ఆలయంలోని అపూర్వ మంటపాలు, కట్టడాలు 17, 18 శతాబ్దాలలో నిర్మాణమయ్యాయి. శ్రీరంగంలో మొత్తం 21 గోపురాలున్నాయి. వేయి స్తంభాల మండపం, చిన్న చిన్న నీటి కొలనులతో ఈ ఆలయం అతి సుందరంగా ఉంటుంది. హిందుయేతరులను రెండవ ప్రాకారం వరకు మాత్రమే అనుమతిస్తారు.

ద్రావిడ శైలిలో నిర్మాణం జరుపుకున్న ఈ ఆలయం అడుగడుగునా భక్తులను, పర్యాటకులను పారవశ్యంలో ముంచెత్తుతుంది. ఆలయంలోకి ప్రవేశించే ప్రధాన ద్వారాన్ని రాజగోపురం లేదా రాయల్ టెంపుల్ టవర్ అని పిలుస్తారు. ఇది 237 అడుగుల ఎత్తు ఉంటుంది. మొదటిప్రాకారంలో ఉండే గోపురాన్ని నాజికెట్టన్ గోపురం అంటారు. ఇరువైపులా ఉండే ప్రతిమలను శంఖనిధి, పద్మనిధిగా పిలుస్తారు. ఈశాన్యభాగంలో యాగశాల, తొండమాన్ మండపం ఉంటాయి. మూడవప్రాకారంలో కార్తికేయ గోపురం, గరుడ మండపం ఉంటాయి. ఆలయంలో అతి సుందరమైన మండపమిది. దీనికి తూర్పువైపున చంద్రపుష్కరిణి ఉంది.

నాల్గవ ప్రాకారంలో వేణుగోపాలస్వామి ఆలయం ఉంటుంది. ఇక్కడి గోడలన్నీ అందమైన శిల్పాలతో నిండి ఉంటాయి. వీణ వాయిస్తున్న స్త్రీ, పక్కనే రామచిలుక ఉండే శిల్పాన్ని చూసి ఎవరైనా సరే మంత్రముగ్ధులవుతారు. ఈ ప్రాకారంలోనే ప్రదర్శన శాల ఉంది.

శ్రీరంగంకు వచ్చినవారు తప్పక చూడాల్సిన ప్రదర్శన శాల ఇది.. ఎన్నో అమూల్యమైన వస్తువులు ఇందులో భద్రపరచబడి ఉన్నాయి. దీన్ని వెల్లయిగోపుర మని పిలుస్తారు. దక్షిణ భాగంలో శేషరాయర్ మండపం ఉంటుంది ఈ మండపానికి ఎదురుగా వేయి స్తంభాల హాలు ఉంటుంది. ఇందులో దేవతల ప్రతిమలు ఉంటాయి.



ఐదవ ప్రాకారంలో మనవాల మమునిగల్ దేవాలయం ఉంది. చోళసంస్కృతితో ఇది నిర్మితమైంది. ఆరవ ప్రాకారంలో నాలుగు గోపురాలుంటాయి. దానిలో తూర్పువైపున ఉండే గోపురం 10వ శతాబ్దం నాటి వైభవాన్ని, నైపుణ్యాన్ని కళ్లకు కట్టినట్టుగా ఉంటుంది.

గోపురాల్లోని ఏడవ ప్రాకారం అసంపూర్తిగా ఉంది. దీన్ని రాయగోపురం అని పిలుస్తారు. రంగనాథస్వామి కొలువై ఉన్న గర్భగుడి పైభాగం విమానం ఆకృతిలో ఉంటుంది. దీనికి పూర్తిగా బంగారు తాపడం చేశారు. తూర్పున ఉన్న గోపురంలో ముఖ్యమైన దేవుడిని ప్రతిష్టించారు. దీర్ఘచతురస్రాకారంగా ఉండే ఈ పీఠమే మొత్తం దేవాలయానికి గర్భగుడిగా, మూల స్థానంగా ప్రాచుర్యంలో ఉంది. ఈ అతిపెద్ద ద్రవిడ దేవాలయ గర్భాలయంలో విష్ణుమూర్తి ఆదిశేషుడిపై పక్కకి ఒరిగి శయనించిన భంగిమలో దర్శనమిస్తాడు. శ్రీరంగనాథుని ఆలయ పరిధిలోనే మరికొన్ని సన్నిధానాలు, ఉపసన్నిధానాలున్నాయి. అందులో థాయార్ సన్నిధి, చక్రథజవార్ సన్నిధి, ఉదయ వార్ లేదా రామానుజర్ సన్నిధి, గరుడాళ్వార్ సన్నిధి, ధన్వంతరి సన్నిధి, హయగ్రీవర్ సన్నిధులను దర్శించుకోవచ్చు. రంగ విలాస మండపంలో గోదాదేవి అయిన ఆండాళ్ సన్నిధి ఉంది. దేవస్థానం ఎదురుగా గల ప్రదర్శన శాలలో పురాతన శిల్పాలు, నాణాలు, రాగి పాత రాలు తాళాలు విచిత్ర మైన బొమ్మలు ఉన్నాయి.

> **తొమ్మిది రోజుల వేడుకిది. అలాగే, వైకుంఠఏకాదశి నాడు మూల విరాట్‌కు 'ముత్యాల అంగీ' సమర్పిస్తారు. పుష్యమాసంలో చేసేది 'తై 'మకర సంక్రాంతి. మాఘ మాసంలో 'మాశి' తొమ్మిది రోజులు చేస్తారు.**

ఉత్సవాలు, పండుగలు: ఇక్కడ ప్రతి దినం ఏదో ఒక ఉత్సవం జరుగుతుంది. చైత్ర మాసంలో విరుప్పాన్ ఉదయార్ జరిపించిన ఉత్సవం పది రోజులు జరుగుతుంది. తొమ్మిది రోజులు రథోత్సవం నిర్వహిస్తారు. పౌర్ణమి నాడు కావేరి నదిలో 'గజేంద్ర మోక్షం'ఉత్సవాన్ని చేస్తారు. వైశాఖంలో సుదర్శన చక్ర దేవాలయంలో వసంతోత్సవం జరుపుతారు.

శ్రావణంలో జేష్టాభిషేకం అనే తిరుమంజనం చేస్తారు. ఈ సందర్భంగా కవచాలు తీసేసి చేస్తారు. ఈ రోజు నుంచి నలభై రోజులు మూల విరాట్ ముఖ దర్శనం మాత్రమే ఉంటుంది. తిరుమంజనం జరిగిన మర్నాడు 'తిరుప్పావడై' చేస్తారు. ఆశ్వయుజంలో 'ఐప్పషి'ఉత్సవం చేస్తారు. ఊయల ఊపటం దీనిలో ప్రధానాంశం. తొమ్మిది రోజుల వేడుకిది. అలాగే, వైకుంఠఏకాదశి నాడు మూల విరాట్‌కు 'ముత్యాల అంగీ' సమర్పిస్తారు. పుష్యమాసంలో చేసేది 'తై 'మకర సంక్రాంతి. మాఘ మాసంలో 'మాశి' తొమ్మిది రోజులు చేస్తారు.

రవాణ సదుపాయం: శ్రీరంగం దివ్య క్షేత్రం తమిళనాడులోని తిరుచరాపల్లికి 7 కి.మీ దూరంలో ఉంది. ఇక్కడకు చేరుకోవడానికి చెన్నై నుంచి తిరుచరాపల్లి వరకు వచ్చి ఈ క్షేత్రానికి చేరుకోవచ్చు. దేశంలోని అన్ని ప్రధాన నగరాలతో తిరుచరాపల్లి అనుసంధానించబడి ఉంది. అలాగే విమానంలో ప్రయాణించే వారికి ఇక్కడ తిరుచరాపల్లి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ఉంది.

భోజన, వసతి సదుపాయాలు: శ్రీరంగంలో భోజన, వసతి సదుపాయాలకు ఎలాంటి ఇబ్బంది లేదు. అనేక సత్రాలు, హోటళ్ళు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.

ట్రావెల్ కౌన్సిలింగ్

*** అజంతా గుహలు ఎక్కడున్నాయి? వాటినెలా చేరుకోవాలి?**

ఎ. ఉదయ్, తాటిపాక

అజంతా గుహలు మహారాష్ట్రలోని అజంతా అనే గ్రామంలో ఉన్నాయి. ఈ గ్రామం ఔరంగాబాద్ నగరానికి సుమారు 110 కి.మీ దూరంలో ఉంది. ఔరంగాబాద్ జిల్లాలో ఉన్న ఈ గుహలు అపురూపమైన చారిత్రక సంపదగా అభివర్ణిస్తారు. వీటిని సుమారుగా క్రీ.పూ. రెండవ శతాబ్దం నాటివని చెబుతారు. ఈ గుహలలో ఎక్కువగా బౌద్ధ మతానికి చెందిన శిల్పాలు, చిత్రాలు దర్శనమిస్తాయి. ఇక్కడున్న కొన్ని శిల్పాలు తెరవాడ సంప్రదాయంలో, మరికొన్ని మహాయాన సంప్రదాయంలో దర్శనమిస్తాయి. ఈ చిత్రాల్లో బుద్ధుడు, ఇతర బోధిసత్వుల జీవితాలు, జాతక కథలు అద్భుతంగా చిత్రీకరించారు.



*** ప్రసిద్ధ పర్యాటక క్షేత్రం గణపతిపూలె ఎక్కడుంది? దాని విశేషాలేంటి?**

ఆర్. సునంద, వరంగల్

ఈ దివ్య క్షేత్రం మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో ఉంది. మనోహరమైన కొంకణ్ ప్రాంతంగా ప్రసిద్ధి చెందిన ప్రాంతమిది. పర్యాటకులకు ఓ అద్వితీయమైన అనుభూతులను అందించే ఈ దివ్య క్షేత్రాన్ని చేరుకోవడానికి పూణె వరకు బస్సు లేదా రైలులో వచ్చి అక్కడ నుంచి 350 కి.మీ దూరంలో ఉన్న రత్నగిరికి చేరుకోవాలి. అనంతరం అక్కడ నుంచి సుమారు 40 కి.మీ దూరంలో ఉన్న గణపతిపూలెకు చేరుకోవచ్చు.

విరబూసిన ప్రకృతి అందం, ఆహ్లాదకరమైన వాతావరణం ఈ క్షేత్రం సొంతం. అరేబియా సముద్ర తీర ప్రాంతంలో ఉన్న ఈ క్షేత్రంలో పురాతన కాలంనాటి సుందర వినాయకుని ఆలయముంది. ఈ వినాయకుని ఆలయానికి సమీపంలోని మాల్గుండ్ గ్రామంలో కేశవ్ సుత్ స్మారక మందిరం ఉంది. 1866..1921 కాలానికి చెందిన కవి కేశవ్ సుత్ మహారాష్ట్ర సాహిత్యంలో చేసిన సేవలకు గుర్తుగా మహారాష్ట్ర కోకడ్ సాహిత్య పరిషత్ ఈ స్మారక మందిరాన్ని నిర్మించింది.

ఇక్కడకు సమీపంలోనే ప్రాచీన కొంకణ్ ప్రాంతముంది. కొంకణ్ టూరిజం డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ప్రాంతంలో ప్రాచీన కొంకణ్ సంస్కృతి సంప్రదాయాలను తెలిపే విధంగా ఓ ప్రదర్శన క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు.



ట్రావెల్ ఎక్స్‌పర్ట్
దాసరి దుర్గాప్రసాద్
7794096169

రామదాసు జన్మస్థలం

నేలకొండపల్లి

> తెలంగాణ రాష్ట్రం అనేక ప్రసిద్ధ ఆలయాలకు నిలయం. ఆలయాల నిలయమైన ఈ రాష్ట్రంలో చారిత్రక, పౌరాణిక గాథలతో ముడిపడి ఉన్న క్షేత్రాలు అనేకం ఉన్నాయి. ఆ పరంపరలోని మరో విశిష్ట సన్నిధానమే నేలకొండపల్లి. పేరులోనే ఓ ప్రత్యేకతను చాటుకున్న ఈ గ్రామం మహాభారత కాలం నుంచి తనదైన ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. అలా చారిత్రక గాథలకు నిలయమైన ఈ నేలకొండపల్లే సాక్షాత్తు అపర భక్తాగ్రేసరుడికి జన్మనిచ్చింది. ఆయనే కంచర్ల గోపన్న. భక్త రామదాసుగా పేరు ప్రఖ్యాతులు సాధించుకున్న గోపన్న ప్రస్తుత భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయాన్ని కట్టించిన మహా భక్తుడు.



బుద్ధ మహా స్థూపం

ఓ విశేషమైన ప్రాధాన్యాన్ని చరిత్ర పుటల్లో మిగుల్చుకున్న నేలకొండపల్లి ఖమ్మం జిల్లాలో ఉంది. నేలకొండపల్లి గ్రామం గొప్ప చారిత్రక స్థలం. మహాభారతంతో ముడిపడ్డ కథలొకవైపు, బౌద్ధ అవశేషాల తాలూకు చారిత్రక వాస్తవాలు మరొక వైపు ఈ ప్రాంతానికి ప్రాముఖ్యత నిస్తున్నాయి. ప్రశాంతమైన వాతావరణం ప్రకృతి అందాల నేపథ్యంగా ఉన్న నేలకొండపల్లి ఓ చిన్న గ్రామం. అయినప్పటికీ ఈ గ్రామం చారిత్రక, పౌరాణిక విశేషాలతో ప్రత్యేకతను సంతరించుకుంది. ఒక పక్క పుణ్య క్షేత్రంగా, మరో పక్క పర్యాటక క్షేత్రంగా కూడా అలరారుతున్న నేలకొండపల్లికి ఒక మైలు దూరంలో ఉన్న చారిత్రక ప్రదేశం విరాటరాజు దిబ్బ. ద్వాపరయుగం కాలం నాటిదిగా చెప్పబడ్తున్న ఈ దిబ్బ ప్రశాంతమైన వాతావరణంలో ఆహ్లాదకరమైన పరిసరాల నడుమ అలరారుతుంది. ఇక్కడే ఉన్న కీచక గుండం కూడా మహాభారత కథతో ముడిపడి ఉన్నట్లు తెలుస్తోంది.

పాండవులు అజ్ఞాతవాస సమయంలో విరాట నగరాన్ని పాలించే విరాట రాజు కొలువులో మారువేషాల్లో చేరారు. విరాట రాజు బావమరిది కీచకుడు సైరంధ్రి వేషంలో ఉన్న ద్రౌపదిని కామించగా, వలలుడి వేషంలో ఉన్న భీముడు కీచకుణ్ణి సంహరించాడు. ఆ విరాటనగరం ఈ ప్రాంతమేనని పౌరాణిక గాథ. మహాభారతం జరిగిందని చెబుతున్న కాలం నాటి అవశేషాలు ఇక్కడ దొరకడం విశేషం. 1977 లో జరిపిన తవ్వకాల్లో బౌద్ధ అవశేషాలు, స్థూపాలు, విగ్రహాలు దొరకడంతో ఈ ప్రాంతంలో బౌద్ధం విలసిల్లిందని రూఢి అవుతోంది. ఈ బౌద్ధ అవశేషాలు ఈ ప్రాంతాన్ని సందర్శించవచ్చే పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయి.

భక్తరామదాసు మందిరం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం నేతృత్వంలో నిర్మితమయిన ఈ ధ్యానమందిర ప్రాంగణమే ఒకప్పటి భక్తరామదాసుగా పేరెన్నికగన్న కంచర్ల గోపన్న ఇల్లు. ఆ ఇంటినే భక్తరామదాసు ధ్యాన మందిరంగా మార్చి అభివృద్ధి చేశారు.



భక్త శ్రీరామదాసు

రాజగోపాల స్వామి ఆలయం

భక్తరామదాసు ధ్యాన మందిరానికి సమీపంలో ఉన్న మరో ఆలయం రాజగోపాల స్వామి ఆలయం. రామదాసు నేలకొండపల్లిలోని రాజగోపాలస్వామి అనుగ్రహంతోనే జన్మించాడని ప్రతీతి. రామదాసు తల్లిదండ్రులు, రామదాసు ఇలవేల్పుగా ఇష్టదైవంగా ఆరాధించుకున్న దైవం శ్రీ రాజగోపాలస్వామి. నాలుగు వందల సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ఆలయం ప్రశాంతమైన వాతావరణం ప్రకృతి అందాల నడుమ అలరారుతోంది. పురాతన కాలం నాటి జ్ఞాపకాలను స్ఫురణకు తెచ్చే ఈ ఆలయ ప్రాకారాలన్నీ అలనాటి కట్టడాలను, ఆనాటి శిల్పకారుల పనితనాన్ని కళ్ళకు కట్టినట్లు చూపిస్తాయి.

భీమేశ్వర స్వామి ఆలయం: శ్రీ రాజగోపాల స్వామి ఆలయానికి సమీపంలో శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం కూడా నాలుగు వందల సంవత్సరాల క్రితం నాటిదిగా ఇక్కడి ఆధారాల ద్వారా అవగతమవుతోంది.

వేంకటేశ్వర స్వామి ఆలయం: నేలకొండపల్లిలో ఉన్న మరో పురాతన ఆలయం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం. నాలుగు వందల సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ఆలయం చూపరులను ఆకట్టుకొనే శోభతో అలరారుతోంది.

రవాణ సదుపాయం: ఖమ్మం పట్టణానికి సుమారు 15 కి.మీ దూరంలో ఖమ్మం కోదాడ రహదారిపై ఉంది. ఖమ్మం నుంచి కోదాడ, నల్లగొండ, మిర్యాలగూడ, తిరుపతి, గుంటూరు వంటి ప్రదేశాలకు వెళ్ళే బస్సులు ఇక్కడ ఆగుతాయి. ఖమ్మం లేదా కోదాడ నుంచి హైద్రాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు అందుబాటులో ఉంటాయి. ఖమ్మం నుంచి దేశంలోని అన్ని ముఖ్య ప్రదేశాలకు రైలు సౌకర్యం ఉంది.

భోజన, వసతి సదుపాయాలు: నేలకొండపల్లిలో భోజన,వసతి సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కనుక ఈ క్షేత్రాన్ని సందర్శించాలనుకునే వారు తగిన ఏర్పాట్లు చేసుకుని వెళ్ళాల్సి ఉంటుంది.

రాతిఉప్ప హోటల్!

హోటల్స్‌లో డీలక్స్ హోటల్, స్టార్ హోటల్, ఫైవ్‌స్టార్ హోటల్ ఇలా ఎన్నో రకాలైనవి చూసే ఉంటారు. కానీ ఇదొక వింత హోటల్. ఇలాంటిది ఎప్పుడూ చూసి ఉండరు. అదేంటంటే.. ఉప్పుహోటల్. అవును నిజమే. ఈ హోటల్ ఉప్పుతో తయారైంది. ఇందులో 12 పడక గదులున్నాయి. గదుల్లో మంచాలు, కుర్చీలూ ఉన్నాయి. అన్ని హోటల్లో లాగే ఇక్కడా ఫర్నీచర్ కాకుండా మరేముంటుంది అనే కదా అనుకుంటున్నారు! ఇక్కడ విశేషం ఏంటంటే అవన్నీ ఉప్పుతో చేసినవి కావడం. ప్రపంచంలో ఉప్పు దిమ్మలతో కట్టిన హోటల్ ఇదొక్కటే! ఈ హోటల్లోకి ఎవరైనా వెళ్లవచ్చు కానీ, ఒక షరతు! అదేంటో తెలుసా? ఇచ్చట గోడలు నాకరాదు! అని ముందే చెబుతారు. బొలివియా దేశంలోని ఉయుని పట్టణం దగ్గర ఈ లవణ భవనం ఉంది. దీని పేరు పాలాసియో డి సాల్. అంటే స్పానిష్ భాషలో ఉప్పు ప్యాలెస్ అని అర్థం. దీని నిర్మాణానికి 15 అంగుళాల ఉప్పు పలకలను ఏకంగా 10 లక్షలు తయారు చేసి వాటితో కట్టారు. ఇందులో అలంకరణ కోసం పెట్టిన శిల్పాలు, కళాఖండాలు కూడా ఉప్పుతో మలిచినవే. ఇక్కడ ఉండే ఈత కొలనులో కూడా ఉప్పు నీరే ఉంటుంది. హోటల్ బయట గోల్ఫ్ కోర్స్ కూడా ఉప్పుమయమే. కానీ ఇక్కడకు వచ్చే పర్యాటకులు గోడల్ని నాకకుండా సిబ్బంది గమనిస్తూ ఉంటారు.



టిమ్ కుక్‌కు భారీ వేతనం

2018లో 12 మిలియన్ డాలర్ల బోనస్



వాషింగ్టన్: టెక్నాలజీ దిగ్గజం యాపిల్ సిఇఒ(చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్) టిమ్ కుక్ 2018 ఆర్థిక సంవత్సరంలో భారీ వార్షిక బోనస్‌ను అందుకున్నారు. 2011లో టిమ్‌కుక్ యాపిల్ సిఇఒగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఇంత భారీ వేతనం తీసుకోవడం ఇదే తొలిసారి. ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్ రికార్డు స్థాయిలో రెవెన్యూ, లాభం ప్రకటించిన తర్వాత ఈ బోనస్‌ను అందుకోగా, మరోవైపు సంస్థ మార్కెట్ విలువ మాత్రం తాత్కాలికంగా 1 ట్రిలియన్ డాలర్లకు పడిపోయింది. అయితే టిమ్‌కుక్ మాత్రం సంవత్సరం ముగింపు సెప్టెంబర్ 29నాటికి 12 మిలియన్ డాలర్ల బోనస్‌ను అందుకున్నారు. ఈమేరకు కాలిఫోర్నియాకు చెందిన కంపెనీ ఫైలింగ్‌లో పేర్కొంది. అంటే భారత్ కరెన్సీలో రూ.84.41 కోట్ల విలువ ఉంటుంది. దీంతో పాటు 3 మిలియన్ డాలర్ల వేతనం, 121 మిలియన్ డాలర్లు విలువ చేసే వాటాలు పొందారు. మొత్తం రూ.136 మిలియన్ డాలర్లు అవుతుంది. 6,82,000 డాలర్లు ఇతర పరిహారాల కింద చెల్లించినట్లు యాపిల్ తెలిపింది. గతేడాది యాపిల్ ఉత్పత్తుల విక్రయాలు భారీగా పెరిగినందువల్లే బోనస్ కూడా ఎక్కువగా ఇచ్చినట్లు వెల్లడించింది. 2018లో 265.6 బిలియన్ డాలర్ల మేర విక్రయాలు జరిపామని, కార్యకలాపాల ద్వారా కంపెనీకి 70.9 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చిందని సంస్థ పేర్కొంది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 16 శాతం ఎక్కువగా ఉంది. అందుకే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల వేతనం, బోనస్‌లను పెంచామని యాపిల్ ఫైలింగ్స్‌లో పేర్కొంది.

బ్యాంక్ ఆఫ్ బరోడా కనీస బ్యాలెన్స్ రెట్టింపు



న్యూఢిల్లీ: బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) ఖాతాదారుల కనీస బ్యాలెన్స్‌లను పెంచింది. సేవింగ్ ఖాతాదారులు తమ ఖాతాల్లో నిర్వహించే కనీస బ్యాలెన్స్‌ను రెట్టింపు చేసినట్టు బిఒబి ప్రకటించింది. నగర, మెట్రో, సెమీ అర్బన్ బ్రాంచ్‌ల్లో కనీస నిల్వను రూ.1000 నుంచి రూ.2000కు పెంచుతున్నట్టు బ్యాంక్ పేర్కొంది. అలాగే బ్యాంకు గ్రామీణ ప్రాంతాల్లోని బ్రాంచ్‌ల్లో కనీస నిల్వను రూ 500 నుంచి రూ 1000కి పెంచింది. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి నూతన మినిమం బ్యాలెన్స్‌లు అమల్లోకి వస్తాయని బ్యాంకు ప్రకటించింది. బ్యాంక్ ఆఫ్ బరోడాలో దేనా బ్యాంక్, విజయా బ్యాంక్‌లు విలీనం అవుతున్న విషయం తెలిసిందే. అయితే విలీనమైన తర్వాత ఈ రెండు బ్యాంకుల పొదుపు ఖాతాలకూ ఇవే నిబంధనలు వర్తించనున్నాయని బిఒబి తెలిపింది. కనీస బ్యాలెన్స్ నిర్వహణను వంద శాతం మేర బ్యాంకు పెంచినప్పటికీ కనీస నిల్వను నిర్వహించని ఖాతాదారులపై విధించే జరిమానాను పెంచలేదు. ఇది ఖాతాదారులకు కొంత ఊరట కలిగించే విషయం.

స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	36212.91	231.98	(+0.64%)
నిఫ్టీ	10855.15	53	(+0.49%)

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	70.05
యూరో	80.25
బ్రిటిష్ పౌండ్	89.22
ఆస్ట్రేలియన్ డాలర్	50.17
కెనెడియన్ డాలర్	52.93
సింగపూర్ డాలర్	51.63
స్విస్ ఫ్రాంక్	71.37
చైనీస్ యువాన్	10.10
మలేషియన్ రింగిట్	16.88
న్యూజిలాండ్ డాలర్	46.85
హాంకాంగ్ డాలర్	8.86
జపనీస్ యెన్	0.64
కువైట్ దినార్	228.93
సౌతాఫ్రికన్ రాండ్	4.98

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	30510	32631.02	0.46%
ముంబై	31280	33454.55	0%
ఢిల్లీ	31100	33262.03	7.04%
కోల్‌కతా	31570	33764.71	0.38%
కేరళ	29600	31657.75	0%
బెంగళూరు	29820	31893.05	0%
హైదరాబాద్	30510	32631.02	0.46%
గల్ఫ్	137.68	147.25	1.38%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42600.00
ముంబై	₹ 42600.00
ఢిల్లీ	₹ 42600.00
కోల్‌కతా	₹ 42600.00
హైదరాబాద్	₹ 42600.00



వృద్ధిలో భారత్ జోరు



- మరికొన్ని సంవత్సరాలు కొనసాగుతుంది..
- 2018-19లో వృద్ధి రేటు 7.3 శాతం
- 2019-20లో 7.5 శాతం : ప్రపంచ బ్యాంక్ అంచనా

న్యూఢిల్లీ: అత్యంత వేగంగా అభివృద్ధి దేశాల్లో భారత్ తన సత్తా చాటుతోంది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో భారత్ జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) వృద్ధి రేటు 7.3 శాతం నమోదు కానుందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. ఆ తర్వాతి వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో 7.5 శాతం వృద్ధి రేటును చూపనుందని వెల్లడించింది. పెట్టుబడులు, వినియోగంలో పెరుగుదలే వృద్ధిలో పురోగతికి కారణమని తెలిపింది. మరికొన్ని సంవత్సరాల పాటు భారత్ ఇదే విధమైన వృద్ధి రేటును కొనసాగిస్తుందని గ్లోబల్ ఎకనామిక్ ప్రాస్పెక్ట్స్‌ని విడుదల చేసిన వరల్ బ్యాంక్ వెల్లడించింది. అదే విధంగా ఈ సంవత్సరంలో ప్రపంచ వృద్ధి రేటు 3 శాతం నుంచి 2.9 శాతానికి తగ్గనుందని, ప్రస్తుతం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి మందగించిందని వరల్డ్ బ్యాంక్ ప్రతినిధి తెలిపారు. చైనా ఆర్థిక వృద్ధి 2019, 2020 సంవత్సరాల్లో 6.2 శాతం, 2021లో 6 శాతంగా ఉండనుందని నివేదికలో ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. జిఎస్‌టి, నోట్ల రద్దు కారణంగా 2017 భారత ఆర్థిక వ్యవస్థ ఒడుదొడుకులకు గురై వృద్ధిరేటు 6.7శాతానికి పరిమితమైనట్లు పేర్కొంది. దేశీయ వృద్ధిలో గతేడాది భారత్ కంటే చైనా ముందుందని, అయితే ఈ ఏడాది మాత్రం చైనా వృద్ధిరేటు మందగిస్తుందని అంచనా వేసింది. 'వినియోగంలో పెరుగుదల, పెట్టుబడులతో భారత్ వేగంగా వృద్ధి చెందుతోంది. 2018–19 ఆర్థిక వ్యవస్థలో ఆ దేశ వృద్ధిరేటు 7.3 శాతంగా ఉంటుందని మేం అంచనా వేస్తున్నాం. ఇక 2019–20, 2020–21 ఆర్థిక సంవత్సరాల్లో భారత వృద్ధిరేటు 7.5శాతంగా ఉండొచ్చు' అని ప్రపంచ బ్యాంక్ ప్రాస్పెకట్స్ గ్రూప్ డైరెక్టర్ అయాన్ ఖోస్ తెలిపారు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ 2019–20 ఆర్థిక సంవత్సరంలోనూ తన స్థానాన్ని నిలుపుకోనుందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. 2017–18లో నమోదైన భారత్ వృద్ధి రేటు 6.7 శాతం కాగా, ఈ ఆర్థిక సంవత్సరం 7.3 శాతానికి చేరవచ్చని, వచ్చే సంవత్సరం 7.5 శాతం వృద్ధి రేటు నమోదు కావచ్చని పేర్కొంది. ఇదే సమయంలో దక్షిణాసియాలో పలు దేశాల్లో ఎన్నికలు జరగనున్నాయని గుర్తు చేసిన వరల్ బ్యాంక్, రాజకీయ అనిశ్చితి ఏర్పడవచ్చని తెలిపింది. ఈ కారణంతో వృద్ధి రేటు మందగించే అవకాశాలున్నాయని హెచ్చరించింది. ఇక ప్రపంచ సగటు వృద్ధి తగ్గవచ్చని అంచనా వేసింది. ఉత్పత్తి రంగం నెమ్మదించడమే ఇందుకు కారణమని అభిప్రాయపడింది.

మళ్లీ 36,000 దాటిన సెన్సెక్స్

నష్టాల నుంచి తేరుకుని.. ఆఖరి గంటలో ర్యాలీ



ముంబై: దేశీ స్టాక్‌మార్కెట్లు వరుసగా నాలుగో రోజు లాభాలను నమోదు చేశాయి. ఆఖరి సమయంలో అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి వెళ్లినప్పటికీ ఆ తర్వాత మళ్లీ వెంటనే పుంజుకున్నాయి. వాణిజ్య వివాద చర్చలను మూడో రోజూ కొనసాగించేందుకు అమెరికా, చైనా ఆసక్తి చూపిన నేపథ్యంలో సానుకూల సంకేతాలు కనిపించాయి. యూరోపియన్ స్టాక్‌మార్కెట్లు కూడా హుషారుగా ప్రారంభంకావడంతో సెంటిమెంటుకు బలపడిందని నిపుణులు పేర్కొన్నారు. సెన్సెక్స్ 36,250 నుంచి 35,863 పాయింట్ల మధ్య కదలాడింది. మార్కెట్ ముగిసేసరికి సెన్సెక్స్ 232 పాయింట్లు పెరిగి 36,213 పాయింట్ల వద్ద నిలిచింది. ఇక నిఫ్టీ 53 పాయింట్లు పెరిగి 10,855 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఇలో ఎఫ్ఎంసిజి. ప్రైవేట్ బ్యాంక్స్, రియల్టీ, ఆటో స్వల్పంగా పుంజుకున్నాయి. మెటల్స్ 1.2 శాతం వెనకడుగు వేసింది. ప్రధానంగా యాక్సిస్ బ్యాంక్, ఐటిసి, టాటా మోటార్స్, యుపిఎల్, హెచ్‌డిఎఫ్‌సి, ఐబి హౌసింగ్, ఇండస్‌ఇండ్, ఎయిర్‌టెల్, డాక్టర్ రెడ్డీస్ షేర్లు 3 నుంచి 1 శాతం మధ్య లాభపడ్డాయి. బిఎస్ఇలో ట్రేడైన షేర్లలో 1,155 లాభపడగా, 1,442 షేర్లు నష్టాలతో ముగిశాయి. మంగళవారం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పిఐలు) రూ.534 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. దేశీ ఫండ్స్(డిఐఐలు) రూ.698 కోట్లకుపైగా విలువైన స్టాక్స్ కొనుగోలు చేశాయి.

ఎయిర్ ఇండియా ఆస్తుల విక్రయంతో రూ.7 వేల కోట్లు

న్యూఢిల్లీ: వచ్చ ఆర్థిక సంవత్సరం(2019–20) ద్వితీయార్థంలో ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాలో కొన్ని ఆస్తుల విక్రయం ద్వారా 1 బిలియన్ డాలర్లు (రూ.7000 కోట్లు) సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ద్వితీయార్థంలో ఎయిర్ ఇండియా వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను ప్రారంభించనుంది. ఎయిర్ ఇండియా అనుబంధ సంస్థ, ఇతర ఆస్తులను విక్రయించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఎయిర్ ఇండియా దాదాపు రూ.55 వేల కోట్ల అప్పులు ఉన్నాయి. గతేడాది నవంబర్‌లో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఆధ్వర్యంలోని కమిటీ ఎయిర్ ఇండియాకు రూ.29 వేల కోట్ల రుణాన్ని బదిలీ చేసేందుకు అనుమతిచ్చారు.



యస్ బ్యాంక్ కొత్త సిఇఒ కోసం జాబితా ఖరారు



న్యూఢిల్లీ: రాణా కపూర్ స్థానంలో యస్ బ్యాంక్ సిఇఒగా కొత్త సిఇఒను ఎంపిక చేసేందుకు తుది జాబితా సిద్ధమైంది. యస్ బ్యాంక్ కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సిఇఒ) కోసం చాలా కాలంగా కసరత్తు జరుగుతోంది. అయితే మొత్తానికి కొంత మందితో జాబితాను సిద్ధం చేశారని సమాచారం. అయితే జాబితాలోని సభ్యుల వివరాలను మాత్రం వెల్లడించలేదు. యస్ బ్యాంక్ సిఇఒ రాణా కపూర్ కొనసాగింపునకు ఆర్‌బిఐ వ్యతిరేకించింది. దీంతో 2019 జనవరి 31 తర్వాత కొత్తవారిని తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత నెల్లో బ్యాంకు ఛైర్మన్ అశోక్ చావ్లా పదవి నుంచి దిగిపోయారు.

26 కొత్త ఎయిర్‌క్రాఫ్ట్ స్టాండ్లు

ప్రారంభించిన జిఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్



మన తెలంగాణ/ హైదరాబాద్: జిఎంఆర్ నేతృత్వంలోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం(ఆర్‌జిఐఎ) మరో మైలురాయిని అధిగమించింది. ఈ ఎయిర్‌పోర్ట్ కొత్తగా 26 పార్కింగ్ స్టాండ్లను ప్రారంభించింది. కొత్త స్టాండ్లతో విమానాశ్రయంలో ఇప్పుడు పార్కింగ్ స్టాండ్లు 83కు చేరాయి. గతంలో ఈ సంఖ్య 57 మాత్రమే ఉన్నాయి. దీంతో ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాండ్లింగ్ సామర్థ్యం 45 శాతం వృద్ధిని సాధించింది. అలాగే కేవలం 10 నెలల్లో 65వేల చదరపు మీటర్ల అప్రాన్ ఏరియా నిర్మాణం చేపట్టింది.

ఇండస్‌ఇండ్ బ్యాంక్ లాభంలో స్వల్ప వృద్ధి

క్యూ3లో రూ.985 కోట్లతో 4.6 శాతం పెరిగిన లాభం



న్యూఢిల్లీ: ప్రైవేట్‌రంగ సంస్థ ఇండస్ ఇండ్ బ్యాంక్ బుధవారం మూడో త్రైమాసిక(అక్టోబర్–డిసెంబర్) ఫలితాలను వెల్లడించింది. ఈ ఫలితాల్లో బ్యాంక్ నికర లాభం 4.6 శాతం పెరిగింది. లాభం రూ. 985 కోట్లుగా నమోదు చేసింది. అంతకుముందు 2017లో ఇదే సమయంలో లాభం రూ.936 కోట్లుగా ఉంది. నికర వడ్డీ ఆదాయం కూడా 21 శాతం పెరిగి రూ. 2,228 కోట్లుగా ఉంది. కాగా ఇండస్ ఇండ్ బ్యాంక్ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌లో తన పెట్టుబడులను కొనసాగించింది. ప్రస్తుతం ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌లో ఇండస్ ఇండ్ బ్యాంకు పెట్టుబడులు రూ. 600 కోట్లుగా ఉన్నట్టు బ్యాంకు పేర్కొంది. అసెట్స్ క్వాలిటీ విషయంలో బ్యాంక్ కొంత తడబడిందని, మొండి బకాయిలు, నిరర్థక ఆస్తుల నిష్పత్తి గత సంవత్సరం కంటే పెరిగిందని బ్యాంకు తెలిపింది. గత సంవత్సరం మొండి బకాయిల రేషియో 1.09శాతం ఉండగా, ఈ మూడో త్రైమాసికంలో అది 1.13 శాతంగా ఉంది. ఇండస్ బ్యాంక్ మూడో క్వార్టర్ ఫలితాల వెల్లడి తరువాత బ్యాంక్ స్టాక్స్ ఒక్కసారిగా కుప్పకూలి మళ్లీ పుంజుకున్నాయి. ఫలితాల నేపథ్యంలో షేర్ విలువ 1.39 శాతం పుంజుకుని రూ. 1599కు చేరుకుంది.

రూ.33 వేలకు చేరువలో...

మూడో రోజూ పెరిగిన పసిడి ధర



ముంబై: వరుసగా మూడో రోజు బంగారం ధర పెరిగింది. బుధవారం పసిడి ధర రూ.33వేలకు చేరువైంది. బుధవారం 10 గ్రాముల బంగారం ధర రూ. 110 పెరిగి రూ. 32,800లకు చేరింది. పెళ్లిళ్ల సీజన్ దగ్గరపడుతుండటంతో స్థానిక నగల వ్యాపారుల నుంచి బంగారం కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయి. దీంతో ధర పెరిగిందని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ మూడు రోజుల్లో పసిడి ధర రూ. 300 పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో పసిడి ధర స్వల్పంగా తగ్గింది. ఔన్సు ధర 1,283.10 డాలర్లుగా ఉంది. మరోవైపు వెండి ధర కూడా బంగారం బాటలోలోనే పయనించింది. కిలో వెండి ధర ఒక్క రోజే రూ.300 పెరిగి రూ.40,100కు చేరింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో వెండి ధరలు పెరిగాయి. అయితే అంతర్జాతీయంగా ఈ లోహాల ధరలు కాస్త తగ్గుముఖం పట్టాయి. వెండి ధర ఒక ఔన్స్ 0.26 శాతం తగ్గి 15.67 డాలర్లకు చేరింది.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం%
యాక్సిస్ బ్యాంక్	672.05	652.35	670.10	650.90	19.20	2.95
ఐటిసి	291.70	284.60	290.40	284.25	6.15	2.16
హెడిఎఫ్‌సి	1,998.00	1,962.00	1,994.95	1,958.95	36.00	1.84
టాటా మోటర్స్	183.60	180.20	183.05	179.95	3.10	1.72
యుపిఎల్	767.00	753.45	764.80	752.20	12.60	1.68
భారతీ ఎయిర్‌టెల్	337.90	327.30	334.50	329.25	5.25	1.59
ఇందుసిండ్ బ్యాంక్	1,610.00	1,548.00	1,601.75	1,577.75	24.00	1.52
డా. రెడ్డీస్ ల్యాబ్	2,610.90	2,580.90	2,603.10	2,570.50	32.60	1.27
ఎయిచర్ మోటర్స్	20,397.75	19,850.00	20,291.05	20,044.65	246.40	1.23
ఇండియాబుల్స్ హెచ్ఎస్‌జి	824.70	806.00	821.75	812.55	9.20	1.13

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం%
గెయిల్	356.25	338.05	341.35	354.60	13.25	3.74
హెచ్‌పిసిఎల్	247.65	238.00	239.00	247.95	8.95	3.61
బిపిసిఎల్	351.50	338.00	340.05	351.95	11.90	3.38
యస్ బ్యాంక్	193.95	181.50	186.45	192.35	5.90	3.07
భారతీ ఇన్‌ఫ్రాటెల్	299.90	289.25	290.35	297.95	7.60	2.55
అల్ట్రాటెక్ సిమెంట్	3,934.90	3,800.00	3,817.25	3,916.30	99.05	2.53
టాటా స్టీల్	497.30	475.25	479.20	491.35	12.15	2.47
ఐఒసి	134.30	131.60	132.00	134.00	2.00	1.49
ఒఎన్‌జిసి	148.20	144.85	145.30	147.45	2.15	1.46
హీరో మోటోకార్ప్	2,985.10	2,907.00	2,937.45	2,970.30	32.85	1.11

నందమూరి తారక రామారావు నాకు అన్నయ్యలాంటి వారు. ఆయన బయోపిక్‌ను తీయడమనేది మామూలు విషయం కాదు. ఈ సినిమా చూసినప్పుడు మళ్లీ అన్నయ్య పుట్టారా? అనిపించింది. బాలకృష్ణ కొన్ని యాంగిల్స్‌లో తన తండ్రిని పోలి ఉండడమనేది ఒక అద్భుతం.

– సీనియర్ నటుడు, నిర్మాత ఎం.మోహన్‌బాబు



వరుస విజయాల మెగా ప్రొడ్యూసర్

టాలీవుడ్‌లోని అగ్ర నిర్మాతల్లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్. లెజెండరీ నటుడు అల్లు రామలింగయ్య తనయుడిగా ఇండస్ట్రీకి వచ్చిన అల్లు అరవింద్ నిర్మాతగా సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. ఈ సుప్రసిద్ధ నిర్మాత గురువారం తన పుట్టిన రోజును జరుపుకోబోతున్నారు. కెరీర్ మొదట్లో నటుడిగా కొన్ని సినిమాలు చేసిన అల్లు అరవింద్ ఆతర్వాత గీతా ఆర్ట్స్ స్థాపించి ఎన్నో విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. చిరంజీవి హీరోగా విజేత, పసివాడి ప్రాణం, అత్తకు యముడు అమ్మాయికి మొగుడు, రౌడీ అల్లుడు తదితర విజయవంతమైన చిత్రాలను ఆయన నిర్మించారు. ఇక తన కుమారుడు అల్లుఅర్జున్‌ను 'గంగోత్రి' సినిమాతో హీరోగా పరిచయం చేశారు. రామ్‌చరణ్ హీరోగా వచ్చిన 'మగధీర' సినిమాతో తెలుగు ఇండస్ట్రీ స్టామినా పెంచారు ఈ నిర్మాత. ఈ సినిమాతో తెలుగు ఇండస్ట్రీలో తొలిసారి 40 కోట్ల బడ్జెట్ పెట్టి 70 కోట్లకు పైగా వసూలు చేసిన ఘనత అల్లు అరవింద్‌కు దక్కింది. హిందీలో అమీర్‌ఖాన్ వంటి స్టార్ హీరోతో 'గజిని' సినిమా నిర్మించి 100 కోట్ల మార్కుకు శ్రీకారం చుట్టారు. ఇక తెలుగులో పవన్‌కళ్యాణ్ హీరోగా వచ్చిన 'జల్సా' సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి 1000 థియేటర్ల ట్రెండ్‌ను పరిచయం చేశారు. కేవలం మెగా హీరోలతోనే కాకుండా నాని, శర్వానంద్ వంటి యంగ్ హీరోలతో కూడా సినిమాలు నిర్మించి మంచి విజయాలను అందుకున్నారు అల్లు అరవింద్.

ఇమేజ్‌ను పెద్దగా పట్టించుకోలేదు

సీనియర్ స్టార్ వెంకటేశ్, యంగ్ స్టార్ వరుణ్ తేజ్ కాంబినేషన్‌లో దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించిన మల్టీస్టారర్ 'ఎఫ్2'. ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్ అనేది ఉపశీర్షిక. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మించిన ఈ చిత్రం ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హీరో వెంకటేశ్‌తో ఇంటర్వ్యూ విశేషాలు...



పెళ్లికి ముందు, పెళ్లికి తర్వాత..

సంక్రాంతి సందడికి తగ్గ సినిమా 'ఎఫ్2'. ఈ చిత్రం ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందిస్తుంది. ఈ సినిమాలో ఫన్, ఫ్రస్ట్రేషన్ రెండూ ఉంటాయి. పెళ్లికి ముందు, పెళ్లికి తర్వాత జీవితాలు ఎలా ఉంటాయి అనే విషయాన్ని వినోదాత్మకంగా చూపించారు దర్శకుడు అనిల్ రావిపూడి. నా గత చిత్రాలను చూసి ఈ సినిమా కథను రూపొందించారు దర్శకుడు.

కొత్తదనం నచ్చింది...

'గురు' చిత్రం తర్వాత కొంత గ్యాప్ తీసుకొని చేసిన చిత్రమిది. ఈ సమయంలో పలువురు దర్శకులు నాకు కథలు చెప్పారు. చివరికి 'ఎఫ్2' చిత్రం కుదిరింది. ఈ చిత్రంలోని కొత్తదనం నాకు బాగా నచ్చింది. అందుకే ఈ సినిమాలో నటించేందుకు ఒప్పుకున్నాను.

బాగా ఎంజాయ్ చేశాను...

వరుణ్‌తేజ్ తొలిసారిగా నటించిన కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. అతనికి కొత్త జోనర్ అయినప్పటికీ చక్కగా నటించాడు. వరుణ్‌తో కలిసి ఈ సినిమా చేస్తూ బాగా ఎంజాయ్ చేశాను. ఇక ఇప్పుడున్న యంగ్ హీరోలు తమదైన స్టైల్‌లో సినిమాలు చేస్తున్నారు.

అన్ని కమర్షియల్ అంశాలతో...

ఈ చిత్రంలో కుటుంబ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తాయి. ఇందులో కామెడీ, ఎమోషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్ సహా అన్ని కమర్షియల్ అంశాలు ఉంటాయి. ఇక నాకు మొదటి నుంచి కుటుంబ కథలు బాగా కనెక్ట్ అవుతాయి.

ఇమేజ్‌ను పట్టించుకోలేదు...

30 ఏళ్ల సినీ కెరీర్‌లో నేను ఎప్పుడు ఇమేజ్‌ను పెద్దగా పట్టించుకోలేదు. నేను చేసిన సినిమా ప్రేక్షకులకు పూర్తి వినోదాన్ని అందించాలని కోరుకుంటాను. దీన్ని దృష్టిలో పెట్టుకొని సినిమాలు చేస్తున్నాను.

నటనలో కొత్త కోణం...

కొత్త తరం దర్శకులు విభిన్నమైన సినిమాలను తెరకెక్కిస్తూ ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందిస్తున్నారు. 'గురు' చిత్రాన్ని తెరకెక్కిన దర్శకురాలు సుధా కొంగర నా నటనలోని కొత్త కోణాన్ని పరిచయం చేశారు. అలాగే ఇప్పుడు అనిల్ రావిపూడి కూడా 'ఎఫ్2'లో నన్ను కొత్తగా చూపించడం జరిగింది.

తదుపరి చిత్రాలు...

మంచి కథతో తెరకెక్కుతున్న 'వెంకీ మామ' చిత్రంలో నటిస్తున్నాను.
విభిన్న భావోద్వేగాలు, బంధాలు, విలువలతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. అలాగే పలువురు యంగ్ డైరెక్టర్లు నా కోసం స్క్రిప్ట్స్ రాస్తున్నారు.


విలక్షణ కథానాయకుడిగా..

ప్రయోగాలు చేయడంలో టాప్ హీరోలు ఇప్పుడు ముందు వరుసలో ఉంటున్నారు. బాలీవుడ్‌లో ఖాన్‌లు, బిగ్ బి చేసిన ప్రయోగాలు అన్నీ ఇన్నీ కావు. ఇక టాలీవుడ్‌లోనూ అగ్ర కథానాయకులు ఎన్నో ప్రయోగాత్మక పాత్రల్లో నటించి మెప్పిస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ కూడా విభిన్న చిత్రాల్లో నటిస్తూ విలక్షణ కథానాయకుడిగా పేరు తెచ్చుకోవాలనుకుంటున్నారు. బాహుబలి సిరీస్‌తో మ్యాకోమ్యాన్‌గా ఈ స్టార్ హీరో తనను తాను ఆవిష్కరించుకున్న తీరు మైమరపించింది. ఇందులో అమరేంద్ర బాహుబలిగా వీరోచిత పోరాటాలతో ప్రభాస్ అదరగొట్టారు. దీంతో 2000 కోట్లు వసూలు చేసిన సినిమాలో కథానాయకుడయ్యారు. ఆ వెంటనే ఆ జోనర్‌తో ఏ సంబంధం లేని కొత్త కథలను ఎంచుకొని చకచకా షూటింగులు చేసేస్తున్నారు. ప్రభాస్ నటిస్తున్న 'సాహో' భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్. ఇందులో అతని పాత్రలో బోలెడంత సర్‌ప్రైజ్ ఉంటుందని తెలిసింది. ప్రభాస్ ఓ స్పై తరహా పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తారని చెబుతున్నారు. ఇక రాధాకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జాన్' (వర్కింగ్ టైటిల్) పూర్తిగా విభిన్నమైన చిత్రం. ఇందులో లవర్‌బాయ్, కాలేజీ బాయ్‌గా ఆయన కనిపించనున్నారు. యూరప్ నేపథ్యంలోని ప్రేమ కథా చిత్రమిది. ప్రభాస్ ఖరీదైన కార్ల వ్యాపారిగా, ప్రేమికుడిగా వైవిధ్యమైన పాత్రలో కనిపిస్తారని ప్రచారమవుతోంది. అయితే 'బాహుబలి' తర్వాత చేస్తున్న ఈ వరుస ప్రయోగాలతో తన స్టార్‌డమ్‌ని ఇంకా పెంచుకుంటారా? లేదా? అన్నది ఇప్పటికైతే సస్పెన్స్. ఆగస్టులో 'సాహో' చిత్రాన్ని, ఏడాది చివరలో 'జాన్' చిత్రాన్ని విడుదల చేసేందుకు ఫిల్మ్‌మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



సమ్‌థింగ్ స్పెషల్ హారర్, కామెడీ మూవీ

ముని, కాంచన, కాంచన2 వంటి హారర్ కామెడీ చిత్రాలతో హీరోగా, దర్శకుడిగా పెద్ద సక్సెస్‌ను అందుకున్నారు రాఘవ లారెన్స్. ఇప్పుడు ఈ సిరీస్ నుంచి వస్తున్న మరో హారర్, కామెడీ చిత్రం 'కాంచన3'. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ దాదాపుగా పూర్తికావస్తోంది. ఇప్పుడు ఈ సినిమా నుంచి ఓ మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఒక శ్లోకంతో ప్రారంభయ్యే ఈ మోషన్ పోస్టర్‌లో తెల్లటి పంచె కట్టులో రుద్రాక్షలు ధరించి వైట్ హెయిర్ స్టైల్‌తో దర్జాగా కూర్చున్న రాఘవ లారెన్స్ కనిపిస్తారు. ఈ చిత్రాన్ని తెలుగులో లైట్‌హౌస్ మూవీ మేకర్స్ ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై బి.మధు సమర్పణలో రాఘవేంద్ర ప్రొడక్షన్ బ్యానర్‌లో రాఘవ నిర్మించారు. ఏప్రిల్ 18న విడుదల కానున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా బి.మధు మాట్లాడుతూ ''రాఘవ లారెన్స్ స్వయంగా అందించిన హారర్ సినిమాలన్నీ సూపర్ హిట్లే. అందులో ముని సీక్వెల్స్ మరీ స్పెష ల్. ఇప్పుడు తెరకెక్కుతున్న 'కాంచన3' చిత్రాన్ని ఏప్రిల్ 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నాము. ఈ సినిమా మోషన్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది''అని అన్నారు. రాఘవ లారెన్స్, ఓవియా, వేదిక, కోవై సరళ, కబీర్ దుహాన్ సింగ్, శ్రీమ న్, దేవదర్శిని, సత్యరాజ్, కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః వెట్రి, సర్వేష్ మురారి, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంః రాఘవ లారెన్స్.





లవ్, సస్పెన్స్ థ్రిల్లర్

చరిత అండ్ గౌతమ్ ప్రొడక్షన్స్ పతాకంపై శ్రీమంగం, శశాంక్, అవంతిక హరి నల్వా, గాయత్రి అయ్యర్ ప్రధాన పాత్రల్లో కుమార్.జి దర్శకత్వంలో తను.ఎస్ నిర్మిస్తున్న చిత్రం 'ప్రణవం'. ఈ చిత్రం షూటింగ్ పూర్తిచేసుకొని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను శరవేగంగా జరుపుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు కుమార్ మాట్లాడుతూ ''పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా పూర్తిచేసి సినిమాను విడుదలకు సిద్ధం చేస్తాం. భరతనాట్యం నేపథ్యంలో లవ్, సస్పెన్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం''అని అన్నారు. జెమిని సురేష్, నవీన, జబర్దస్త్ బాబి, దొరబాబు, సమీర తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతంః పద్మనాభ భరద్వాజ్, ఎడిటర్ః సంతోష్, ఫైట్స్ః దేవరాజ్.

గ్రామీణ నేపథ్యంలో...



మైరా అమిథి, హరీష్ వినయ్, అనిల్ పిజి రాజ్, బ్రహ్మానంద రెడ్డి తదితరులు

హరీష్ వినయ్, తనిష్క తివారి జంటగా తార క్రియేషన్స్ పతాకంపై పారిశ్రామికవేత్త బ్రహ్మానంద రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'బైలంపుడి'. అనిల్ పిజి రాజ్ దర్శకత్వంలో గ్రామీణ నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రం లిరికల్ సాంగ్ ను హైదరాబాద్‌లోని ఫిలిం ఛాంబర్‌లో బాలీవుడ్ హీరోయిన్ మైరా అమిథి చేతుల మీదుగా విడుదల చేశారు. అనంతరం మైరా అమిథి మాట్లాడుతూ ''పిల్లల దేవుడు... పల్లవితో సాగే పాట చాలా బావుంది. సినిమా మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను''అని అన్నారు. దర్శకుడు అనిల్ పిజి రాజ్ మాట్లాడుతూ ''దర్శకుడిగా ఇది నా తొలి చిత్రం. బైలంపుడి అనే గ్రామంలో జరిగే లవ్, పొలిటికల్ చిత్రమిది. ప్రతి పాత్ర ఎంతో సహజసిద్ధంగా ఉంటుంది''అని తెలిపారు. నిర్మాత బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ ''సినిమాలో అందరూ కొత్తవారైనప్పటికీ చాలా బాగా నటించారు. షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి''అని చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరో హరీష్ వినయ్, సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

నచ్చిన చోట ఎంజాయ్



అక్కినేని నాగచైతన్య సరసన 'సవ్యసాచి' చిత్రంలో నటించింది నిధి అగర్వాల్. తొలి సినిమాతోనే డ్యాన్సింగ్ డాళ్ అని పేరుతెచ్చుకుంది. ఆతర్వాత అక్కినేని అఖిల్‌తో 'మిస్టర్ మజ్ను' సినిమాలో నటిస్తోంది ఈ బెంగుళూర్ బ్యూటీ. ఈ చిత్రం ఈనెల 25న రిపబ్లిక్ డే కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమా టీజర్, పోస్టర్లు ఆకట్టుకున్నాయి. ఓవైపు టాలీవుడ్‌లో నటి స్తూనే మరోవైపు బాలీవుడ్‌లో భారీ ఆఫర్లను దక్కిం చుకుంటోంది ఈ యంగ్ బ్యూటీ. తాజాగా 'ఇక్కా' అనే హిందీ చిత్రంలో నటించే అవకాశాన్ని అందు కుంది. ఇక తాజాగా నిధి అగర్వాల్ ఆహార అలవా ట్లకు సంబంధించిన వీడియో ఒకటి లైవ్‌లోకి వచ్చింది. ఆమె స్వయంగా దీనిని ఇన్-స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేసింది. ఓ రెస్టారెం ట్‌లో నిధి ఫిష్ ఫ్రై, కేకులను తింటూ కనిపిస్తున్న వీడియో ఇది. ఒక్క మీల్‌తో అర కేజీ బరువు పెరిగేంత ఫుడ్ వండావు! అంటూ చెఫ్‌ను పొగి డేస్తూ కామెంట్‌ను కూడా పోస్ట్ చేసింది ఈ హాట్ బ్యూటీ. గోవాలో ఈ రెస్టారెంట్ ఉందని నిధి చెప్పింది. మొత్తానికి నచ్చిన చోట నచ్చిన ఫుడ్ తింటూ బాగానే ఎంజాయ్ చేస్తోంది నిధి అగర్వాల్.

పోటీ

గురుగ్రంథ్‌సాహెబ్‌ను రచించిందెవరు?

ఎస్ లక్ష్మీనారాయణ
డైరెక్టర్, రామయ్య కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్,
8885555202

గురు అర్జున్‌దేవ్ సింగ్ (క్రీ. శ. 1581–1606)

- గురువైన సంవత్సరము 1581 సెప్టెంబర్ 1.
- మొఘల్ రాకుమారుడు ఖుస్రూకు శుభాశిస్సులు తెలిపాడు.
- అమృత్‌సర్‌లో 'స్వర్ణ దేవాలయం'ను నిర్మించాడు.
- అక్బర్‌కు సమకాలికుడు. భారత రాజకియాల్లో జోక్యం చేసుకున్న సిక్కు మత గురువు.
- సిక్కుల పవిత్ర గ్రంథ అయిన గురుగ్రంథ్ సాహెబ్ లేదా ఆదిగ్రంథ్‌ను రచించాడు.
- ప్రతి సిక్కు తన సంపాదనలో 1/10 వంతు గురువులకు ఇవ్వాలని ప్రకటించాడు. దీనినే మన్సద్ అంటారు.
- గరుఅర్జున్‌సింగ్‌ను జహంగీర్ (1606) ఉరి తీశాడు.

గురు హరగోవింద్ (క్రీ. శ. 1606–1644)

- సిక్కుల ఆరవ గురువు.
- 1595లో అర్జున్‌దేవ్ (తండ్రి), మాతాగంగా (తల్లి) అనే దంపతులకు అమృత్‌సర్‌లోని గుర్‌కీవడలీ అనే గ్రామంలో జన్మించాడు.
- గురువైన సంవత్సరము 1606 మే 25.
- తనకుతాను 'సచ్చాపాదుషా' (నిజమైన చక్రవర్తి) అని ప్రకటించుకున్నాడు.
- బహంగీర్‌ను రెండు సంవత్సరాలు జైలులో ఉంచాడు. దీంతో సిక్కులు మొఘలాయిలకు వ్యతిరేఖంగా ఆయుధాలు చేపట్టారు.
- జహంగీర్‌తో గురుహరగోవింద్ సింగ్ చేసిన యుద్ధం సాంగ్రామా యుద్ధంలో ఓడిపోయి కాశ్మీర్‌కు వలసపోయి కాశ్మీర్‌లోనే నివసించాడు.
- సిక్కులు ప్రధాన కేంద్రం (రాజధాని)ని అమృత్‌సర్ నుండి కర్తార్ (కిరాత్)పుర్‌కు మార్చాడు.

గురుహర్ రాయ్ (క్రీ. శ. 1644–61)

- ఇతను ఏడవ సిక్కు గురువు.
- 1630లో బాబాగురుదత్త (తండ్రి), మాతానిహాల్‌కౌర్ (తల్లి) అనే దంపతులకు జన్మించాడు.
- గురువు అయిన సంవత్సరము 1664 మార్చి 3.
- మొఘల్ వారసత్వ యుద్ధంలో షాజహాన్ జ్యేష్ఠ కుమారుడైన దారాషుకోను సమర్థించాడు.
- ఔరంగజేబు ఆస్థానాన్ని సందర్శించిన మొదటి గురువు.

గురుహరకిషన్ (క్రీ. శ. 1661 – 64)

- సిక్కుల ఎనిమిదవ గురువు.
- 1630లో హర్‌రాయ్ (తండ్రి), మతాకిషన్‌కౌర్ (తల్లి) అనే దంపతులకు జన్మించాడు.
- గురువైన సంవత్సరము 1661 అక్టోబర్ 6.
- అతి తక్కువ / చిన్న వయస్సులో (5 సంవత్సరాలు) సిక్కు గురువైన వారు.
- 8 సంవత్సరాల వయస్సులోనే మసూచీ వ్యాధితో ఔరంగజేబు ఆస్థానంలో మరణించాడు.

గురుతేజ్ బహదూర్ (క్రీ. శ. 64 – 75)

- సిక్కుల తొమ్మిదవ గురువు.
- 1621లో హరగోవింద్ (తండ్రి), మాలానాన్కీ (తల్లి) అనే దంపతులకు జన్మించాడు.
- గురువైన సంవత్సరము – 1665 మార్చి 20.
- ఔరంగజేబుకు సమకాలికుడైన గురుతేజ్ బహదూర్ ప్రారంభంలో కొంత కాలం మొఘలాయి ఆస్థానంలో ఉద్యోగిగా పని చేశాడు.
- ఔరంగజేబ్ ద్వారా 1675లో ఉరితీయబడిన సిక్కుమత 9వ గురువు గురుతేజ్ బహదూర్.



గురుగోవింద్ సింగ్ (క్రీ. శ. 1675 – 1708)

- 1666లో గురుతేజ్ బహదూర్ (తండ్రి), మాతాగురుజీ (తల్లి) అనే దంపతులకు పాట్నాలో జన్మించాడు.
- గురువైన సంవత్సరము 1675 నవంబర్ 11.
- తన ప్రధాన కేంద్రాన్ని కర్తార్‌పూర్ నుండి ఆనంద్‌పూర్ సాహెబ్ పంజాబ్‌కు మార్చాడు.
- 1699లో ఖల్సా (సిక్కుల సైనికదళం) ప్రారంభించాడు.
- ఖల్సా అంటే సోదరభావం, సంఘీభావంను కలిగి ఉంది 'పంచకర్మాలు' పాటించాలని నిర్ధేశించాడు.
- సిక్కులను సైనిక శక్తిగా మార్చాడు.

పంచ కర్మలు

- కిర్పణ్ – ఖడ్గం, 2) కేశ్ – జుట్టు, 3) కంగీ – దువ్వెన, 4) కర – కడియం, 5) కచ్ఛ – అంతర్‌తొడుగు.
- గురుగోవింద్ సింగ్ గుట్టం పేరు – అభానీలాఘొుడా కాగా ఇతను ఔరంగజేబుకు రాసిన చివరి ఉత్తరాన్ని – జాఫర్ అంటారు.
- గురుగోవింద్ సింగ్ ఆదిగ్రంథ్‌ను 11వ సిక్కు మతగురువుగా పేర్కొని దానికి గురుగ్రంథ్ సాహెబ్ అనే పేరు పెట్టాడు.
- సిక్కులలో 'నక్కలను పులులుగా, పిచ్చుకలను డేగలుగాను' మార్చగల శక్తి గురుగోవింద్‌సింగ్‌కు కలదు అనే విశ్వాసం కలదు.
- సిక్కులకు సైనిక నాయకుడిగా బందాబహదూర్‌ను (అసలు పేరు – లచ్ఛమన్‌దాస్) నియమించాడు.
- 1708లో గురుగోవింద్‌సింగ్‌ను మహారాష్ట్రలోని గోదావరి ప్రక్కన గల నాందేడ్ దగ్గర మొఘలు అధికారి అయిన వజీర్‌ఖాన్ ఆదేశాల మేరకు జంషీద్‌ఖాన్ మరియు వాసిన్‌బేగ్‌లు హత్యచేశారు.

బంగా బహదూర్/లాచ్‌మన్ దాస్ (1670 –1716)

- 1670లో రాజౌరి (జమ్మూకాశ్మీర్)లో జన్మించాడు. ఇతన్ని గురూభక్ష్ సింగ్ అని కూడా అంటారు.
- గురుగోవింద్ సింగ్ తర్వాత సిక్కులకు నాయకత్వం వహించాడు.
- తనకు తాను సచ్చాబాదుషాగా ప్రకటించుకొని ప్రతిసిక్కుని 'సింగ్'/సింహంగా పిలవాలని పేర్కొని ఫతేదరాస్ (విజయం కలుగుగాక) అనే పలుకరింపును ప్రవేశపెట్టాడు.
- సర్‌హింద్‌ను ఫౌజ్‌దార్ వజీర్‌ఖాన్‌ను ఓడించి ఆక్రమించాడు. లోహర్‌ఘడ్ (పంజాబ్) కోటను కూడా ఆక్రమించి తన రాజధానిగా ప్రకటించుకున్నాడు.
- 1716లో ఫరూక్షియర్ సేనాని అయిన అబ్దుస్ సయ్యద్‌ఖాన్ బందాబహదూర్‌ను చంపేశాడు.

కపూర్‌సింగ్ (1716–80)

- బందాబహూద్ తర్వాత సిక్కులకు నేతృత్వం వహించినవాడు – కపూర్ సింగ్.
- కపూర్‌సింగ్ నేతృత్వంలో రూపొందిన విభాగం – దదస్‌ఖల్సా – (పదిదళాలు)
- 1767 కపూర్‌సింగ్ ఆఫ్ఘన్ నాయకుడైన అహ్మద్‌షా అబ్దాలీని ఓడించి అతని రాజ్యాన్ని ఆక్రమించాడు.
- 'ఈ తిరుగుబాటు దారులు అధికారాన్ని హస్తగతం చేసుకునే రోజు ఎంత దూరంలేదు' అని సిక్కులను ఉద్దేశించి పలికినవాడు. – నాదిర్‌షా.
- పర్వదినాలలో సిక్కు ప్రముఖులంతా చేరి నిర్ణయాలు తీసుకునే సభ – గురుమర్ (సిక్కుల శాసనసభ)
- 1762లోఅబ్దాలీ భా రత్‌పై దండెత్తినప్పుడు స్త్రీల ను, బాలలను, వృద్ధులను మధ్యలో ఉంచి సిక్కు వీరులు చేసిన యుద్ధం 'మహామారణహోమం' (దీని లో దాదాపు 10 వే ల మంది మరణించారు) అంటారు.
- కపూర్‌సింగ్ పాలనలో సిక్కుల భూభాగాలు 12రాజ్యాలు (వీజిల్స్)గా విభజించబడినవి.
- 1) అహ్లువాలియా – సర్దార్ జస్సాసింగ్ అహ్లువాలియా
- బంగీ – సర్దార్ హరసింగ్ బంగీ
- దలేవాలియా – గులాబ్ సింగ్ దలేవాలియా
- ఫెజల్‌పూరియా – నవాబ్ కపూర్‌సింగ్
- కనైహ్యా – జై సింగ్ కనైహ్యా
- నఖాయి – హరిసింగ్ నఖాయి
- రామ్ఘరియా – నంద్‌సింగ్ సంఘానియా
- పుల్‌కియాన్ – బాబా అలా సింగ్
- కరూర్‌సింగియా – కరోరాసింగ్ దలియావాల్
- నిషాన్‌వాలా – దశౌందసింగ్
- షాహీద్ – బాబాదీప్‌సింగ్ జీ షాహీద్
- సుకర్‌చాకియా – నోద్‌సింగ్
- పై 12శాఖలలో/ మీజిల్స్‌లక్ష ముఖ్యమైనది – సుఖర్‌చాకియా చరత్ సింగ్ (రంజిత్‌సింగ్ తాత) కమాండర్‌గా వ్యవహరించాడు.
- సుఖర్ చాకియా శాఖలో లేదా సిక్కు పాలకులందరిలో గొప్పవాడు. మహారాజా రంజిత్‌సింగ్.
- సిక్కు మత స్థాపకుడు గురునానక్ కాగా రాజ్య స్థాపకుడు – మహారాజా రంజిత్‌సింగ్.

మహారాజా రంజిత్‌సింగ్ (1762–1839)

- **బిరుదులు :** మహారాజా ఆఫ్ పంజాబ్, సిక్కురాజ్య నిర్మాత, పంజాబ్ సింహం, One eyed Gaint అసలు పేరు –బుద్‌సింగ్, భార్య పేరు – రాణిజిందాస్, మంత్రులు – దివాన్‌దీనానాథ్ అజుజుద్దీన్, దివాన్ పేరు – అకుపతిరాయ్.
- రంజిత్‌సింగ్ 1780 నవంబర్ 13న మహాసింగ్ (తండ్రి), రాజ్‌కౌర్ (తల్లి) అనే దంపతులకు పంజాబ్‌లోని గుజ్రన్‌వాలా (ప్రస్తుత పాకిస్థాన్)లో జన్మించాడు.
- తండ్రి మహాసింగ్ అదే సమయంలో పీర్‌మహ్మద్‌ను ఓడించడంతో బద్ సింగ్ పేరును విజయానికి సూచికగా రంజిత్‌సింగ్ అని మార్చారు. రంజిత్‌సింగ్‌కు చిన్నప్పుడే మసూచి వల్ల ఒక కన్నును కోల్పోయాడు.
- తండ్రి మరణానంతరం 1799లో బంగీతెగవారిని(జమాన్‌షా) ఓడించి లాహోర్‌ను ఆక్రమించి తన రాజకీయ రాజధానిగా ప్రకటించి ఆయుధ కర్మాగారాన్ని నిర్మించాడు.
- రష్యా దండెత్తుతుందన్న భయంతో ఆంగ్లేయులు రంజిత్‌సింగ్‌కు సమాన హోదా ఇచ్చాడు.
- 1802లో అమృత్‌సర్‌ను ఆక్రమించి తన రాజ్ధానిగా ప్రకటించుకున్నాడు.
- 1809 బ్రిటీష్ గవర్నర్ జనరల్ 1వ మింటోతో 'అమృత్‌సర్ ఒప్పందం' చేసుకున్నాడు.
- ఈ ఒప్పందం ప్రకారం సట్లేజ్ నది బ్రిటీష్ & పంజాబ్‌ల మధ్య సరిహద్దుగా మారింది.
- 1831 విలియంబెంటింగ్‌తో 'సింధునావికా ఒప్పందం'ను చేసుకున్నాడు. దీని ప్రకారం బ్రిటీష్‌వారు సింధూనదీని వర్తకం కోసం ఉపయోగించుకోవచ్చు.
- 1838 త్రైపాక్షిక ఒప్పందం రంజిత్‌సింగ్, బ్రిటీష్, ఆఫ్ఘన్ పాలకుడైన రెండవ షాఘూజాల మధ్య జరిగింది. రంజిత్‌సింగ్ ఆఫ్ఘన్‌లో రెండవ షాఘూజాకు వ్యతిరేకంగా జరుగుతున్న తిరుగుబాట్లను అణచివేశాడు.
- రెండవ షాఘూజా రంజిత్‌సింగ్‌కు కోహినూర్ వజ్రం (గుంటూరు జిల్లాలోని కొల్లూరులో అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో దొరికింది.) బహుమానంగా ఇచ్చాడు.

కొత్త గ్రహాన్ని కనుగొన్న నాసా ప్రోబ్

సౌరవ్యవస్థకు అవతల 53 కాంతి సంవత్సరాలకు దూరంగా మరుగుజ్జు నక్షత్రం చుట్టూ పరిభ్రమించే కొత్త గ్రహాన్ని నాసా ప్రోబ్ కనుగొన గలిగింది. ట్రాన్సిటింగ్ ఎక్సోప్లానెట్ సర్వే శాటిలైట్ (టిఇఎస్ఎస్) నిర్ధారించిన మూడో కొత్త గ్రహం ఇదే. ఈ టిఇఎస్ఎస్ గత ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభమైంది. హెచ్‌డి 21749బి అని ఈ కొత్త గ్రహానికి పేరు పెట్టారు. ఇది అత్యంత కాంతి వంతమైన సమీప నక్షత్రం చుట్టూ రెటిక్యులమ్ నక్షత్ర మండలంలో పరిభ్రమిస్తోంది. టిఇఎస్ఎస్ కనుగొన్న మూడు గ్రహాల్లో ఇది సుదీర్ఘ కాల భ్రమణం కలిగిన గ్రహంగా గుర్తించారు. ఇతర రెండు గ్రహాలైన పి మెన్సే బి సూపర్‌ఎర్త్ గ్రహం కక్ష్య భ్రమణం 6.3 రోజులు కాగా, ఎల్‌హెచ్ఎస్ 3844బి శిలా ప్రపంచం ఇది తన నక్షత్రం చుట్టూ కక్ష్యలో వేగంగా 11 గంటల్లోనే పరిభ్రమిస్తుంది.




వీటితో పోల్చిచూస్తే ఈ కొత్త గ్రహం 21749బి తన నక్షత్రం కక్ష్య చుట్టూ చాలా విశ్రాంతిగా ఆలస్యంగా 36 రోజుల పాటు పరిభ్రమించడం చెప్పుకోతగ్గ విషయం. టిఇఎస్ఎస్ ఏర్పాటైన మొదటి మూడు నెలల్లోనే ఈ మూడు కొత్త గ్రహాలు కనుగొనడం విశేషం. కాంతివంతమైన నక్షత్రం చుట్టూ పరిభ్రమించే చాలా చల్లని చిన్న గ్రహం ఇదని పరిశోధకులు డయానా డ్రాగోమిర్ చెప్పారు. మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కి చెందిన ఈ పరిశోధకుడు ఈ పరిశోధనకు నాయకత్వం వహిస్తున్నారు. ఉష్ణగ్రహాల వాతావరణం గురించి మనకు చాలా తెలుసు. కానీ నక్షత్రాలకు దూరంగా ఉండే చల్లని చిన్నపాటి గ్రహాల గురించి మనకు తెలియదు. కానీ అదృష్టవశాత్తు ఈ కొత్త గ్రహాన్ని తాము పట్టుకోగలిగామని డయానా చెప్పారు. ఇప్పుడు సవివరంగా దీన్ని అధ్యయనం చేస్తున్నాం అని అన్నారు. ఈ కొత్త గ్రహం భూగోళానికి మూడింతలు పెద్దదని, సబ్ నెప్ట్యూన్ కేటగిరి కింద దీన్ని పరిగణించడమైందని చెప్పారు. ఏదెలాగున్నా మిగతా గ్రహాలకు భిన్నంగా ఇది పూర్తిగా శిలలతో నిండి ఉండనందున నివసించడానికి అనుకూలంగా ఉంటుందని ఈ గ్రహం వాయువుతో రూపొందినవని, నెప్ట్యూన్ లేదా యురేనస్‌ల కన్నా దీని భౌగోళ తత్వం చాలా సాంద్రంగా ఉంటుందని వివరించారు. నెప్ట్యూన్ లేదా యురేనస్ మాదిరిగా ఇది వాయుభరితంగా ఉండకపోవచ్చని తాము భావిస్తున్నామని, ఆయా గ్రహాల్లో ఎక్కువగా హైడ్రొజన్ వాయువు నిండి ఉంటుందని, వాస్తవానికి రొప్పుతుంటాయని పేర్కొన్నారు. ఈ కొత్త గ్రహం నీటి సాంద్రతతో లేదా చిక్కని వాతావరణంతో ఉండ వచ్చునని అభిప్రాయం వెలిబుచ్చారు.


– సైన్స్ విభాగం



వ్యాయామంతో అల్జీమర్స్ ఆలస్యం









శారీరక వ్యాయామం చేయడం వల్ల మతిమరుపునకు కారణమైన అల్జిమర్స్ అలాగే డెమెన్షియా ప్రారంభం కాకుండా ఆలస్యం అవుతుందని అధ్యయనం లో వెల్లడైంది. ఫెడరల్ యూనివర్శిటీ ఆఫ్ రియో డి జెనెయిరో (యుఎఫ్ఆర్‌జె) పరిశోధకులు వ్యాయామం వల్ల ఉత్పత్తయ్యే హార్మోన్ ఇరిసిన్ స్థాయిలకు డెమెన్షియా వ్యాధి వృద్ధికి గల సంబంధాన్ని నిర్ధారించారు. ఈమేరకు ఎలుకలపై అల్జిమర్స్‌కు సంబంధించి పరీక్షలు చేశారు. ఇరిసిన్ తక్కువ స్థాయిలో ఉన్న ఎలుకల్లో అల్జిమర్స్ కనిపించింది. వ్యాయామం వల్ల ఇరిసిన్ స్థాయిలు పెరిగి జ్ఞాపక శక్తి పెంపొందడం కనిపించింది. అల్జిమర్స్ మెదడులో ఉన్న రోగుల్లో ఈ హార్మోన్ ఇరిసిన్ తక్కువ స్థాయిలో కనిపించిందని యుఎఫ్ఆర్‌జె ప్రొఫెసర్ సెర్జియో ఫెరిరా అన్నారు. అంతే కాదు ఈ హార్మోన్ స్థాయిలను పెంచడంతో జ్ఞాపకశక్తి పెరగడాన్ని పరిశోధక బృందం గమనించింది. ఎక్సర్‌సైజు వల్ల కలిగే ప్రయోజనాలకు హార్మోన్ ఇరిసిన్ ఒక సంకేతమని చెప్పవచ్చు. జ్ఞాపక శక్తి లోపాన్ని ఈ హార్మోన్ సరిచేస్తుందని పరిశోధకులు కనుగొన్నారు. అల్జిమర్స్‌తోసహా జ్ఞాపక శక్తి లోపించడం, మెదడు వ్యాధులు ఇవన్నీ నివారించడానికి ఎక్సర్‌సైజు ఎంతో అవసరమని రూఢి అయినట్టు పరిశోధకులు వెల్లడించారు.

– సైన్స్ విభాగం

2021 నాటికి అంతరిక్షంలో చిక్కుళ్ల పెంపకం





రోదసీ యాత్రికులు ఉద్యానవనాలను, కూరగాయల తోటలను పెంచడానికి అమితంగా మక్కువ చూపిస్తుంటారు. ఈ విషయంలో వారికి భూమి మీద జీవితం తిరిగి గుర్తుకు వస్తుంటుంది. కాయగూరల పాదులను తోటలను పెంచి పోషించడం అవి తిరిగి ఉత్పత్తి సాధించడం ఇవన్నీ రోదసీ యాత్రికులకు ఆనందం కలిగిస్తుంటాయని నార్వేజియన్ యూనివర్శిటీ సైన్సు అండ్ టెక్నాలజీ ప్లాంట్ ఫిజియాలిజిస్టు సిల్జే వోల్ఫ్ చెప్పారు. హైటెక్ మొక్కలను శాస్త్రవేత్తలు సృష్టించారు. ఫలితంగా అంతరిక్షంలో చిక్కుడు పాదులను పెట్టి చిక్కుళ్లను ఉత్పత్తి చేసే అవకాశం రోదసీ యాత్రికులకు కలిగింది. 2021 నాటికి అంతరిక్షంలో చిక్కుళ్లను పెంచాలన్న లక్ష్యంతో వ్యోమగాములు సిద్ధమవుతున్నారు. మూడేళ్ల క్రితం అంతర్జాతీయ అంతరిక్ష స్థావరం (ఐఎస్ఎస్)లో వ్యోమగాములు కొన్ని చిక్కుడు మొక్కలను పెంచినప్పుడు తాజా ఆహారం వారికి ఎంతో ఆసక్తి కలిగించింది. భూమిపై జీవితాన్ని గుర్తుకు తెచ్చే కూరగాయల పెంపకం వారికి ఎంతో నచ్చింది. ఐఎస్ఎస్‌లో సుదీర్ఘ కాలం మనుగడ సాగించే సమయం ఆరు నెలలు. అంగారక యాత్ర సాగించాలంటే కనీసం ఏడాదైనా వ్యోమగాములు ఐఎస్ఎస్‌లో నివాసం ఉండవలసి వస్తుంది. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ అంగారక యాత్ర కోసం మధ్యలో కొన్నినాళ్లు ఆగడం కోసం స్థావరంగా లూనార్ బేస్‌ను 2030లో ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఉన్నారు. నాసా అంగారక గ్రహంపై నేరుగా వెళ్లి అక్కడ 2030లో దిగడానికి ప్రయత్నాలు సాగిస్తోంది. ఇప్పుడు అంతరిక్ష యాత్రకు సంబంధించి అన్ని అవసరాలను వెంట తీసుకుని వెళ్లే అవకాశం లేదు. అందువల్ల బయోలాజికల్ వ్యవస్థను అభివృద్ధి చేయవలసిన అవసరం ఉంది. ఈ కారణంగా వ్యోమగాములు తమ ఆహారాన్ని తామే తయారు చేసుకోగలగాలి. అలాగే వనరులను వినియోగించిన తరువాత మళ్లీ వాటినే వినియోగించుకునేలా రీసైకిల్ వ్యవస్థను అనుసరించక తప్పదని పరిశోధకులు వోల్ఫ్ చెప్పారు. ఈనాటి వ్యోమగాములు ఫ్రీజ్ డ్రైడ్, లేదా వాక్యూమ్ పాక్డ్ ఆహారాన్ని తింటున్నారు. ఆకలి దప్పికలు పూర్తిగా తీరక వ్యోమగాములు సతమతమవుతున్నారు. తరచుగా శరీర బరువును కోల్పోతున్నారు. తాజాగా ఆహారాన్ని తీసుకుంటున్నామన్న మానసిక సంతృప్తి కలిగించడానికి ప్రయత్నించడమే తమ లక్ష్యంగా వోల్ఫ్ వివరించారు. వాక్యూమ్ పాక్డ్ ఫుడ్ అంటే నిజంగా ఆహారం తినినట్టు అనిపించదు. ఏదైనా తాజాగా ఆహారం లభిస్తే అది ఆకలిని పెంచడమే కాదు, మెదడులో కచ్చితంగా గ్రహించే శక్తిని పెంపొందించడం చాలాముఖ్యం అని వోల్ఫ్ అభిప్రాయపడ్డారు. ఇప్పుడు ఈ కొత్త వ్యవస్థలో అత్యంత ఆధునిక ప్లాంటర్స్‌ను ప్రవేశ పెడుతున్నారు. ఈ ప్లాంటర్స్ మొక్కకు కావలసిన నీటిని, పోషకాలను, వాయువును, గాలిని ఎంత అవసరమో అంతవరకు క్రమబద్ధంగా అందిస్తాయి. అంతరిక్షంలో నీరు ఆహారం అంతా తిరిగి గ్రహించ వలసి ఉంటుంది. అంటే మొక్క ఫలధీకరణం వీలైనంతవరకు సరిగ్గా జరగవలసి ఉంది. వోల్ఫ్ నెదర్లాండ్స్‌లో వాతావరణ క్రమబద్ధీకరణ చాంబర్స్‌ను నెలకొల్పి కొన్ని ప్రయోగాలు చేశారు. పోషక విలువల మొక్కలన్నిటిలో నైట్రొజన్ ఎక్కువగా ఉన్న మొక్కలతోనే ప్రయోగాలు చేశారు. నైట్రొజన్ సాంద్రత తక్కువగా ఉంటే మొక్కలు ఎక్కువ నీటిని గ్రహిస్తాయని తెలుసుకున్నారు. నైట్రొజన్ తగిన స్థాయి చేరుకునే వరకు నీటిని గ్రహిస్తుంటాయి. నైట్రొజన్ స్థాయి తగినంతగా చేరాక మొక్క వ్యవస్థలో మార్పు వస్తుంది. అంతరిక్షంలో మొక్కలపై గురుత్వాకర్షణ శక్తి ఏ విధంగా పనిచేస్తుందో తెలుసుకోవాలని పరిశోధకులు సిద్ధమవుతున్నారు. అందువల్ల చిక్కుళ్లను పెంచి వాటిపై గురుత్వాకర్షణ శక్తి ప్రభావం ఎలా ఉంటుందో గ్రహిస్తారు. నీరు ఎలా మొక్కలకు చేరుతుందో, పోషక విలువలను మొక్కలు ఏ విధంగా గ్రహించ గలుగుతాయో తెలుసుకుంటారు. మొత్తం మీద ఈ పరిశోధన లక్ష్యం ప్రతి వ్యోమగామి తాజాగా స్ట్రాబెర్రీలు, చెర్రీటొమాటోలు, వంటివే కాకుండా ప్రతీ పండు, కాయగూరను తాజాగా తీసుకునేలా చేయడమేనని పరిశోధకులు వివరించారు. – సైన్స్ విభాగం

పరివార్ అజెండాతోనే అడ్డగోలుగా బిల్లు

రాజ్యసభలో మండిపడ్డ ప్రతిపక్షాలు



న్యూఢిల్లీ : రాజ్యసభలో రిజర్వేషన్ల కోటా బిల్లుపై డిఎంకె సభ్యురాలు కనిమొళి సెలెక్ట్ కమిటీకి తీర్మానం చేయడాన్ని వామపక్షాలు, టిడిపి కూడా బలపర్చాయి. సభను ఒక్కరోజు పొడిగించి బిల్లును తీసుకురావల్సిన అవసరం ఏముందని ప్రతిపక్షాలు నిలదీశాయి. అందరికీ న్యాయం ఉద్దేశం కాకండా ప్రభుత్వానికి వేరే విధమైన ఆలోచన ఉందని, ఈ లోగుట్టు అసలు ఓటు రాబట్టువిధానమే అని విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్ అజెండాతో నడుస్తున్న బిజెపి ప్రభుత్వం కేవలం ఓట్లను కొల్లగొట్టేందుకు ఈ బిల్లును ఆదరాబాదరగా తీసుకువచ్చిందని ప్రతిపక్షాలు విమర్శించాయి. రాజ్యాంగానికి అతీతంగా న్యాయవ్యవస్థ సమీక్షకు నిలబడలేని బిల్లును ఎందుకు తీసుకువస్తున్నట్లు అని ప్రశ్నించాయి.


రాజ్యాంగం పట్ల ఇది ద్రోహం అని బిఎస్‌పి సభ్యులు కుమారి సెల్జా విమర్శించారు. రాజ్యాంగం ప్రకారం అణగారిన వర్గాలకు ఇప్పటికీ పలు రకాలుగా సంక్షేమం అమలు కావల్సి ఉందని, ఇప్పటికీ వారికి సరైన విధంగా సంక్షేమ ఫలాలు అందడం లేదని, అయితే దీనిని విస్మరించి రాజ్యాంగం మౌలిక సూత్రాలను కాలరాస్తూ ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువచ్చిందని సెల్జా విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ విద్వేషపు అజెండానే ఇది అని మండిపడ్డారు. ఈ బిల్లు పార్లమెంట్ చట్టపరమైన ఉద్దేశానికి విఘాతం అని సిపిఐ నేత రాజా విమర్శించారు. పార్లమెంట్‌కు న్యాయవ్యవస్థకు ఇప్పటి వరకూ ఉన్న ఘర్షణను ఇప్పుడు ఈ ప్రభుత్వం చివరికి రాజ్యాంగంతో కయ్యం దశకు తీసుకువెళ్లిందని చెప్పారు. బిల్లును తీసుకువచ్చిన విధానం అందరిలో కలవరం కల్గిస్తోందని, పౌరులు అంతా ప్రభుత్వ వ్యవహార సరళితో కంగుతింటున్నారని రాజా చెప్పారు. రాజ్యాంగాన్ని, పార్లమెంట్‌ను కించపరిచే విధంగా సర్కారు తీరు ఉందని అన్నారు. ఆదాయం ప్రాతిపదికన రిజర్వేషన్లను కల్పించడం పార్లమెంటరీ శాసనపరమైన సంవిధానానికి విఘాతం అని చెప్పారు. బిల్లును సెలెక్ట్ కమిటికి పంపించాల్సిందేనని స్పష్టం చేశారు.

అగ్రవర్ణాల పేదలకు మేలు జరగదు : బిఎస్‌పి



బిల్లులోని అంశాలను పరిశీలిస్తే ఇది అగ్రవర్ణాలకు అందులోని సంపన్నులకే మేలు చేస్తుందని, జనరల్ కేటగిరిలోని అసలు సిసలైన పేదలకు మేలు ఏమీ జరగదని బిఎస్‌పి సభ్యులు సతీష్ చంద్ర మిశ్రా విమర్శించారు. అగ్రవర్ణాలలోని పేదలకు అసలు రక్షణ కల్పించారా? ఈ కులాలలోని నిరుపేదలను గుర్తించే ప్రక్రియ ఉందా? దీని మేరకు వీరికి సరైన కోటా ప్రయోజనాలు దక్కుతాయా? అని ప్రశ్నించారు. బిల్లుకు బిఎస్‌పి మద్దతు ఇస్తుందని అయితే సరైన సమగ్రత లేకపోవడం వల్ల ప్రయోజనం ఏముంటుందని అన్నారు. అంతేకాకుండా ఎన్నికలకు ముందు దశలో ఈ బిల్లును చట్టరూపంలో ఏ విధంగా అమలు చేస్తారు? దీనికి పలు ఇబ్బందులు ఉన్నాయని అన్నారు. అసలు ఈ బిల్లు గురించి కోటా గురించి కేంద్ర మంత్రులకు కూడా ముందుగా తెలియదని తనకు తెలిసిందని, ఉన్నట్లుండి కేబినెట్‌లో దీనిని ఆమోదించారని, చివరికి కొందరు మంత్రులు కూడా కంగుతిన్నారని విమర్శించారు. ఈ విధంగా చూస్తే ప్రధాని మోడీ కోటరిలో చాలా మంది బలహీనవర్గపు మంత్రులు ఉన్నారని వారికీ కోటా కల్పించాల్సి ఉందని మిశ్రా చమత్కరించారు. రాజ్యాంగాన్ని సవరించడం కాదు, దానికి ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. అంతేకాకుండా అగ్రవర్ణాలలోని పేదలకు కూడా అన్యాయం జరుగుతోందన్నారు.

సమగ్రత లేకపోతే అమలు కష్టం: కపిల్ సిబల్



ప్రభుత్వపు ఆదరాబాదరా బిల్లు ముఖ్యంగా మూడు అడ్డంకులను ఎదుర్కొంటుందని కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబల్ తెలిపారు. మొదటిది ఈ బిల్లుపై సరైన దృష్టి కేంద్రీకరించకుండానే సరైన పద్ధతి లేకుండా మొక్కుబడిగా రూపొందించారు. ఇక రెండోది రాజ్యాంగపరమైన చెల్లుబాటుకు నిలవలేకపోవడం, మూడోది దీని అమలులో పలు చిక్కులకు వీలుండటం . ఈ కీలకమైన మూడు చిక్కులతో బిల్లును ఏ విధంగాతీసుకువస్తారని ప్రశ్నించారు. బిల్లుకు సంబంధించి అత్యంత వివాదాస్పదం అయిన విషయం రూ 8 లక్షల ఆదాయ పరిమితి అని, దీనిని ఏ విధంగా ఖరారు చేశారనేది చెప్పాల్సి ఉందన్నారు. గత ఐదేళ్లలో 45000 ఉద్యోగాలు కల్పించారని దీని వల్ల తేలేదేమిటంటే ఈ పది శాతం కోటాలోని వారికి 4500 ఉద్యోగాలు వచ్చాయని, మరి ఈ అతి తక్కువ మంది కోసం రాజ్యాంగాన్ని సవరిసుతన్నారా? అని ప్రశ్నించారు. ఓ వైపు దేశంలో ఉద్యోగాలు పోతూ ఉన్నాయని, మరి ఎటువంటి ఉద్యోగాలను ప్రభుత్వం ఈ దశలో కల్పించనుంది? ఎవరికి ఈ పదిశాతం కోటాను అందిస్తారు? అని ప్రశ్నించారు. బిల్లును తీసుకువస్తున్న విధానం రాజ్యాంగ విరుద్ధం అంతకు మించి వాస్తవిక విరుద్ధం అని చెప్పారు. రిజర్వేషన్లు కావాలంటే ఉద్యోగాలు రావాలి. ఉద్యోగాలు రాకుండా కోటాను దేనికి కల్పిస్తారు? అని ప్రశ్నించారు. ఆర్థిక ప్రగతి ఆగిపోయిందని, మరి సవరణలు దేనికి ప్రతిపాదిస్తున్నట్లు అని ప్రశ్నించారు. ప్రయోజనాల కోణంలోనా? నష్టాల ప్రాతిపదికనా? ఏ దిశలో మనం ఇప్పుడు రాజ్యాంగం గురించి విశ్లేషించుకోవాల్సి ఉందని నిలదీశారు. దేని గురించి ఏ విధంగా వ్యవహరించాల్సి ఉందనేది? ఏ విధంగా బాధ్యతాయుతంగా మెదలాల్సి ఉందనేది ఇప్పుడు సభ ముందున్న కీలక ప్రశ్న అన్నారు. ప్రభుత్వం బలహీన వర్గాల నుంచి వేరే వైపు పయనిస్తోందని అన్నారు. ప్రస్తుత లెక్కల ప్రకారం నెలకు రూ 15000 సంపాదించే దళిత వర్గం సభ్యుడు బలహీన వర్గాల పరిధికి రాకుండా సవరణ వీలు కల్పించినట్లు అవుతోందన్నారు. చివరికి ఈ సర్కారు లెక్కలతో రూ 5000, రూ 8 లక్షల ఆదాయం కూడా ఒకే గాటికి చేరుతుందని వ్యాఖ్యానించారు. దీనిపై న్యాయశాఖ మంత్రి రవిశంకర ప్రసాద్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

రిజర్వేషన్లు రాజ్యాంగ పరిధిలో లేవు : న్యాయశాఖ మంత్రి



కపిల్ సిబల్ ప్రసంగానికి అడ్డు తగిలిన దశలో న్యాయశాఖ మంత్రి రిజర్వేషన్ల అంశంపై మాట్లాడారు. డిఎంకె సభ్యురాలు కనిమొళి తప్ప మిగిలిన వారంతా కోటాకు మద్దతు ఇచ్చారని, మరి టిఎంసి సభ్యులు ఏమంటున్నారో తెలియాల్సి ఉందన్నారు. నెహ్రూ గురించి మాట్లాడారు. ఇతర నేతల గురించి కూడా ప్రస్తావనకు రావడం మంచిదే అన్నారు. అయితే రాజ్యాంగంలోని మౌలిక నిర్మాణ వ్యవస్థ పరిధిలోకి రిజర్వేషన్లు రావని మంత్రి స్పష్టం చేశారు. కాలానుగుణంగా పేదల వర్గీకరణకు అనుగుణంగా రిజర్వేషన్ల కోటాకు వీలుంటుందని, దీనిని బట్టి న్యాయపరమైన అడ్డంకులకు వీలులేకుండానే రాజ్యాంగ సవరణలతోనే బిల్లును సమగ్రంగా తీసుకురావడం జరిగిందని మంత్రి తెలిపారు. బిల్లుపై నిర్మాణాత్మక చర్చ జరిగిన దానిని బట్టి కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని, అయితే ఎటువంటి లోపాలు లేకుండా సరైన విధంగా అమలుకు దీనిని తీసుకువచ్చినట్లు చెప్పారు.

పేరుకే సిఎంని..చేసేవి క్లర్కు పనులు!

కాంగ్రెస్ నేతల తీరుపై కుమారస్వామి కంటతడి



బెంగళూరు: కర్నాటకలో అధికారంలో ఉన్న సంకీర్ణ కూటమి భాగస్వామ్య పక్షాలైన జెడిఎస్, కాంగ్రెస్ మధ్య విభేదాలు రోజురోజుకీ తీవ్రరూపం దాలుస్తున్నాయి. సంకీర్ణ ప్రభుత్వం వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోపే కూలిపోయే అవకాశం ఉన్నదని స్వయంగా ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామే సంకేతాలు పంపుతున్నారు. బుధవారం నాడిక్కడ జెడిఎస్ ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సిలతో సమావేశమైన ముఖ్యమంత్రి కుమారస్వామి కాంగ్రెస్ నాయకుల జోక్యం కారణంగా తాను ముఖ్యమంత్రిగా కాక ఒక గుమాస్తాలా పనిచేయాల్సి వస్తోందని భావోద్వేగంతో వాపోయినట్లు సమాచారం. బిజెపిని అధికారంలోకి రానివ్వకూడదన్న ఉద్దేశంతో కాంగ్రెస్‌తో చేతులు కలిపిన తర్వాత తాను ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన వారితో పంచుకున్నట్లు తెలిసింది. "కాంగ్రెస్ నాయకులు తమకు లాభం చేకూర్చే పనులన్నీ నా చేత బలవంతంగా చేయిస్తున్నారు. వారి మాటలు వినడం తప్ప నాకు వేరే గత్యంతరం లేకుండా పోతోంది. తీవ్రమైన ఒత్తిడితో పనిచేస్తున్నాను. ఒక ముఖ్యమంత్రిని అని కూడా చూడకుండా తమ కింద పని చేసే గుమాస్తాగా కాంగ్రెస్ నాయకులు నన్ను చూస్తున్నారు" అం టూ కుమారస్వామి కంటతడి పెట్టుకున్నట్లు సమాచారం. సమావేశం వివరాలను ఒక జెడిఎస్ నాయకుడు వెల్లడిస్తూ కాంగ్రెస్ నాయకులు ఒక పెద్దన్నలా చూస్తున్నారని కుమారస్వామి బాధపడినట్లు చెప్పారు. "అన్ని రకాల ఉత్తర్వులపై కుమారస్వామి చేత సంతకాలు చేయిస్తున్నారు. బలవంతంగా క్యాబినెట్ విస్తరణ చేయించారు. ఆయన ఆమోదం లేకుండానే కార్పరేషన్లకు, ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే బోర్డులకు చైర్మన్లను నియమించుకున్నారు. రోజురోజుకూ ఆయన పరిస్థితి చాలా ఇబ్బందిగా ఉంది," అని ఆ నాయకుడు చెప్పారు. అయితే ఈ సమావేశంలో పాల్గొన్న జెడిఎస్ అధినేత, మాజీ ప్రధాని దేవె గౌడ మాత్రం పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యేవరకు సంకీర్ణ ప్రభుత్వం పడిపోకుండా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

కెనడా, బ్రిటన్‌లపై ఇండియన్ల ఆసక్తి



- ట్రంప్ విధానాలతో విసిగిపోతున్న విదేశీయులు
- విద్య, ఉద్యోగావకాశాల్లో ఆ రెండు దేశాలకూ ఆదరణ

ముంబయి: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలతో విసిగిపోతున్న విద్యా, ఉద్యోగ ఆశావహులు తమ వైఖరిని మార్చుకుంటున్నారు. భారతీయులు సహా విదేశాల్లో ఉద్యోగం చేసేందుకు వెళ్లాలనుకునే వారు కెనడా, బ్రిటన్‌లపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని తెలిపింది. ట్రంప్ పాలసీల కారణంగా విదేశాల్లో ఉద్యోగాల కోసం వెళ్లే వారిలో కెనడా, బ్రిటన్‌ల పట్ల ప్రజాదరణ బాగా పెరిగిందని ఓ నివేదిక వెల్లడించింది. ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవిలోకి వచ్చిన తర్వాత ఆ దేశ వలస పాలసీలను, హెచ్1బి వీసా విధానాలను కఠినం చేస్తున్న నేపథ్యంలో చాలా మంది వేరే దేశాల్లో అవకాశాల కోసం చూస్తున్నారు. ఇటు ట్రంప్ కఠిన విధానాలను అనుసరిస్తుండడంతో అటు సులువైన విధానాలను పాటిస్తున్న దేశాల వైపు దృష్టి సారిస్తే వాటిలో కెనడా, బ్రిటన్‌లు అత్యుత్తమమైనవిగా నిర్ధారించుకుంటున్నారని వెల్లడైంది. కెనడా సులువైన వలస విధానాలతో విదేశీయులను ఆహ్వానిస్తుండటం, బ్రిటన్ వలసవిధానాల్లోనూ వస్తున్న మార్పుల నేపథ్యంలో విదేశీయులు ఉద్యోగాల కోసం ఈ దేశాలను ఎంపిక చేసుకుంటున్నారని నివేదిక స్పష్టంచేసింది. భారతీయులకు, లాటిన్ దేశాల ప్రజలకు కెనడా ప్రత్యామ్నాయ ఎంపికగా మారిందని పేర్కొంది. టెక్నాలజీ, పరిశోధన, ఆర్థిక రంగాల్లో ఎక్కువ జీతం లభించే ఉద్యోగాల కోసం ఎక్కువగా వెతుకుతున్నారని ఇన్‌డీడ్ అనే వెబ్‌సైట్ తన నివేదికలో వెల్లడించింది. అత్యంత నిపుణులైన భారతీయులు అమెరికాలో ఉద్యోగం కోసం కలలు కంటుంటారని, అయితే ట్రంప్ వీసా పాలసీల ప్రభావం అలాంటి వారిపై పడుతోందని తెలిపింది. దీంతో వారు కెనడా, బ్రిటన్ దేశాల వైపు చూస్తున్నారని పేర్కొంది. 2017 మధ్య నుంచి ఈ ట్రెండ్ ప్రారంభమైందని వెల్లడించింది. హెచ్1బిపై కఠిన నిబంధనలు, వీసా ప్రాసెసింగ్‌లో తీవ్ర జాప్యం జరిగిన సమయంలో ఉద్యోగార్థులు ఇతర దేశాలపై బాగా ఆసక్తి కనబరిచినట్లు నివేదిక తెలిపింది. 2016 ఆగస్టు నుంచి 2018 జులై మధ్య భారతీయులు అమెరికాలో ఉద్యోగం కోసం వెతకడం 60 శాతం నుంచి 50శాతానికి తగ్గిందని, అదే సమయంలో కెనడాలో 6శాతం నుంచి 13శాతానికి పెరిగిందని నివేదిక స్పష్టం చేసింది.



కొడంగల్‌లోని నర్సాపూర్ గ్రామం ఏకగ్రీవం

మన తెలంగాణ/హైదరాబాద్ : కొడంగల్ నియోజకవర్గం, దౌల్తాబాద్ మండలంలోని నర్సాపూర్ గ్రామంలో పంచాయతీ ఎన్నిక ఏకగ్రీవమైంది. గ్రామ సర్పంచ్‌గా ఆర్. హేమలత, వార్డు సభ్యులు ఎనిమిది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల వరకు దౌల్తాబాద్ టికాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డికి అత్యంత పట్టున్న మండలం. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనే స్వయంగా ఓడిపోవడంతో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా చాలా మంది చేజారిపోయి టిఆర్‌ఎస్‌లో చేరిపోయారు. దీంతో నర్సాపూర్ గ్రామం నుంచి కాంగ్రెస్ పక్షాన మరో అభ్యర్థి పోటీ చేయడానికి కూడా ఎవ్వరూ సాహసించలేదు. దీంతో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల ఎంపిక పూర్తిగా ఏకగ్రీవమైంది. కాగా ఎన్నిక ఏకగ్రీవం కావడంతో హేమలతతో పాటు వార్డు సభ్యులను స్థానిక శాసనసభ్యుడు పట్నం నరేందర్‌రెడ్డి అభినందించారు.

అసోంలో కొనసాగిన 'పౌరసత్వ' ప్రకంపనలు

గౌహతి: పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా బుధవారం కూడా అసోంలో భారీఎత్తున నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. ఆందోళనకారులు రాష్ట్రంలో అనేక చోట్ల రహదారుల్ని దిగ్బంధం చేశారు. దుస్తులు విడిచి నిరసన తెలిపారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ నుంచి వచ్చి మనదేశంలో ఉంటున్న ముస్లిమేతరులకు భారతదేశ పౌరసత్వం కల్పించే పౌరసత్వ (సవరణ) బిల్లు – 2016ను లోక్‌సభ మంగళవారం ఆమోదించింది. ఈ బిల్లును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అసోంతో సహా ఈశాన్య రాష్ట్రాల్లో రైలు, రోడ్డు మార్గాలను బుధవారం దిగ్బంధం చేశారు. అఖిల్ గొగోయ్ క్రిషక్ ముక్తి సంగ్రాం, అసోం జాతీయ తబడి యుబ ఛాత్ర పరిషద్‌తో సహా 70 సంఘాలు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించాయి. బారికేడ్లను దాటి రాష్ట్ర సచివాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించాయి. హెచ్చరించినా వినకపోవడంతో పోలీసులు స్వల్పంగా లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది.





జమ్మూ కశ్మీర్‌ను మంచుదుప్పటి కప్పేస్తోంది. రోజురోజుకు దాని తీవ్రత పెరుగుతుండడంతో కశ్మీరీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణ జనజీవనానికి విఘాతం కలుగుతోంది. పూర్తిగా మంచుమయమైన దారిలో నల్లా నీటిని పట్టుకొని వెళుతున్న ఓ యువతి



నిర్మానుష్యంగా మారిన హౌరా బ్రిడ్జి పరిసరాలు

ట్రేడ్ బంద్‌కు మిశ్రమ స్పందన

బ్యాంకింగ్, రవాణాపై పాక్షిక ప్రభావం

న్యూఢిల్లీ: కేంద్ర ట్రేడ్ యూనియన్లు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల సమ్మెకు బుధవారం రెండో రోజు మిశ్రమ స్పందన లభించింది. బ్యాంకింగ్ కార్యకలాపాలు, రవాణాపై పాక్షిక ప్రభావం పడింది.పశ్చిమ బెంగాల్‌లో చెదురుమదురుగా హింసాత్మక సంఘటనలు జరిగాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, ఏకపక్షంగా చేసిన కార్మిక సంస్కరణలను వ్యతిరేకిస్తూ భారతీయ మజ్దూర్ సంఘ్ తప్ప పది కేంద్ర ట్రేడ్ యూనియన్లు జనవరి 8,9 తేదీల్లో రెండు రోజుల భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. హింద్ మజ్దూర్ సభ జనరల్ సెక్రెటరీ హర్భజన్ సింగ్ మాట్లాడుతూ...అసోం, ఒడిశా, మణిపూర్, మేఘాలయ, మహారాష్ట్ర, గోవాలలో సమ్మె సంపూర్ణంగా జరిగిందని తెలిపారు. పంజాబ్, రాజస్థాన్ లలో కూడా మంచి స్పందనే వచ్చింది. దేశ రాజధానిలో నాలుగువేల మంది కార్మికులు తమ ఆగ్రహం తెలిపేందుకు మండి హౌస్ నుంచి పార్లమెంట్ వరకు నిరసన ప్రదర్శన జరిపారు.

అక్కినేని బయోపిక్‌పై త్వరలో వివరాలు



మన తెలంగాణ/తిరుమల ప్రతినిధి: తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు బయోపిక్ తీయడంపై త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తానని నటుడు అక్కినేని నాగార్జున వెల్లడించారు. బుధవారం తిరుమల వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న నాగార్జున ఆలయం వెలుపల మీడియాతో క్లుప్తంగా మాట్లాడారు. తెలుగు ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, అందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని కోరుకున్నట్లు నాగార్జున పేర్కొన్నారు. త్వరలో తాను నటించే కొత్త సినిమా వివరాలు కూడా వెల్లడిస్తానని చెప్పారు.

బిజెపిలో చేరిన టిఎంసి ఎంపి



న్యూఢిల్లీ : తృణమూల్ కాంగ్రెస్ ఎంపి సౌమిత్రా ఖాన్ బుధవారం బిజెపిలో చేరారు. పశ్చిమ బెంగాల్ రాజకీయాలలో ఇది కీలక పరిణామంగా భావిస్తున్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలకు బెంగాల్‌లో కాషాయ పార్టీ ప్రచారానికి తగు హంగులను సమకూర్చుకోవడంలో ఈ ఎంపి చేరిక దోహదం చేస్తుంది. బిజెపి అధ్యక్షులు అమిత్‌షాతో జరిపిన కీలక సమావేశం తరువాత సౌమిత్రా ఖాన్ బిజెపిలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో పార్టీ అధినేత మమత బెనర్జీ వ్యవహార శైలిపై మండిపడ్డారు. మమత హయాంలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని ఉన్నది కేవలం పోలీసు రాజ్యం అని విమర్శించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటేసుకునే వీలులేదని, పోలీసుల జులుం నీడలో మమత బెనర్జీ పాలన సాగుతోందని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గతంలో బెంగాల్‌లో ఎమ్మెల్యేగా ఉన్న ఖాన్ ప్రస్తుతం బిష్ణూపూర్ నియోజకవర్గం నుంచి టిఎంసి ఎంపిగా ఉన్నారు. టిఎంసి మాజీ ప్రముఖుడు ముకుల్ రాయ్ సమక్షంలో కేంద్ర మంత్రి ధర్మేంద ప్రదాన్ విలేకరులతో మాట్లాడుతూ ఈ టిఎంసి ఎంపి బిజెపి ప్రవేశం గురించి తెలిపారు. రాయ్ 2017లోనే బిజెపిలో చేరారు.

బొల్పూర్ ఎంపిపై టిఎంసి వేటు

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పేర్కొంటూ బోల్పూరు నియోజకవర్గ ఎంపి అనుపమ్ హజ్రాను టిఎంసి పార్టీ నుంచి బహిష్కరించింది. పార్టీ వ్యతిరేక చర్యలకు దిగే వారిని సహించేది లేదని టిఎంసి సెక్రెటరీ జనరల్ పార్థా ఛటర్జీ హెచ్చరించారు. పార్టీ వీడి బిజెపిలో చేరుతున్నట్లు తెలిపిన ఎంపి సౌమిత్రా ఖాన్‌ను, హజ్రాను పార్టీ నుంచి తొలిగిస్తున్నట్లు ప్రకటించారు. కొంత కాలంగా వీరి చర్యలను గమనిస్తూ వస్తున్నట్లు వేరే పార్టీతో కుమ్మక్కు అయినట్లు గుర్తించి వేటుకు దిగుతున్నట్లు కోల్‌కతాలో పార్టీ వర్గాలు తెలిపాయి.


నా పాత్రను కించపరిస్తే సహించను

మన తెలంగాణ/తిరుమల ప్రతినిధి: బాలకృష్ణ నటించిన ఎన్టీఆర్ కథానాయకుడు చిత్రం లో తన పాత్రను కించపరిచేలా చిత్రీకరిస్తే సహించేది లేదని దీనిపై ఎంత దూరమైనా వెళ్తానని లక్ష్మీ పార్వతి పేర్కొన్నారు. బుధవారం తిరుమలకు విచ్చేసిన ఆమె శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు కుట్రపన్ని ఎన్టీ రామారావు ప్రతిష్టను దెబ్బ తీశారని, ఎన్టీ రామారావు కుమారుడు నందమూరి బాలకృష్ణ చాలా మంచివాడని, చంద్రబాబు నాయుడు అధికారం కోసం బాలకృష్ణ ను ఎన్టీఆర్ కుటుంబ సభ్యులను తప్పుదోవ పట్టించి అధికారం అనుభవిస్తున్నారని విమర్శించారు. అయితే కథానాయకుడు చిత్రం లో లక్ష్మీ పార్వతి కించపరిచేలా చిత్రీకరిస్తే సహించనని స్పష్టం చేశారు.

వాహనంలో 'మార్పుల'పై సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ: వాహనంలో మార్పులకోసం... వాహన తయారీదారుడు నిర్మాణపరంగా రిజిస్ట్రేషన్‌కోసం ఉపయోగించిన స్పెసిఫికేషన్లను (ప్రత్యేకాంశాలు) మార్చాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు బుధవారం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం మోటార్ వాహన చట్టంలో చేసిన ఒక సవరించిన అంశాన్ని ప్రస్తావించింది. చట్టంలోని అంశం ప్రకారం... వాహనంలో సవరణ అంటే వాహన నిర్మాణంలో మార్పు. ఈ మార్పు మౌలిక నిర్మాణంలో మార్పు కిందికే వస్తుంది...అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా కేరళ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇందుకు సంబంధించి ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తిరస్కరించింది. కేరళ మోటార్ వెహికిల్ రూల్స్ 1989 లోని అంశాల ప్రకారం వాహనంలో నిర్మాణాత్మకమైన మార్పులను అనుమతించవచ్చు... అని కేరళ హైకోర్టు పేర్కొంది.

రాజకీయాల్లోకి కశ్మీరీ ఐఎఎస్ షా ఫైజల్



న్యూఢిల్లీ: ఐఎఎస్ అధికారి షా ఫైజల్ తన అధికార పదవికి రాజీనామా చేసి, ఎన్నికల రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నట్టు బుధవారం ప్రకటించారు. కశ్మీర్‌లో హత్యలు ఆగడంలేదని, ప్రజలకు నమ్మకం కలిగించే రాజకీయ చర్య ఏదీ కేంద్రప్రభుత్వం చేపట్టలేదని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని ఆయన వెల్లడించారు. ఫేస్ బుక్ ద్వారా తన నిర్ణయాన్ని తెలిపిన ఫైజల్ కేంద్రప్రభుత్వ వైఖరిని నిశితంగా విమర్శించారు. తన భవిష్యత్ కార్యాచరణను శుక్రవారం ప్రకటిస్తానని ఆయన తెలిపారు. ఆయన నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలో చేరవచ్చని, బారాముల్లా నియోజకవర్గం నుంచి లోక్‌సభకు పోటీ చేయవచ్చని భావిస్తున్నారు. ఆయన నిర్ణయాన్ని మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్వాగతించారు. 2010 ఐఎస్ బ్యాచ్ కి చెందిన 35 ఏళ్ల ఫైజల్ .. సివిల్ సర్వీసెస్‌లో కశ్మీర్ నుంచి టాపర్‌గా నిలిచిన మొదటి వ్యక్తి. ఆయనను చూసి ఎందరో కశ్మీరీ యువకులు సివిల్ సర్వీసెస్‌లో చేరడానికి ముందుకొచ్చారు.

మధ్యప్రదేశ్ @ 35 ఆలౌట్

ఆంధ్రా ఘన విజయం



ఇండోర్: ఆంధ్రాతో జరిగిన రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్–బి మ్యాచ్‌లో ఆతిథ్య మధ్యప్రదేశ్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 35 పరుగులకే కుప్పకూలింది. ఈ మ్యాచ్‌లో ఆంధ్రా 307 పరుగుల భారీ తేడాతో రికార్డు విజయాన్ని సొంతం చేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో కూడా మధ్యప్రదేశ్ 91 పరుగులకే కుప్పకూలింది. ఆంధ్రా తొలి ఇన్నింగ్స్‌లో 132 పరుగులకు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో 301 పరుగులు చేసింది. ఓపెనర్లు జ్ఞానేశ్వర్ (43), ప్రశాంత్ కుమార్ (44) శుభారంభం అందించారు. మరోవైపు కరణ్ షిండే అద్భుత సెంచరీతో ఆంధ్రాను ఆదుకున్నాడు. అసా–ధారణ పోరాట పటిమను కనబరిచిన కరణ్ 15 ఫోరలతో 103 పరుగులు చేశాడు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన మధ్యప్రదేశ్ బుధవారం మూడో రోజు 35 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఆంధ్రా కెవి.శశికాంత్ 18 పరుగులు మాత్రమే ఇచ్చి ఆరు వికెట్లు తీశాడు. విజయ్ కుమార్ మూడు వికెట్లు తీయడంతో మధ్యప్రదేశ్ ఇన్నింగ్స్ కుప్పకూలింది. ఎంపి జట్టులో ఇద్దరు మాత్రమే రెండంకెలా స్కోరును అందుకున్నారు. ఏడుగురు ఖాతా తెరవకుండానే ఔటయ్యారు. మరోవైపు చత్తీస్‌గఢ్‌తో జరిగిన మరో మ్యాచ్‌లో ముంబయి 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 92 పరుగుల లక్ష్యాన్ని ముంబయి ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. మణిపూర్‌తో జరిగిన మరో మ్యాచ్‌లో బీహార్ మూడు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. కర్ణాటకతో ఉత్కంఠభరితంగా సాగిన మరో మ్యాచ్‌లో బరోడా రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. మహారాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో రైల్వేస్ ఇన్నింగ్స్ తేడాతో ఘన విజయం సాధించింది. ఇతర మ్యాచుల్లో ఒడిశా, రాజస్థాన్ జట్లు జయకేతనం ఎగుర వేశాయి.



కోహ్లి–బుమ్రా టాప్ ర్యాంక్ పదిలం

ఐసిసి వన్డే ర్యాంకింగ్స్



దుబాయి: వన్డే బ్యాటింగ్, బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా హవా కొనసాగుతోంది. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. బౌలింగ్ విభాగంలో జస్‌ప్రిత్ బుమ్రా మొదటి ర్యాంక్‌ను కాపాడుకున్నాడు. టీమ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా రెండో ర్యాంక్‌లో కొనసాగుతోంది. బ్యాటింగ్‌లో స్టార్ ఆటగాడు రోహిత్ శర్మ రెండో ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. ఇంగ్లండ్ టీమ్ ర్యాంకింగ్స్‌లో టాప్ ర్యాంక్‌ను కాపాడుకుంది. ఐసిసి బుధవారం తాజా ర్యాంక్‌లను ప్రకటించింది. ఇందులో విరాట్ కోహ్లి బ్యాటింగ్ విభాగంలో అగ్ర స్థానాన్ని దక్కించుకున్నాడు. కోహ్లి 899 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. భారత్‌కే చెందిన రోహిత్ శర్మ రెండో ర్యాంక్‌లో నిలిచాడు. రోహిత్ 871 పాయింట్లతో రెండో స్థానాన్ని కాపాడుకున్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన వెటరన్ క్రికెటర్ రాస్ టైలర్ మూడో ర్యాంక్‌లో నిలిచాడు. ఇటీవల శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లో టైలర్ నిలకడగా రాణించి మూడో ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్ నాలుగో, పాకిస్థాన్ క్రికెటర్ బాబర్ ఆజమ్ ఐదో, ఆస్ట్రేలియా స్టార్ డేవిడ్ వార్నర్ ఆరో ర్యాంక్‌లో నిలిచారు. డుప్లెసిస్ (దక్షిణాఫ్రికా), షాయ్ హోప్ (విండీస్)లు తర్వాతి స్థానాల్లో ఉన్నారు. భారత స్టార్ ఓపెనర్ శిఖర్ ధావన్ 9వ ర్యాంక్‌ను దక్కించుకున్నాడు. క్వింటన్ డికాక్ (సౌతాఫ్రికా) కూడా టాప్ టెన్‌లో చోటు సంపాదించాడు. ఇక, బౌలింగ్ విభాగంలో భారత స్పీడ్ స్టర్ బుమ్రా అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. బుమ్రా 841 రేటింట్ పాయింట్లతో ఎవరికి అందనంత దూరంలో ఉన్నాడు. రెండో ర్యాంక్‌లో అఫ్గానిస్థాన్ యువ సంచలనం రషీద్ ఖాన్ నిలిచాడు. రషీద్ 788 పాయింట్లతో రెండో స్థానాన్ని కాపాడుకున్నాడు. భారత యువ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మూడో ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. యజువేంద్ర చాహల్ ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. కాగా, టీమ్ విభాగంలో భారత్ రెండో ర్యాంక్‌లో నిలిచింది. ఇంగ్లండ్ 126 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

ఒకవేళ ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్‌ను భారత్ క్లీన్‌స్వీప్ చేస్తే టాప్ ర్యాంక్‌కు చేరువగా వస్తోంది. అప్పుడూ భారత్ 125 రేటింగ్ పాయింట్లతో టాప్ ర్యాంక్‌కు అడుగు దూరంలో నిలుస్తుంది. తాజా ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ మూడో, సౌతాఫ్రికా నాలుగో, పాకిస్థాన్ ఐదో ర్యాంక్‌లో నిలిచాయి.



టీమిండియాపై పాక్ ప్రశంసలు





కరాచీ: ఆస్ట్రేలియా గడ్డపై చారిత్రక విజయం సాధించిన టీమిండియాను దాయాది పాకిస్థాన్ క్రికెట్ దిగ్గజాలు, మాజీ ఆటగాళ్లు ప్రశంసలతో ముంచెత్తారు. ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలిచిన తొలి ఆసియా జట్టుగా భారత్ చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. దీనిపై ప్రపంచ వ్యాప్తంగా కోహ్లి సేన ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇప్పటికే పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సయితం భారత జట్టును సోషల్ మీడియా వేదికగా అభినందించారు. ఇంగ్లండ్, శ్రీలంక, బంగ్లాదేశ్, విండీస్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా తదితర దేశాలకు చెందిన మాజీ క్రికెటర్లు కూడా భారత జట్టుపై ప్రశంసలు కురిపించారు. తాజాగా పాకిస్థాన్ మాజీ క్రికెటర్లు వసీం అక్రం, మోయిన్ ఖాన్, షాహిద్ అఫ్రిది, ఇంజమామ్, వకార్ యూనిస్, రమీజ్ రాజా, మిస్బాఉల్ హక్ తదితరులు కూడా భారత జట్టును అభినందించారు. ఆస్ట్రేలియా జట్టును సొంత గడ్డపై ఓడించడం ఎంత పెద్ద జట్టుకైనా చాలా కష్టమని, అయితే భారత్ అది ఆచరణలో చేసి చూపించడం సంతోషం కలిగించిందని వారు తమ సందేశంలో పేర్కొన్నారు. చారిత్రక విజయం సాధించిన భారత జట్టుకు, కెప్టెన్‌కు వీరు సోషల్ మీడియా వేదికగా అభినందించారు. పటిష్టమైన దేశవాళి విధానం, క్రికెట్ బోర్డు ముందు చూపు తదితర కారణాలతో ప్రస్తుతం టీమిండియా బలమైన జట్టుగా ఎదిగిందన్నాడు. ఒకప్పుడూ ఆస్ట్రేలియా, విండీస్, ఇంగ్లండ్‌ల మాదిరిగా భారత్ ప్రస్తుతం బలంగా మారిందని, ఆ జట్టును ఓడించడం ప్రత్యర్థులకు చాలా కష్టంగా మారిందని వసీం అభిప్రాయపడ్డాడు. మరోవైపు ప్రపంచంలోనే భారత్ బలమైన బౌలింగ్ లైన‌ప్‌ను కలిగి ఉందని, ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే బౌలర్లకు భారత్‌లో కొదవలేదన్నాడు. అందువల్లే భారత్‌కు ఆస్ట్రేలియా గడ్డపై చారిత్రక విజయం దక్కిందని పాకిస్థాన్ మాజీ కెప్టెన్లు వకార్, మోయిన్ ఖాన్‌లు పేర్కొన్నారు.

ఎంత పొగిడినా తక్కువే

సచిన్ టెండూల్కర్



ముంబయి: ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్ గెలిచిన టీమిండియాపై భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. దశాబ్దాల కలను సాకారం చేసిన కోహ్లి సేనను ఎంత పొగిడిన తక్కువేనని సచిన్ అన్నాడు. బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ విషయం చెప్పాడు. హేమాహేమీ ఆటగాళ్లు ఉన్నప్పుడూ కూడా సాధ్యం కానీ విజయాన్ని కోహ్లి సారథ్యంలోని యువ జట్టు సాధించిందన్నాడు. భారత క్రికెట్ చరిత్రలో ఈ గెలుపు చిరకాలం గుర్తుండి పోతుందన్నాడు. ఈ సిరీస్‌లో చటేశ్వర్ పుజారా బ్యాటింగ్ చారిత్రాత్మకమన్నాడు. అతను ఆడిన తీరు చూడముచ్చటగా ఉందన్నాడు. ఇతర బ్యాట్స్‌మన్ తడబడిన పిచ్‌లపై పుజారా అసాధారణ బ్యాటింగ్‌ను కనబరిచాడని సచిన్ ప్రశంసించాడు. నయా వాల్ బిరుదును పుజారా మరింత పదిలం చేసుకున్నాడన్నాడు. ద్రవిడ్ తర్వాత అంతటి గొప్ప పుజారా మాత్రమేనని, క్లిష్ట పరిస్థితుల్లోనూ నిబ్బరంగా ఆడడం ఒక్క అతనికి మాత్రమే సాధ్యమవుతుందన్నాడు. ఇక, జట్టును ముందుండి నడిపించిన కెప్టెన్ విరాట్ కోహ్లిను కూడా సచిన్ అభినందించాడు. కోహ్లి అద్భుత సారథ్యం వల్ల భారత్ చారిత్రక విజయాన్ని దక్కించుకుందన్నాడు. ఇక, స్పీడ్ స్టర్ జస్‌ప్రిత్ బుమ్రాపై కూడా సచిన్ ప్రశంసలు కురిపించాడు. అతి తక్కువ సమయంలోనే బుమ్రా అగ్రశ్రేణి బౌలర్‌గా ఎదిగాడన్నాడు. అతనికి ఎంతో భవిష్యత్తు ఉందన్నాడు. మహ్మద్ షమి, ఇషాంత్, కుల్దీప్, జడేజా, అశ్విన్‌లు కూడా బాగానే బౌలింగ్ చేశారన్నాడు. సమష్టి పోరాటం వల్లే భారత్‌కు చిరస్మరణీయ విజయం దక్కిందని సచిన్ పేర్కొన్నాడు.

హరేంద్ర సింగ్‌పై వేటు



న్యూఢిల్లీ: భారత పురుషుల హాకీ జట్టు కోచ్ పదవి నుంచి హరేంద్ర సింగ్‌ను తొలగించారు. అతను కోచ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత హాకీ ఆశించిన స్థాయిలో ప్రదర్శన కనబరచలేక పోయింది. దీంతో అతన్ని కోచ్ పదవి నుంచి తప్పిస్తూ భారత హాకీ సమాఖ్య బుధవారం నిర్ణయం తీసుకుంది. జూనియర్ జట్టు కోచ్‌గా హరేంద్ర అద్భుత ఫలితాలను రాబట్టాడు. దీంతో అతన్ని సీనియర్ జట్టుకు కూడా కోచ్‌గా నియమించారు. కానీ అతని పర్యవేక్షణలో సీనియర్ జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేక పోయింది. ఇటీవల ముగిసిన ప్రపంచ కప్ హాకీలో, ఆసియా క్రీడల్లో భారత పురుషుల జట్టు నిరాశ పరిచింది. దీంతో హరేంద్రను సీనియర్ జట్టు కోచ్ పదవి నుంచి తప్పించారు. ఈ విషయాన్ని హాకీ సమాఖ్య బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

కష్టకాలంలో ఆస్ట్రేలియా క్రికెట్

వరుస ఓటములతో సతమతం

తప్పులు సరిదిద్దుకుంటేనే భవిష్యత్తు



మన తెలంగాణ/క్రీడా విభాగం: ఒకప్పుడూ ప్రపంచ క్రికెట్‌లో ఎదురులేని శక్తిగా ఏకచక్రాధిపత్యం చెలాయించిన ఆస్ట్రేలియా జట్టు పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది. భారత్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో ఓటమే దీనికి నిదర్శనంగా చెప్పొచ్చు. గతంలో ఇంటాబయట అనే తేడా లేకుండా సిరీస్‌లు ఎక్కడ జరిగిన ఆస్ట్రేలియా ఏకపక్షంగా విజయాలు సాధించేది. 1970, 80 దశాబ్దాల్లో వెస్టిండీస్ సాధించిన విధంగానే 1990, 2000 దశకాల్లో ఆస్ట్రేలియా పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఇక, సొంత గడ్డపై జరిగే సిరీస్‌లలో అయితే ఆస్ట్రేలియాకు ఎదురే ఉండేది కాదు. దాదాపు అన్ని మ్యాచుల్లోనూ భారీ తేడాతో విజయాలు సొంతం చేసుకునేది. ఇక, ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ అంటేనే ముందుగా ఫలితాలపై అంచనాలకు వచ్చే వారు. అన్ని ఫార్మాట్‌లలోనూ ఆస్ట్రేలియా అసాధారణ విజయాలు సాధించి ప్రత్యర్థులకు అందనంత ఎత్తులో ఉండేది. అయితే రానురాను ప్రపంచ క్రికెట్‌లో ఆస్ట్రేలియా హవా తగ్గుతూ వస్తోంది. కిందటి వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా విశ్వవిజేతగా నిలిచినా టెస్టు, వన్డేల్లో, ట్వంటీ–20లలో ప్రభ తగ్గుతూ వస్తోంది. సొంత గడ్డపై, విదేశాల్లో జరిగే సిరీస్‌లలో ఆస్ట్రేలియాకు అవమానకర ఓటములు తప్పడం లేదు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో మునుపటి జోష్ కనిపించడం లేదు. భారత్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా వంటి జట్లతో పోల్చితే ప్రస్తుతం ఆస్ట్రేలియా పరిస్థితి దయనీయంగా కనిపిస్తోంది. ఇక, దక్షిణాఫ్రికా సిరీస్ సందర్భంగా తలెత్తిన బాల్ టాంపరింగ్ వివాదం ఆస్ట్రేలియాను మరింత ఇబ్బందుల్లోకి నెట్టింది. ఈ వివాదం తర్వాత కీలక ఆటగాళ్లు స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్‌లు జట్టుకు దూరం కావాల్సి వచ్చింది. వీరి సేవలు అందుబాటులో లేకుండా పోవడంతో జట్టు పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. పాకిస్థాన్‌తో ఇటీవల జరిగిన టెస్టు సిరీస్‌లో ఆస్ట్రేలియాకు ఘోర పరాజయం తప్పలేదు. తాజాగా సొంత గడ్డపై భారత్‌తో జరిగిన సిరీస్‌లోనూ చేదు అనుభవం ఎదురైంది. 71 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం భారత్ ఇక్కడ టెస్టు సిరీస్‌ను సొంతం చేసుకుంది. గతంలో ఎప్పుడూ కూడా భారత్ కంగారూ గడ్డపై టెస్టు సిరీస్ గెలవలేదు. ఒక్క రెండో టెస్టు మినహా సిరీస్ మొత్తంలో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. వర్షం అడ్డుపడక పోతే చివరి టెస్టులోనూ భారత్ భారీ విజయం సాధించేదే. అయితే వర్షుడు భారత్ అవకాశాలను అడ్డుకున్నాడు. ఒకప్పుడూ ప్రత్యర్థి జట్లకు కొరకరాని కొయ్యగా ఉన్న ఆస్ట్రేలియా జట్టు పరిస్థితి ప్రస్తుతం తీసికట్టుగా తయారైంది. బంగ్లాదేశ్ వంటి చిన్న జట్లను సయితం ఓడించలేని స్థితికి ఆస్ట్రేలియా పడిపోయింది. దీన్ని బట్టి కంగారూల ఆట ఎంత దయనీయంగా మారిందో ఊహించుకోవచ్చు.

కొరవడిన ఆత్మవిశ్వాసం

ఆస్ట్రేలియా జట్టులో ప్రతిభకు కొదవలేదు. అయితే ఆ జట్టులో ఆత్మవిశ్వాసం కనిపించడం లేదు. గతంలో అలన్ బోర్డర్, స్టీవ్‌వా, మార్క్ టేలర్, రికి పాంటింగ్, మైఖేల్ క్లార్క్‌ల సారథ్యంలో ఆస్ట్రేలియా ఏకపక్ష విజయాలు సాధించింది. అప్పటితో పోల్చితే ప్రస్తుతం కూడా ఆస్ట్రేలియా జట్టులో ప్రతిభావంతులైన క్రికెటర్లకు కొదవలేదు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లు జట్టులో ఉన్నారు. కానీ వీరికి సరైన మార్గ నిర్దేశం చేసే వారు లేకుండా పోయారు. వార్నర్, స్మిత్‌లపై నిషేధం విధించడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. బాల్ టాంపరింగ్ వివాదం ఆస్ట్రేలియా జట్టుపై తీవ్ర ప్రభావం చూపింది. ఆ ఉదాంతం నుంచి ఆటగాళ్లు బయట పడలేక పోతున్నారు. ప్రత్యర్థి జట్లను ధైర్యంగా ఎదుర్కొవడంలో ఆస్ట్రేలియా ఘోర వైఫల్యం చవిచూస్తోంది. దీంతో పలు సిరీస్‌లలో ఘోర పరాజయాలు తప్పడం లేదు. ఇప్పటికైనా క్రికెట్ ఆస్ట్రేలియా ఈ విషయంపై దృష్టి సారించాలి. ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపే క్రికెటర్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించాలి. కోచ్ కూడా ఆటగాళ్ల ప్రతిభను వెలికి తీసి వారు మళ్లీ గాడిలో పడేలా చేయాలి. అప్పుడే ఆస్ట్రేలియాకు పూర్వ వైభవం సాధ్యమవుతోంది. లేకుంటే ఆస్ట్రేలియా పరిస్థితి కూడా వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వేల మారడం ఖాయం.





పాకిస్థాన్ వైఖరిలో మార్పు వచ్చిందని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాల యుసఫ్‌జాయ్ చెప్పారు. ఆరేళ్ల కిందట తాలిబన్లు దాడి చేసిన తర్వాత తను దేశం వదిలి వచ్చానని, అప్పటికి ఇప్పటికి కొంత శాంతియుత పరిస్థితి నెలకొన్నా, ఇంకా జరగాల్సింది చాలా ఉందని ఆమె అన్నారు. తన అనుభవాలను వివరిస్తూ 'వియ్ ఆర్ డిస్‌ప్లేస్‌డ్: మై జర్నీ అండ్ స్టోరీస్ ఫ్రం రెఫ్యూజీ గర్ల్స్ ఎ రౌండ్ ది వరల్డ్ పేరుతో ఒక పుస్తకం రాశారు.

31 నుంచి బడ్జెట్ సమావేశాలు?

పార్లమెంట్ బడ్జెట్ సెషన్ ఖరారు?

న్యూఢిల్లీ : పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 13 వరకూ జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ సెషన్ సందర్భంగా ఫిబ్రవరి 1వ తేదీన మధ్యంతర బడ్జెట్‌ను సభలకు సమర్పించే అవకాశం ఉంది. ఈ విషయాలను అధికారవర్గాలు బుధవారం తెలిపాయి. రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ బుధవారం ఇక్కడ హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశం అయింది. బడ్జెట్ సెషన్ తేదీల ఖరారుపై తర్జనభర్జనలు జరిపింది. పార్లమెంట్ బడ్జెట్ తేదీలను అధికారికంగా రాజ్యసభ నిరవధిక వాయిదా తరువాత ప్రకటిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాల ప్రొరోగ్‌పై కేబినెట్ కమిటీ లాంఛనంగా సిఫార్సు చేస్తుంది. వీటిని తరువాత రాష్ట్రపతి ఆమోదానికి పంపిస్తారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకూ బడ్జెట్ భేటీ ఉంటుందని స్పష్టం అయినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జనవరి 31వ తేదీన రాష్ట్రపతి పార్లమెంట్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తారు. అదేరోజున ఆర్థిక సర్వేను సభలో ప్రవేశపెడుతారని వెల్లడైంది. సాధారణంగా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు రెండు దశలలో జరుగుతాయి. అయితే సార్వత్రిక ఎన్నికలు ఎప్రిల్ లేదా మే నెలల్లోనే జరగనుండటంతో



ఈసారి ఒకే దశలో బడ్జెట్ సెషన్ ముగుస్తుంది. ప్రస్తుత లోక్‌సభకు ఈ బడ్జెట్ సెషన్ చివరిది అవుతుంది. ఈ నేపథ్యంలో బడ్జెట్ సెషన్ అటు అధికార పక్షానికి ఇటు ప్రతిపక్షానికి చాలా కీలకంగా మారింది. శీతాకాల సెషన్ మంగళవారంతో ముగియాల్సి ఉంది. అయితే కోటా బిల్లును తీసుకువరావడంతో రాజ్యసభను బుధవారం కూడా నిర్వహించారు. లోక్‌సభ శీతాకాల సమావేశాలు కోటా బిల్లు ఆమోదంతో నిర్ణీతంగా మంగళవారమే ముగిశాయి.

ఎన్నికల కోణంలో మధ్యంతర బడ్జెట్

బడ్జెట్ సమర్పణల రికార్డున్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈసారి ప్రవేశపెట్టేది మధ్యంతర బడ్జెట్‌గా నిలుస్తుంది. 2019 లోక్‌సభ ఎన్నికల సంవత్సరం. ఎన్నికలు జరిగే ఏడాది ఏ ప్రభుత్వం కూడా పూర్తి స్థాయి బడ్జెట్‌ను పార్లమెంట్‌కు సమర్పించదు. ఈ ఏడాది మే నెలలోనే లోక్‌సభ ఎన్నికలు ఉంటాయి కాబట్టి ఇప్పుడు జైట్లీ తమ మధ్యంతర ఆర్థిక చిట్టాకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అయితే పేరుకు మధ్యంతర లేదా తాత్కాలిక బడ్జెట్ అయినా ఇది పూర్తి స్థాయి బడ్జెట్‌గానే ఉంటుంది. ప్రస్తుత ఏడాది లెక్కలు, పద్దులతో పాటు రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఆదాయం, వ్యయం పలు కార్యక్రమాలకు పథకాలకు కేటాయింపులను ఇందులో వివరిస్తారు. ఇది మోడీకి అత్యంత కీలకమైన ఎన్నికల సంవత్సరం కావడంతో, ఈ బడ్జెట్‌లో పలు కీలక వర్గాలను అనేక విధాలుగా ప్రసన్నం చేసుకుని ఓట్లు రాబట్టుకునేందుకు తగు విధంగా కసరత్తులు జరుగుతున్నాయి. ఓ వైపు కోటా బిల్లు వంటి ఎత్తుగడలు మరో వైపు బడ్జెట్ సకల జన ప్రియం అయితేనే అధికార వ్యతిరేకత సమసిపోతుందని మోడీ భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగానే బడ్జెట్‌లో కేటాయింపుల గురించి మోడీ వేర్వేరుగా కీలక మంత్రిత్వశాఖలతో చర్చిస్తున్నారు. ఎన్నికల బడ్జెట్‌గా మారే ఈ బడ్జెట్ ఇప్పుడు మోడీ వ్యూహరచనకు, జైట్లీ వేదిక కల్పనకు పరీక్షగా మారింది.

మహిళా మంత్రిని అవమానించారు



- రాఫెల్ మరక అంటించాలని చూశారు
- అబద్ధాలకోరులకు 10 శాతం కోటా జవాబు
- 'మైఖేల్ మామ' అడ్డుకుంటేనే అప్పుడు రాఫెల్ ఆగిందా?
- ఆగ్రా, సోలాపూర్ బహిరంగ సభల్లో రాహుల్‌పై విమర్శ

ఆగ్రా/సోలాపూర్ : రక్షణశాఖ మంత్రిగా ఉన్న మహిళ నిర్మలా సీతారామన్‌ను కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అవమానించారని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. ఆమెకు రాఫెల్ డీల్ మరక అంటించాలని చూశారని దుయ్యబట్టారు. బుధవారంనాడు ఆగ్రా, సోలాపూర్‌లలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోడీ అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ప్రసంగించారు. దేశానికి మొట్టమొదటి రక్షణమంత్రిగా నిర్మల సేవలందిస్తున్నందుకు గర్వపడాలి అన్నారు. దేశ రక్షణకోసం అహరహం శ్రమిస్తున్న బలగాలకు ఆమె నాయకత్వం వహిస్తున్నారని ప్రశంసించారు. రాఫెల్‌పై పార్లమెంట్‌లో విపక్షాల ప్రశ్నలను నిర్మల ధైర్యంగా తిప్పికొట్టారని మోడీ కొనియాడారు. ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం కోటా కల్పించడానికి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లును సమర్థించుకున్నారు. అబద్ధాలు ప్రచారం చేస్తున్నవారికి ఈ బిల్లు గట్టి సమాధానమని అన్నారు. రాజ్యసభ కూడా ఈ బిల్లును ఆమోదిస్తుందన్న ఆశాభావాన్ని ప్రధాని వ్యక్తం చేశారు. అగ్రవర్ణాల్లోని పేదలకు 10 శాతం కోటా కల్పించడం వల్ల దళితులు, గిరిజనులకు ఎలాంటి నష్టం వాటిల్లదని, కొన్ని పార్టీలు చేసే అబద్ధపు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. అదే సమయంలో రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు వివాదంపై మోడీ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై ఎదురుదాడికి దిగారు. యుపిఎ హయాంలో రాఫెల్ ఒప్పందం నిలిచిపోవడానికి అగస్టావెస్ట్‌ల్యాండ్ దళారి క్రిస్టియన్ మైఖేల్ మామ జోక్యమే కారణమా? అంటూ రాహుల్‌ను ప్రశ్నించారు. మీడియా కథనాల ప్రకారం విదేశాల నుంచి భారతదేశానికి అరెస్టు చేసి తీసుకొచ్చిన అగస్టావెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కుంభకోణం మధ్యవర్తి మైఖేల్‌కు రాఫెల్ ఒప్పందంలో కూడా భాగస్వామ్యం ఉంది అని మోడీ ఆరోపించారు. "మీ హయాంలో ఒప్పందం ఆగిపోవడానికి మైఖేల్ మామే కారణమా? ఈ ప్రశ్నలకు సమాధానాల కోసం దర్యాప్తు సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ప్రజలు కూడా సమాధానాలు ఆశిస్తున్నారు" అంటూ మోడీ వ్యాఖ్యానించారు. రాఫెల్‌కు పోటీదారైన యూరోఫైటర్‌కు కాంట్రాక్టు దక్కేందుకు మైఖేల్‌తోపాటు గైడో హాష్కే అనే మరో దళారి పథకం వేసినట్లు ఇదివరకు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. పౌరసత్వ బిల్లుకు కొన్ని వర్గాల్లో అపోహలు ఉన్నాయని, ఈ బిల్లు కారణంగా అసోంలోని ఏ ఒక్క పౌరుడి హక్కులకు భంగం వాటిల్లబోదని మోడీ హామీ ఇచ్చారు.

దేశమంతా రైతు రుణమాఫీ

రాహుల్ వాగ్దానం.. హరిత విప్లవ సంకల్పం



జైపూర్ : లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధిస్తే దేశవ్యాప్తంగా రైతుల రుణమాఫీ చేసి తీరుతామని కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ చెప్పారు. జైపూర్‌లో బుదవారం ఆయన కిసాన్ ర్యాలీలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రాజస్థాన్‌లో రైతుల సభ ఆద్యంతం జోరుగా సాగింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్ని రాష్ట్రాల్లో రుణమాఫీనే తమ తొలి ప్రకటన అని, దీనిపైనే తమ మొదటి సంతకం అని రాహుల్ తేల్చిచెప్పారు. దీనిని తాము ఖచ్చితంగా అమలు చేసితీరుతామన్నారు. ర్యాలీలో పలువురు కాంగ్రెస్ నేతలతో కలిసి రాహుల్ ఇందులో పాల్గొన్నారు. ఇటీవలి అసెబ్లీ ఎన్నికలలో రైతాంగం ప్రధాని మోడీకి తమ బలమేమిటనేది చవిచూపించారని రాహుల్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం, బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ వ్యతిరేక విధానాలను అనుభవిస్తున్నాయని విమర్శించారు. దక్కని గిట్టుబాటు ధరలు, పంట రుణాల ఒత్తిళ్లతో రైతులు ఇంతకాలం రగిలిపోతూ వస్తున్నారని రాహుల్ చెప్పారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో దీని ఫలితం బిజెపి అనుభవించింది. ఇక రాబోయే లోక్‌సభ ఎన్నికల్లోనూ వారి నుంచి గట్టి చెంపదెబ్బను బిజెపి వారు రుచిచూస్తారని రాహుల్ అన్నారు. . దేశంలో తీవ్రస్థాయి వ్యవసాయ నైరాశ్యాన్ని తొలిగించడంలో ఇప్పుడు కాంగ్రెస్ చేపట్టిన రుణమాఫీ కేవలం ఆరంభం అన్నారు. దేశంలో నూతన హరిత విప్లవంతోనే పూర్తి స్థాయిలో వ్యవసాయ క్లిష్టతకు పరిష్కారం దక్కుతుందన్నారు. రాఫెల్ డీల్‌పై తాను అడిగిన ప్రశ్నలకు ప్రధాని మోడీ పార్లమెంట్‌లో జవాబు చెప్పలేక పారిపపొయ్యారని, ఈ చౌకీదారు పారిపోవడం దేనికి సంకేతం అనుకోవాలని ప్రశ్నించారు.

మహాకూటమిలో చేరం

- బిజెపి, కాంగ్రెస్‌లకు సమదూరం
- ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్



భువనేశ్వర్ : కేంద్రంలో ప్రధానమంత్రి మోడీకి వ్యతిరేకంగా ఏర్పాటు చేస్తున్న మహాకూటమిలో చేరే ఉద్దేశం తమకు ఏ మాత్రం బిజూ జనతాదళ్ అధ్యక్షుడు, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్పష్టం చేశారు. బిజెడి బుధవారంనాడిక్కడ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతృత్వంలోని మహా కూటమిలోగానీ, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమిలోగానీ చేరబోమని బుధవారం ప్రకటించారు. దేశంలోని రెండు ప్రధాన పార్టీలకు బీజేడీ సమదూరం పాటిస్తుందనానరు. వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని నవీన్ అన్నారు. రైతుల సమస్యలన్నీ తీర్చుతామని 2014 ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన బిజెపి ఇప్పుడు వారి గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఒడిశాలో పాలక బిజెడి 2000–2009 సంవత్సరం వరకు బిజెపితో పొత్తు పెట్టుకుంది. 2009 ఎన్నికల తర్వాత ఆ పార్టీతో తెగదెంపులు చేసుకుంది. అప్పటి నుంచి బిజెపికి పట్నాయక్ దూరంగా ఉంటూ వస్తున్నారు. మరోవైపు బిజెపి సిఎం నవీన్ పట్నాయక్‌పై తాజా ప్రకటన తర్వాత కూడా ఆరోపణలు గుప్పించింది. ముఖ్యమంత్రి పట్నాయక్ కాంగ్రెస్‌తో తెరవెనక మంత్రాంగం నడుపుతున్నారని, ఆయన రహస్య ఎజెండాను అమలు చేస్తూ రాష్ట్ర ప్రజలను వచ్చే ఎన్నికల్లో మోసం చేయాలని చూస్తున్నారని ఒడిశా బిజెపి రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వసంత పాండా ఆరోపించారు.

సిబిఐ డైరెక్టర్‌గా వర్మ బాధ్యతలు

డైరెక్టర్ ఎంపిక కమిటీకి జస్టిస్ సిక్రీ



న్యూఢిల్లీ : 77 రోజుల బలవంతపు విరామానంతరం అలోక్ వర్మ బుధవారం సిబిఐ డైరెక్టర్‌గా తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఆయనను బాధ్యతల నుంచి పక్కన బెట్టడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. తిరిగి బాధ్యత స్వీకరణకు మార్గం సుగమం చేసింది. దీనితో బలవంతపు సెలవును వీడి అలోక్ వర్మ తమ కార్యాలయానికి వచ్చారు. కేంద్ర ప్రభుత్వ అసాధారణ చర్యను సుప్రీంకోర్టు కొట్టివేసింది. మంగళవారం ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు వారు వర్మ బాధ్యతలు స్వీకరించవచ్చునని తెలిపారు. కానీ ఆయనపై ఉన్న అవినీతి అభియోగాలపై సివిసి దర్యాప్తు పూర్తి అయ్యేవరకూ ఎటువంటి విధాన నిర్ణయాలు తీసుకోరాదని తీర్పులో షరతు విధించారు. వర్మ ఈ నెల 31వ తేదీనే రిటైర్ కావల్సి ఉంది. వినీత్ నారాయన్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు సిబిఐ డైరెక్టర్ పదవీ కాలం రెండేళ్లు. ఈ కాలంలో రాజకీయ జోక్యాలకు వీల్లేకుండా సుప్రీం నుంచి రక్షణ ఉంది. అయితే తరువాత లోక్‌పాల్ చట్టం పరిధిలో సిబిఐ డైరెక్టర్ ఎంపికను సెలెక్షన్ కమిటీకి అప్పగించారు. ఈ కమిటీలో ప్రధాని, ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉంటారు. అయితే వర్మను తిరిగి సిబిఐ డైరెక్టర్‌గా నియమించాలని తీర్పును ప్రధాన న్యాయమూర్తి వెలువరించినందున ఎంపిక అంశంపై ప్రధాన న్యాయమూర్తి నిర్ణయం అనుచితం అవుతుందని విశ్లేషణలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలోనే తన బదులు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి ఎకె సిక్రిని సెలెక్షన్ కమిటీకి నామినేట్ చేస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ బుధవారం తెలిపారు. ప్రధాని, ప్రతిపక్ష నేత ఇప్పుడు నియమితులు అయిన జస్టిస్ సిక్రీతో కూడిన కమిటీ వర్మ పదవీకాలంపై ఎటువంటి నిర్ణయం తీసుకోనుందనేది కీలకంగా మారింది. సివిసి దర్యాప్తులో వర్మకు క్లీన్‌చిట్ లభిస్తే, ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే, జస్టిస్ సిక్రీ అనుకూలత వ్యక్తం చేస్తే తిరిగి సిబిఐ డైరెక్టర్‌గా వర్మ నియమితులు అయ్యేందుకు వీలుందని వెల్లడైంది.



ఆర్థికమంత్రిత్వ శాఖ బుధవారంనాడు విద్యుత్ వాహనాలను ప్రారంభించింది. వాటికి ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం. గాలిలో కార్బన్‌డై ఆక్సైడ్‌ను తగ్గించే ఉద్దేశంతో వీటిని ప్రవేశపెడుతున్నట్లు ఈ సందర్భంగా ఆర్థిక శాఖ ప్రకటించింది. శాఖా పరమైన అవసరాలకు ఈ వాహనాలను వీటినే ఉపయోగించనున్నట్లు వివరించింది.

అతను 'అమెరికన్ హీరో'

హత్యకు గురైన సింగ్‌కు ట్రంప్ ప్రశంస



వాషింగ్టన్ : భారతీయ సంతతికి చెందిన పోలీస్ అధికారి రోనిల 'రోన్' చేసిన త్యాగం అనుపమానమైందని, సరిహద్దు గోడనిర్మాణంకోసం కృషి చేసిన ఆయన 'అమెరికన్ హీరో' అని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రశంసించారు. స్టానిస్లాస్ కౌంటీలో న్యూమాన్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసే 33 ఏళ్ల కార్పొరల్ సింగ్‌ను మెక్సికోకు చెందిన ఒక అక్రమ వలసదారుడు డిసెంబర్ 26న కాలిఫోర్నియాలో ట్రాఫిక్ స్టాప్ వద్ద పాశవికంగా కాల్చి హత్య చేశాడు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కలలు కన్న మెక్సికో బార్డర్ వాల్ నిర్మాణానికి... డెమొక్రాట్లకు నచ్చచెప్పి నిధులు సేకరించేందుకు సింగ్ శ్రమపడ్డారు. ఓవెల్ ఆఫీస్ నుంచి జాతి నుద్దేశించి ట్రంప్ చేసిన మొదటి ప్రసంగంలో ...మెక్సికో సరిహద్దు వెంట గోడ కట్టాలని సూచించారు. హత్యకు గురైన సింగ్ గురించి ఆయన కుటుంబ సభ్యులతోను, అతను పనిచేసిన లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌లోని సహోద్యోగులతోనూ ట్రంప్ మంగళవారం మాట్లాడారు. 'సరిహద్దు దాటి వచ్చిన ఒక అక్రమ వలసదారుడు యువ పోలీస్ అధికారిని కాలిఫోర్నియాలో క్రిస్మస్ తర్వాత దారుణంగా హత్య చేశాడని తెలిసిన తర్వాత అమెరికన్ల గుండె పగిలింది' అని ట్రంప్ ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా అక్రమ వలసదారుల చేతిలో ఎందరో హత్యకు గురయ్యారని, బాధితుల కుటుంబాలను కలిసి ఓదార్చానని ట్రంప్ అన్నారు. అక్రమ వలసలు, డ్రగ్ ట్రాఫికింగ్ ఆగాలంటే ఒకే ఒక మార్గం...గోడ కట్టడమేనని ట్రంప్ మళ్లీ చెప్పారు. మెక్సికో నుంచి అక్రమంగా సరిహద్దు దాటి వచ్చి పోలీస్ అధికారి సింగ్‌ను హత్య చేసిన వ్యక్తి గుస్టావో పెరెజ్ అని గుర్తించిన కాలిఫోర్నియా పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు.

బిజెపిని బొంద పెడతాం : శివసేన



ముంబయి: లోక్‌సభ ఎన్నికలకు ముందస్తు పొత్తు కార్యరూపం దాల్చకుంటే మాజీ భాగస్వామ్య పక్షాలను ఓడిస్తామన్న అమిత్‌షా వ్యాఖ్యలపై శివసేన సీనియర్ నేత రామదాస్ కదమ్ స్పందించారు. ఐదు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బిజెపి ఘోరంగా ఓడిపోయిందని, మహారాష్ట్రకు వచ్చి మమ్మల్ని బెదిరిస్తే బిజెపిని తామే బొంద పెడతామని ఆయన హెచ్చరించారు. మోడీ హవా ఉన్నప్పుడే తాము 63 సీట్లు గెలుచకున్న విషయం బిజెపి మరవొద్దని మహారాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా పని చేస్తున్న కదమ్ పేర్కొన్నారు. కేంద్రం, మహారాష్ట్రలో బిజెపికి శివసేన మిత్ర పక్షంగా ఉంది.

ఎన్‌డిఎకు మరో పార్టీ గుడ్‌బై!

షిల్లాంగ్: ఎన్‌డిఎ కూటమి నుంచి మరో పార్టీ బయటకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. పౌరసత్వ సవరణ బిల్లుకి లోక్‌సభలో ఆమోదం తెలపడంతో అసోం గణ పరిషత్(ఎజిపి) ఎన్‌డిఎతో తెగదెంపులు చేసుకుంటున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. ఇప్పుడు మేఘాలయకు చెందిన నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) కూడా ఎన్‌డిఎ నుంచి బయటికి రావాలని చూస్తున్నట్లు సమాచారం. పౌరసత్వ బిల్లును మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బిజెపితో ఉన్న పొత్తును తెగదెంపులు చేసుకోవాలనే విషయంతో పార్టీ నేతలతో చర్చించనున్నట్లు తెలిపారు. ఎన్‌డిఎతోనే కొనసాగాలా? వద్దా? అనే దానిపై పార్టీ నేతలతో విస్తృతంగా చర్చలు జరిపిన అనంతరం దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

మాజీ ఐఎఎస్ అధికారి అక్రమాస్తులు జప్తు

న్యూఢిల్లీ : అక్రమాస్తుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేరళ మాజీ ఐఎఎస్ అధికారి సూరజ్‌కు చెందిన రూ.8కోట్ల అక్రమాస్తులను కేంద్ర దర్యాప్తు సంస్థ అయిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. ఇందులో 13 స్థిరాస్తులు, నాలుగు వాహనాలను, రూ.23లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు బుధవారం ప్రకటించింది. మనీలాండరింగ్ చట్టానికి వ్యతిరేకంగా ఐఎఎస్ అధికారి సూరజ్ అక్రమాస్తులను కలిగి ఉన్నట్లు గుర్తించి, 2014లో అవినీతి నిరోధక శాఖ, విజిలెన్స్ అధికారులు అతడిపై కేసు నమోదు చేశాయి. సూరజ్‌పై చార్జ్‌షీట్ నమోదు కాగానే ఆ రాష్ట్ర ప్రభుత్వం అతనిని సస్పెండ్ చేసింది.

ఆస్పత్రిలో మంటలు



నాగపూర్: స్థానిక కింగ్స్‌వే రోడ్డులో ఉన్న సంచేతి ఆస్పత్రిలో మంటలు చెలరేగి కనీసం 20 మంది వ్యక్తులు భవనంలో చిక్కుకున్నారు. ఇటీవలే నిర్మించిన 10 అంతస్తుల ఆసుపత్రి భవనంలో బుధవారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. మంటలకు కారణమేమిటో నిర్ధారణ కానప్పటికీ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు ఏర్పడి ఉండవచ్చని ప్రాథమిక సమాచారం. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరిగినట్లు తెలియరాలేదు. అగ్ని మాపక సిబ్బందితో పాటు సైనిక జవాన్లు కూడా సహాయక కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. నిర్మాణంలో ఉన్న ఈ భవనంలో చిక్కుకున్న వారు రోగులా లేక కార్మికులా అన్నది కూడా ఇంకా తెలియరాలేదు.

జగన్నాథ ఆలయం ఎమికస్ క్యూరీగా రంజిత్

భువనేశ్వర్ : ఒడిశాలోని పూరీలో నెలకొన్న ప్రఖ్యాత పూరీ జగన్నాథ ఆలయం ఎమికస్ క్యూరీగా మాజీ సొలిసిటర్ జనరల్ రంజిత్ కుమార్‌ను సుప్రీంకోర్టు బుధవారంనాడు నియమించింది. జగన్నాథాలయం పరిపాలనా వ్యవహారాల నిర్వహణకు అనుసరించాల్సిన విధివిధానాల రూపకల్పనలో సుప్రీంకోర్టుకు రంజిత్ కుమార్ సహకరిస్తారు. ఆలయ పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన 12 ప్రతిపాదనల అమలుపై శ్రీ జగన్నాథాలయం నిర్వాహకులు, పూరీ శంకరాచార్య, సర్వేటర్లతో రంజిత్ కుమార్ చర్చలు జరుపుతారు.

కలెక్టర్ కూతురుకు అంగన్‌వాడీ చదువు!



చెన్నై: పేద కార్మికులు కూడా అప్పు చేసి మరీ తమ పిల్లల్ని కార్పొరేట్ స్కూళ్లలోనూ, ప్లే స్కూళ్లలోనూ చేరుస్తున్న ఈ కాలంలో తమిళనాడులోని తిరునల్వేలి జిల్లా కలెక్టర్ శిల్పా ప్రభాకర్ సతీష్ మాత్రం తన ఒక్కగానొక్క కుమార్తెను అంగన్‌వాడీలో చేర్పించారు. 2009 బ్యాచ్ ఐఎఎస్ అధికారి అయిన శిల్ప తిరునల్వేలికి తొలి మహిళా కలెక్టర్‌గా గత ఏడాది మేలో వచ్చారు. తన కుమార్తెను ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే అంగన్‌వాడీలో చేర్పించినందుకు తాను సంతోషిస్తున్నానని ఆమె చెబుతున్నారు.

రైలు ప్రమాదంలో ముగ్గురు మృతి

600 మందికి గాయాలు

జోహాన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలో రైలు ప్రమాదం జరిగింది. ప్రిటోరియాలో ఎదురెదురుగా వస్తున్న రెండు ప్యాసింజర్ రైళ్లు ఢీకొట్టుకోవడంతో ముగ్గురు ప్రయాణికులు మృతి చెందగా, 641 మంది గాయపడ్డారని ఉత్తర ప్రిటోరియా అధికార ప్రతినిధి చార్లెస్ చార్లెస్ మబాసో మీడియాకు తెలిపారు. 11 మందికి తీవ్ర గాయాలు, 62 మందికి ఓ మోస్తారుగా దెబ్బలు తగిలినట్లు తెలిపారు. బుధవారం ఉదయం రద్దీ సమయంలో ఘటన చోటు చేసుకుంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. సిగ్నల్ వైఫల్యంతోనే చోరి జరిగినట్లు రవాణా శాఖ మంత్రి బ్లేడ్ జిమాండే తెలిపారు.

6 లోక్‌సభ స్థానాలకు ఆర్‌ఎల్‌డి డిమాండ్

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ప్రతిపక్ష పార్టీల పొత్తు (మహా గట్‌బంధన్)లో భాగమైన రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్‌డి) ఆరు లోక్‌సభ స్థానాలు తమకే ఇవ్వాలంటూ ఆ పార్టీ చీఫ్ మసూద్ అహమ్మద్ డిమాండ్ చేశారు. అధికార బిజెపికి వ్యతిరేకంగా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలు కలిసి 'మహా గట్‌బంధన్' పేరిట పొత్తుగా ఏర్పడ్డాయి. పొత్తులో భాగమైన తమ పార్టీ ఆర్‌ఎల్‌డికి బాగ్‌పట్, మతుర, ముజఫర్‌నగర్, హత్రస్, అమ్రోహ, కైరానా లోక్‌సభ స్థానాలను ఇవ్వాలని మసూద్ అహమ్మద్ కోరారు. ఇటీవల కాలంలో కైరానాకు జరిగిన ఉప ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి), బిఎస్‌పి మద్దతుతో ఆర్‌ఎల్‌డి అభ్యర్థి తబుస్సుమ్ హసన్ విజయం సాధించారు. పై ఆరు స్థానాల విషయమై ఇప్పటికే తమ పార్టీ ఉపాధ్యక్షులు జయంత్ చౌదరి ఎస్‌సి చీఫ్ అఖిలేశ్ యాదవ్, బిఎస్‌పి చీఫ్ మాయావతిలతో చర్చించారని మసూద్ తెలిపారు.

రాజ్యసభ 'పొడిగింపు'పై విమర్శలు

న్యూఢిల్లీ: నిబంధనలకు, విధానాలకు నీళ్లొదిలి రాజ్యసభ ప్రస్తుత శీతాకాల సమావేశాలను ఒక రోజు పొడిగించారని ప్రతిపక్షాలు బుధవారం ఆరోపించాయి. సమావేశాలను ఒక రోజు పొడిగించడం తమకు చెప్పలేదని, తమ అనుమతి తీసుకోలేదని విమర్శించాయి. రాజ్యసభ సమావేశాలను ఒక రోజు పొడిగించడాన్ని విమర్శిస్తూ కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, అన్నా డిఎంకె సభ్యులు పార్లమెంరీ కార్యకలాపాల గురించిన రూల్ బుక్‌ను ఉదహరించాయి. దీన్ని తన వ్యక్తిగత పొరపాటుగా భావించాలని, మంగళవారం సభ ముగిసే ముందు చెప్పకపోవడం తన అవగాహనా లోపమేనని రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ వివరణ ఇచ్చారు. ముఖ్యమైన చర్చనీయాంశాలు పెండింగ్ లో ఉన్నాయి కనుక సభ పొడిగింపునకు నిబంధనల ప్రకారం రాజ్యసభ ఛైర్మన్ నిర్ణయం తీసుకుంటారని ఆర్థికమంత్రి, సభా నాయకుడు అరుణ్ జైట్లీ అన్నారు.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666